

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 241


బుధవారం 22-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



4.7 లక్షల కోట్ల వ్యాపారం

ఈసారి పెళ్లిళ్ల సీజన్‌లో ఆ మేర వ్యాపారం జరగొచ్చని సీఏఐటీ అంచనా. -15లో



దేశ ప్రయోజనం కోసమే..

జమిలి ఎన్నికల విధానం దేశ హితం కోసమేనని రామ్‌నాథ్ చెప్పారు. -6లో

న్యూస్‌రీల్

వచ్చే మూడ్రోజులు పలుచోట్ల తేలికపాటి వానలు



రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పలుచోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో పలుచోట్ల తేలికపాటి, ఒకట్రెండు చోట్ల మోస్తరు వానలు కురుస్తాయని సూచించింది.

- వివరాలు 16లో ▶

'నేషనల్ హెరాల్డ్' ఉదంతం.. రూ.752 కోట్ల ఆస్తుల అటాచ్



నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక యాజమాన్య హక్కులున్న యంగ్ ఇండియా సంస్థకు సంబంధించిన లావాదేవీల్లో మనీ లాండరింగ్ జరిగిందంటూ దాఖలైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది.

- వివరాలు 6లో ▶

కరోనా టీకాతో తప్పిన ఆకస్మిక మరణాల ముప్పు



కోవిడ్-19 వ్యాక్సిన్ యువతకు చాలా మేలు చేసినట్లు ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడైంది. ఈ టీకాతో యువతలో ఆకస్మిక మరణాల ముప్పు చాలావరకు తగ్గినట్లు తేలింది. ఒక డోసు తీసుకున్న వారిలోనూ ఆకస్మిక మరణాలు తగ్గాయని వెల్లడించింది.

- వివరాలు 6లో ▶

శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు బద్రీనాథ్ కన్నుమూత



- వయోభారంతో చెన్నైలో తుదిశ్వాస
- పేదలకు ఉచితంగా వైద్య సేవలు -16లో ▶



దోర్నకల్‌లో మాట్లాడుతున్న కేసీఆర్



వైరాలో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



కాంగ్రెస్‌కు 20 సీట్లే!

ఆ పార్టీ గెలిచేది లేదు.. సచ్చేది లేదు.. అంతా డ్రామా • మధిర, వైరా, డోర్నకల్, సూర్యాపేట సభల్లో కేసీఆర్

- బీఆర్‌ఎస్ గతంలో కన్నా 4 సీట్లు ఎక్కువే గెలుస్తుంది
- 70 చోట్ల ప్రచారం చేశా.. ఇంకా 30 చోట్లకు వెళ్లాలి
- నేను ఎలా ప్రచారానికి వెళ్తున్నానో.. అలా కాంగ్రెస్ ఊడ్చుకుపోతోంది
- బీజేపీకి ఓట్లు వేస్తే మోరీలో పడేసినట్లే..
- దానికి బదులు బీఆర్‌ఎస్‌కు వేస్తే అభ్యర్థుల మెజారిటీ అయినా పెరుగుతుంది.. ఈసారి అధికారంలోకి రాగానే గిరిజన బంధు అమలు చేస్తామని హామీ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, మహబూబాబాద్/సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వాళ్లు కొత్త డ్రామా మొదలుపెట్టారని.. ఆ పార్టీకి గతం లోలా 20 సీట్లకన్నా ఎక్కువ రావని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు గత ఎన్నికల కంటే ఈసారి మరో నాలుగు సీట్లు ఎక్కువే వస్తాయని, తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వందశాతం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆగమాగం, గత్తర గత్తర చేస్తుందని.. వాళ్ల మాటలు విని ఓటేస్తే ఐదేళ్లు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. తెలంగాణను ఆగం చేసిన దరిద్రపు కాంగ్రెస్‌ను గంగలో పడేసి.. బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర, వైరా, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని మరిపెడలో, సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం.. ఇక్కడి ప్రజల కోసం. నాడు ఉన్న తెలంగాణను ప్రజలు

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర తలసరి అప్పు సంగతేంటి?

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్న

29 నెలలపాటు దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైంది తెలంగాణలోనే..

ఐదేళ్లలో ఒక్కరోజైనా రాష్ట్రానికి రుణం ఇవ్వకుండా ఆపామేమో కేసీఆర్ నిరూపించాలని సవాల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఆర్థిక నిర్వహణ అధ్వానంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఏకంగా 29 నెలలపాటు దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన రాష్ట్రంగా నిలిచిందని విమర్శించారు. దీనివల్ల ధరాభారం పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మలా సీతారామన్ కేసీఆర్ సర్కారు పాలనపై విరుచుకుపడ్డారు.

మోటార్లకు మీటర్లు పెట్టకుండా అదనపు రుణాలు ఎలా?

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు నిరాకరించినందుకే గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇవ్వాల్సిన రూ. 25 వేల కోట్ల నిధులను నిలిపేసిందంటూ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలను నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. గత ఐదేళ్లలో ఒక్కరోజైనా రాష్ట్రానికి రుణం ఇవ్వకుండా కేంద్రం ఆపిందేమో నిరూపించాలని సవాలు విసిరారు. విద్యుత్ సంస్కరణల అమల్లో భాగంగా అదనపు రుణం కావాలంటే వ్యవసాయ

మిగతా 3వ పేజీలో ▶



బరిలోకి బడా నేతలు

ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అతిరథ మహారథులు

నేడు అలంపూర్, నల్లగొండల్లో ఖర్గే పర్యటన..

24న రాహుల్, ప్రియాంక రాక.. సోనియానూ రప్పించాలని యోచన

ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఓ ఏఐసీసీ నేత ప్రతిరోజూ ఉండేలా టీపీసీసీ ప్లాన్

సాక్షి, హైదరాబాద్: ప్రచార పర్వం మరో వారం రోజులే మిగిలిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బడా నేతలను రంగంలోకి దింపుతోంది. ఎన్నికల్లో చాలా కీలకమైన ఈ వారం రోజుల పాటు బలమైన నాయకత్వాన్ని ప్రజల్లోకి పంపడం ద్వారా ప్రచార రేసులో ఇతర పార్టీల కంటే ఎక్కడా వెనకబడ్డామనే భావన కలగకుండా ఉండేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, అగ్ర నేత రాహుల్ గాంధీలతో పాటు వీలును బట్టి సోనియాగాంధీని కూడా చివరి వారంలో బరిలోకి దింపనుంది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ప్రతిరోజూ ఏఐసీసీకి చెందిన ఓ ముఖ్య నేత ప్రచారం ఉండేలా సునీల్ కనుగోలు టీం షెడ్యూల్ రూపొందిస్తోంది.

హైదరాబాద్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇందుకోసం మంగళవారం సాయంత్రమే ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, నేతలు హర్కర వేణుగోపాల్, ఫహీమ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి హోటల్ తాజ్‌కృష్ణకు వెళ్లిన ఖర్గే అక్కడ రాష్ట్ర పార్టీ

మిగతా 5వ పేజీలో ▶

కేసులున్నవారే.. కానీ యోగ్యులు!



- నేరారోపణలు ఉన్న వారికి టికెట్లు ఇవ్వడంపై రాజకీయ పార్టీల వివరణ
- పార్టీకి విధేయులను ఎంపిక చేశామని పేర్కొన్న బీఆర్‌ఎస్
- యోగ్యతల విషయంలో వారికి దరిదాపుల్లో వేరేవారు లేరని వెల్లడి
- కార్యకర్తల అభీష్టం మేరకే ఎంపిక చేశామన్న కాంగ్రెస్ పార్టీ
- సదరు అభ్యర్థులు మాజీ ఎమ్మెల్యేలు/మంత్రులు కావడమే కారణమని వివరణ
- ఇంకా అభ్యర్థులపై డిక్లరేషన్ ప్రకటించని బీజేపీ

3లో



అభివృద్ధికి అందలమా.. మార్పునకు పట్టమా?

ఉద్యమాల గడ్డ.. రాజకీయ చైతన్య అడ్డా.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలంగాణ ఏర్పాటు తర్వాత రాజకీయ సమీకరణాలు మారాయి. 2018 నాటికి జిల్లాలోని మెజారిటీ అసెంబ్లీ స్థానాల్లో అధికార బీఆర్‌ఎస్ పట్టు సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అనే వాతావరణం కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాల్లో నెలకొన్న క్షేత్రస్థాయి రాజకీయ ముఖచిత్రంపై ప్రత్యేక కథనం..

బహుజన వాదం బలపడేనా.. వినబడేనా.?



- 1994 నుంచి ఉనికి చాటుకోవాలని బీఎస్పీ యత్నం
- 2014లో ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలిచి టీఆర్‌ఎస్‌లోకి..
- ఈసారి మాజీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్రమంతా పోటీ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ త్రిముఖ పోటీలో బీఎస్పీ ఉనికి చాటుకునే ప్రయత్నం

- వివరాలు 7లో

రామాయణం, భారతం ఇక 'సాంఘికం'



రామాయణ, మహాభారతాలను పాఠశాల విద్యార్థులకు సాంఘికశాస్త్ర పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా బోధించాలని జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్యానెల్ సిఫార్సు చేసింది. 'దేశభక్తి, భారతదేశ ఘన చరిత్ర చూసి మనం ఎంతగా గర్వపడాలో తెలిపేలా పాఠ్యాంశాలు ఉండాలి. కొన్ని బోర్డులు ఇప్పటికే రామాయణ, మహాభారతాలను బోధిస్తున్నాయి. అయితే ఇప్పుడు అది విస్తృతస్థాయిలో జరగాలి' అని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ సీఐ ఇసాక్ చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా పాఠశాల పాఠ్యాంశాలను ఎన్‌సీఈఆర్‌టీ పునర్వ్యవస్థీకరిస్తున్న విషయం తెల్సిందే.

- వివరాలు 6లో

ప్రాజెక్టులు కట్టింది.. ఇందిరమ్మ రాజ్యమే..



వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట సభల్లో రేవంత్‌రెడ్డి

- 75 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డకు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చింది
- కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుందని ఫైర్

బిజినేపల్లి సభకు హాజరైన ప్రజలు, ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్/రహమత్‌నగర్: పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో దొరల రాజ్యం కావాలో, ఇందిరమ్మ రాజ్యం కావాలో ఆలోచించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గడీల పాలన కావాలో, పేదల ప్రజాప్రభుత్వం కావాలో నాలుగు కోట్ల ప్రజలు నిర్ణయించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం మిడతల దండులా పదేళ్లు దోచుకుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగులకు ద్రోహం చేసి, ఉద్యమకారులకు అన్యాయం చేసిన కేసీఆర్ చీడను వదిలించుకోవాలన్నారు. మంగళవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వనపర్తి జిల్లాకేంద్రంతోపాటు, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, అచ్చంపేటలో నిర్వహించిన బహిరంగసభల్లో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం రూ.2వేల పెన్షన్ అందుతోంది. ఈ నెలలో సీఎం కేసీఆర్‌ను బొందపెట్టండి.. వచ్చే నెలలో రూ.4వేల పెన్షన్ ఇస్తా' అని చెప్పారు.

కేసీఆర్‌కు రాజకీయ భిక్ష కాంగ్రెస్ పుణ్యమే..

కేసీఆర్ ఇందిరమ్మ రాజ్యం గురించి బరి తెగించి మాట్లాడుతున్నారని, సాగర్, శ్రీశైలం, జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు నిర్మించింది ఇందిరమ్మ రాజ్యమేనని రేవంత్ చెప్పారు. కేసీఆర్‌కు మొదట సింగిల్‌విండో డైరెక్టర్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవులతో రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. ఆయన ఊరు

మిగతా 5వ పేజీలో ▶

అందరం ఒక్కటవుదాం



ఢిల్లీ గద్దల నుంచి తెలంగాణను కాపాడుకుందాం

దుబ్బాక, సిరిసిల్ల రోడ్‌షోల్లో మంత్రి కేటీఆర్

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే ఢిల్లీదే పెత్తనం
- తెలంగాణపై కేసీఆర్‌కున్న ప్రేమ వాళ్లకు ఉండదు
- కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవు
- జనవరిలో కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు ఇస్తాం

సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

దుబ్బాక టౌన్/సిరిసిల్ల: ఢిల్లీ చేతిలో మన జుట్టు పెట్టవద్దని, కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే ఢిల్లీయే పెత్తనం చెలాయిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్‌కు 11 సార్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని చావగొట్టిందని, ఆ పార్టీకి ఓటేస్తే మళ్లీ చీకటి రోజులొస్తాయని 50 ఏళ్లు వెనక్కిపోతామని అన్నారు. అందరం ఒక్కటై ఢిల్లీ గద్దల నుంచి తెలంగాణను కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు పొరపాటున కూడా ఓటు వేయవద్దని కోరారు. తెలంగాణపై సీఎం కేసీఆర్‌కున్న ప్రేమ ఢిల్లీ రాహుల్‌కి, మోదీకి ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్‌లో, సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్డు షోల్లో ఆయన ప్రసంగించారు.

మీకెందుకు చాన్స్ ఇయ్యాలి?

'కాంగ్రెసోళ్లు ఒక్క చాన్స్ ఇవ్వమని అడుగుతున్నారు. 55 ఏళ్లలో 11 సార్లు అవకాశం ఇస్తే ఏం వెలగబెట్టారు? ఇప్పుడు మళ్లీ చాన్స్ ఇచ్చి ఎరువుల కోసం

మిగతా 2వ పేజీలో ▶

ప్రభుత్వ ఉద్యోగాల గణాంకాలతో వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్ 2లో

క్లుప్తంగా...

రుణమాఫీ కాకుంటే నేనే చెల్లిస్తా: పాడి కౌశిక్‌రెడ్డి



వీణవంక మండలం గంగారంలో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

వీణవంక: రైతు రుణమాఫీపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.17 వేల కోట్ల రుణమాఫీని ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించిందని, మరో రూ.2 వేల కోట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా వారం రోజుల్లో ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ప్రతీరైతుకు రుణమాఫీ అవుతుందని, రుణమాఫీ కానివారు ఎవరైనా ఉంటే తన దగ్గరకు రావాలని, డబ్బులు బ్యాంకులో పడనివారికి తాను చెల్లిస్తానని కౌశిక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రుణమాఫీపై సీఎం కేసీఆర్ పూర్తి క్లారిటీతో ఉన్నారని, అందరికీ వారం రోజుల్లోపు వారి ఖాతాలో డబ్బు జమ అవుతుందని తెలిపారు.

బీసీ బిల్లుపై బీజేపీ ప్రకటన చేయాలి: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ(హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రిని ప్రకటిస్తే సరిపోదని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లపై బీజేపీ విధాన ప్రకటన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు రాష్ట్రాలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించని బీజేపీ తెలంగాణలో రాజకీయలబ్ధి కోసమే హామీ ఇచ్చిందన్నారు. బీసీలపట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని అన్నారు. కేంద్రంలో బీసీలకు ఏటా రెండు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించి జాతీయస్థాయిలో స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, స్టడీ సర్కిళ్లు, రూ.10 లక్షల బీసీబంధు ప్రవేశపెట్టాలని ప్రధాని మోదీని కోరారు.

పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించుకుందాం: జాజుల



పంజగుట్ట (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీలకు చెందిన 85 మంది బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా బీసీలు అంతా ఐక్యమై గెలిపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీలకు టికెట్లు ఇస్తే గెలవరని అవహేళనగా మాట్లాడుతున్న నాయకులకు బీసీల ఓటు బీసీలకే అని రాజకీయ ఐక్యత చాటాల్సిన అవసరం వచ్చిందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ...బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల, విద్యార్థి, మహిళా సంఘాలు అన్ని సమావేశమై రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వకుండా బీసీ అభ్యర్థులకే మద్దతు ఇద్దామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని ప్రకటించిందని, బీసీ అభ్యర్థులకు మిగిలిన పార్టీల కన్నా ఎక్కువ సీట్లు ఇవ్వడాన్ని హర్షణీయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామని, బీసీ రిజర్వేషన్లు 42% కుపెంచుతామని హామీ ఇవ్వడం కూడా మంచి పరిణామమన్నారు. బీఆర్‌ఎస్ తొలి నుంచి బీసీలను మోసం చేస్తూనే ఉందని చెప్పారు.

బీజేపీకి మద్దతు నిర్ణయం హాస్యాస్పదం

మందకృష్ణపై మండిపడ్డ వంగపల్లి



ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసిన బీజేపీ, బీసీని సీఎంగా చేస్తానంటే ఆయన ఎలా నమ్ముతున్నారని ప్రశ్నించారు. గతంలో బీసీ నేతలు రాజకీయపార్టీలు పెట్టినప్పుడు, బీజేపీ బండి సంజయ్‌ని మార్చి కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేసినప్పుడు మంద కృష్ణకు బీసీ నినాదం గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకి మద్దతు ఇవ్వాలంటూ ఆయన మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏదో ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం, వర్గీకరణ అంశాన్ని పక్కకు నెట్టివేయడం మందకృష్ణకు అలవాటుగా మారిందని విమర్శించారు.





మంగళవారం సూర్యాపేటలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు ● దోర్నకల్ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

కాంగ్రెస్‌కు 20 సీట్లే!

▶ మొదటి పేజీ తరువాయి

వద్దని మొత్తుకున్నా ఆంధ్రాలో కలిపారు. 58 ఏళ్ల గోసపడ్డాం. 1969లో ఉద్యమం వస్తే 400 మందిని పిట్టల్లా కాల్చి చంపేశారు. మళ్లీ ఉద్యమం మొదలుపెడితే.. కాంగ్రెస్ తెలంగాణ ఇస్తామని పొత్తు పెట్టుకుని ధోకా చేసింది. కేసీఆర్ శవయాత్రనా.. తెలంగాణ జైత్రయాత్రనా అని మొండిగా ముందుకు పోయిన. సకల జనుల సమ్మెతో రోడ్లపై పడి ఆందోళనలు చేసి, ఎన్నో బాధలు పడినం. దిక్కులేక కాంగ్రెస్ దిగొచ్చి తెలంగాణ ఇచ్చింది. కాంగ్రెస్‌ది మొత్తం మోసాల చరిత్రనే. అలాంటి కాంగ్రెస్ కావాలా?

రాష్ట్రంలో ఏ ప్రాంతమైనా కేసీఆర్‌దే..

తెలంగాణ రాకముందు పేదలు, దళితుల బతుకులు ఎట్లా ఉండె, రైతుల బాధలు ఎట్లా ఉండె ఆలోచించాలె. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నయంటే.. ఎండిపోయిన వరి పట్టుకుని వచ్చేవారు. గత పదేళ్లలో 24 గంటలు కరెంటు వస్తోంది. ఎక్కడా ఒక ఎకరం పొలం ఎండుతలేదు. ఇంతకుముందు రెండుసార్లు మధిరలో మీరు మమ్మల్ని గెలిపించలేదు. అయినా నేను మీ మీద అలగలేదు. మధిర నాది. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఇంచు అయినా కేసీఆర్‌దే. ప్రతీ ఇంచు బాగుపడాల్సిందే.

మోదీ రాష్ట్రంలో దళితులపై దాడులు

స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా దేశంలో దళితుల పరిస్థితి దారుణంగానే ఉంది. ఇది దేశానికి క్షేమం కాదు. ప్రధాని మోదీ రాష్ట్రం గుజరాత్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో దళితులపై దాడులు, తీవ్ర వివక్ష కొనసాగుతున్నాయి. ఇది పోవాలి. తెలంగాణ దళితబంధు దేశ దళితజాతికి మార్గదర్శకం చేయాలి. దళితుల బాగు కోసం రూ.10 లక్షలు ఇచ్చి ఊరుకోవడం కాదు. బార్లు, వైన్‌షాపులు, ప్రభుత్వ పనుల్లో కూడా రిజర్వేషన్లు పెట్టాం. బీఆర్‌ఎస్ అభ్యర్థి కమల్‌రాజ్‌ను గెలిపిస్తే మధిర నియోజకవర్గమంతా దళితబంధు అమలు చేస్తాం. భట్టి విక్రమార్కతో వచ్చేదేమీ లేదు. మిమ్మల్ని మాయామశ్చీంద్ర చేస్తున్నారు. ముఖ్యమంత్రి అవుతానని అంటున్నారు. ఆ పార్టీ గెలుస్తదా? ఇంకెక్కడి సీఎం?

> కాంగ్రెస్ గెలిచేది లేదు.. సచ్చేది లేదు. అంతా ఉత్త గ్యాస్. మళ్లీ అవే 20 సీట్లు.. 20కన్నా తక్కువే వస్తయి. వాళ్లది ఉట్టి దంబాచారం. మధిర పర్యటనతో నేను 70 నియోజకవర్గాల్లో ప్రచారం చేశా.. ఇంకా వెళ్లాల్సినవి 30 ఉన్నాయి. నేనెట్లా ప్రచారానికి పోతున్ననో అక్కడ కాంగ్రెస్ ఊడ్చుకుపోతున్నది. మళ్లీ అద్భుతమైన మెజార్టీతో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో అనుమానం లేదు.

కాంగ్రెస్‌ది భూమాత కాదు.. భూమేత!

కాంగ్రెస్ వస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తరట. ఇప్పటిదాకా అమ్మను చూడు, బొమ్మను చూడు అంటూ మస్తుగ ఓట్లు గుద్దుకున్నరు. కానీ ఏం జరిగింది? కరెంట్ వచ్చిందా.. నీళ్లు వచ్చాయా? తెలంగాణకు అయితే మరీ అన్యాయం. ఉత్త కథలు, సొల్లు పురాణాలు చెప్పి ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. మా కార్యక్రమాల్లో మానవీయ కోణం ఉంటే కాంగ్రెస్ రాజ్యంలో రాక్షసకోణం ఉంది. కాంగ్రెస్ మూడు గంటలే కరెంట్ ఇవ్వాలంటోంది. రైతుబంధు ఇవ్వొద్దంటోంది. వాళ్లకు వాళ్లు పంచుకుతినాలనే ఈ మాట అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో వేసి భూమాత పెడతామని అంటున్నారు. అది భూమాతనా.. భూమేతనా? రైతుబంధు కొనసాగాలన్నా, బీమా అందాలన్నా, భూములకు రక్షణ కావాలన్నా ధరణి ఉండాలి. ఇది జీవన్మరణ సమస్య. బీఆర్‌ఎస్ సర్కారు మళ్లీ రావాలి.

గిరిజనబంధు అమలు చేస్తాం

మేం మళ్లీ గెలవగానే రాష్ట్రంలో గిరిజన బంధు అమలు చేస్తాం. ఆటోరిక్షాల పర్మిట్, ఫిట్‌నెస్ ఫీజులు రద్దుచేస్తాం. ప్రభుత్వం వచ్చిన తెల్లారే ఈ మేరకు ఉత్తర్వులు జారీచేస్తాం. పింఛన్లను దశలవారీగా రూ.5వేలకు పెంచుతాం. రైతుబంధును రూ.16 వేలకు పెంచుతాం'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

బీజేపీ మన నోట్లో మట్టి కొట్టింది

బోర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోదీ అంటే.. నేను అందుకు ఒప్పుకోలేదు. దాంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.25 వేల కోట్లు ఇవ్వలేదు. స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మన నోట్లో మట్టి కొట్టామని సిగ్గు లేకుండా చెప్పారు. దీనిపై ప్రజలు ఆలోచన చేయాలి. కేంద్ర ప్రభుత్వం దేశంలో 157 మెడికల్ కాలేజీలు పెట్టినా మనకు ఒక్కటీ ఇవ్వలేదు. ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వలేదు. అలాంటి బీజేపీకి ఓట్లు వేస్తే మోరీలో పడేసినట్లే. ఆ ఓట్లన్నీ బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వేస్తే మెజారిటీ అయినా పెరుగుతుంది.

నోట్ల కట్టల ఆసాములకు ఓటుతో బుద్ధి చెప్పాలి

ఇక్కడ (ఖమ్మం జిల్లాలో) అహంకారంగా మాట్లాడే కొందరి నోట్ల కట్టలు హైదరాబాద్‌లో దొరికాయి. బీఆర్‌ఎస్‌ను అసెంబ్లీ గడప తొక్కనీయమని కొందరు అన్నారు. అసెంబ్లీకి ఎవర్ని పంపాలో నిర్ణయించేది ప్రజలు. నోట్ల కట్టల ఆసాములకు ఓటుతో బుద్ధి చెప్పాలి. మాజీ మంత్రి ఒకాయన (తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి) మాటలు నరుకుతుండు కదా? ఈ నరికినోళ్లు గోదావరి నది నీళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తెచ్చుకోవాలని ఎందుకు ఆలోచన చేయలేదో నిలదీయండి.

ప్రభుత్వోద్యోగ గణాంకాలతో వెబ్‌సైట్

ప్రారంభించిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు భర్తీ చేసిన ఉద్యోగ వివరాలతో కూడిన ప్రత్యేక వెబ్‌సైట్ www.telanganajobstats.inను మంత్రి కె.తారక రామారావు మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వోద్యోగాల భర్తీ విషయంలో ప్రతిపక్ష పార్టీలు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించిన కేటీఆర్... దీనిపై వాస్తవ సమాచారాన్ని వెల్లడించేందుకే ఈ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగాల భర్తీ వివరాలను అందులో పొందుపరిచినట్లు వివరించారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువతీ యువకులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి నిజాలు తెలుసుకోవాలని కోరారు. గత తొమ్మిదిన్నరేళ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించామని, వాటిలో 1.60 లక్షలకుపైగా ప్రభుత్వోద్యోగాల భర్తీని పూర్తి చేశామని కేటీఆర్ తెలిపారు. జనాభాతో పోల్చి చూసినప్పుడు దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు.

'గోండ్వానా' పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు 4 వారాలపాటు వాయిదా వేసింది. గోండ్వానా వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం దాఖలు చేసిన కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేయడానికి 4 వారాల సమయం కావాలని న్యాయవాది రమేశ్ అల్లంకి కోర్టును కోరారు.

ఓట్ల వేటలో.. అభ్యర్థుల ఎత్తుగడలు!

- గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో పోల్ మేనేజ్‌మెంట్‌పైనే ప్రధాన దృష్టి
- ఓటర్లను విభాగాలుగా విభజించి... తమ వైపు తిప్పుకునేలా కసరత్తులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలలోని పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు 'పోల్ స్ట్రాటజీ'ని కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను నాలుగు విభాగాలుగా విభజిస్తున్నారు. ఇందులో అనుకూలురు, తటస్థులు, స్థానికంగా ఓటుహక్కు కలిగి ఇతర చోట్ల నివసిస్తున్నవారు, ఇతర పార్టీల మద్దతుదారులుగా పేర్కొంటున్నారు. ఓటర్లను విభజించి..దానికనుగుణంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అందులో తమకు పక్కాగా ఓటేసేవారు, తటస్థులు, ఇతర పార్టీల మద్దతుదారులను చేర్చి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- గ్రేటర్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాల్లో పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు ప్రతిరోజు సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారాన్ని ముగించి..రాత్రి వేళల్లో ముఖ్య అనుచరులు, నాయకులు తమ వైపే ఉన్నారా లేదాఅని సమీక్షించుకుంటున్నారు. ప్రత్యర్థుల తాయిలాల వలకు చిక్కకుండా అప్రమత్తమవుతున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఆత్మీయ పలకరింపులకూ పూనుకుంటున్నారు. వయస్సు, సామాజిక వర్గాల వారిగా ఓటర్లను విభజించి వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. పోలింగ్ ముగిసే వరకూ తమవైపు అనుకూల పవనాలు వీచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటర్లను ఆకర్షించటంతో పాటు ప్రత్యర్థి శిబిరం నుంచి ముప్పు తప్పించుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలతో ముందడుగు వేస్తున్నారు.
- ఎన్నికల ప్రచారం ఎంత చేసినా, ప్రలోభపెట్టినా పోలింగ్ కేంద్రం వరకు ఓటరును తీసుకొచ్చే బాధ్యతలను ద్వితీయశ్రేణి నాయకులకు అప్పగిస్తుంటారు. దూరభారంతో ఇబ్బంది పడే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ప్రత్యేకంగా వాహనాలను కూడా సమకూర్చుతుంటారు.

ప్రసన్నం చేసుకునేలా..

వైద్యులు, మెడికల్, అసోసియేషన్లు, వాహనాల డ్రైవర్లు, చేతి, కుల వృత్తిదారులు, ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ఐటీ ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేలా ఆయా పార్టీల్లోని కీలక నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక 'పార్టీలు' తాయిలాలు..ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గం, డివిజన్/వార్డు, మండలం, బస్తీ, గ్రామస్థాయిలో ప్రాబల్యం చూపే వారి కోరికలను వెనువెంటనే తీరుస్తున్నారు. వారు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకుని ఆకర్షించేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడొద్దని ప్రధాన అనుచరులకు స్పష్టం చేస్తున్నారు.

అందరం ఒక్కటవుదాం

▶ మొదటి పేజీ తరువాయి

దుకాణాల ముందు క్యూలో నిలబడాలా? కరెంటు కోసం అర్ధరాత్రి మళ్లీ పొలాల కాడ పడుకోవాలా? అలాంటి కాంగ్రెస్ దరిద్రపు పాలన మనకు మళ్లీ కావాలా? ధరణిని తొలగించి మళ్లీ పట్వారీ విధానం అమలు చేస్తామంటున్నారు. రాహుల్, రేవంత్‌లకు ఎవుసం, ఎద్దు తెల్వదు.. ఉత్తమ్ రైతుబంధు దుబారా అంటడు.. భట్టి ధరణి వద్దు అంటాడు..ధరణి కావాలా? దళారులు కావాలా? ఎట్లున్న తెలంగాణ ఎట్ల అయ్యింది? రైతులకు కడుపు నిండా 24 గంటల కరెంట్, సాగునీరు, ఇంటింటికీ తాగునీరు, ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులకు పెన్షన్లు, కల్యాణలక్ష్మీ సాయం ఇలా ఎన్నో మంచి పనులు కేసీఆర్ చేశారు. కాంగ్రెస్ హయాంలో 29 లక్షల మందికి పెన్షన్లు వస్తే.. ఇప్పుడు 46 లక్షల మందికి వస్తున్నాయి. ఈ పనులన్నీ కాంగ్రెసోళ్లకు కనపడ్తలేవా..? మళ్లీ మీకెందుకు ఛాన్స్ ఇయ్యాలి?..' అని కేటీఆర్ ప్రశ్నించారు.



దుబ్బాకలో మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు హాజరైన జనం

అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు

'డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే, సీఎంగా కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే జనవరిలో కొత్త రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్లు అర్హులకు అందిస్తాం. బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ తేదీని సవరించి మరింత మందికి పెన్షన్ అందిస్తాం. కోడళ్లకు సౌభాగ్య లక్ష్మీ పేరిట పెన్షన్లు ఇస్తాం. తెల్ల రేషన్‌కార్డులపై సన్నబియ్యం అందిస్తాం. రైతుబంధును ఎకరానికి ఏటా రూ.16 వేలు చొప్పున ఇస్తాం..' అని కేటీఆర్ హామీ ఇచ్చారు. 'తొమ్మిదిన్నరేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయి. కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు.. గుజరాత్ నుంచి బీజేపీకి పైసలు వస్తున్నాయి. అంగట్లో పశువులను కొన్నట్లు కొంటున్నారు. మోదీ, అమిత్ షా, రాహుల్, సిద్దరామయ్య, షేర్‌లు, బబ్బర్‌ఖాన్‌లు ఎంతమంది వచ్చినా నరే సింహం సింగిల్‌గా వచ్చినట్లు కేసీఆర్ దూసుకుపోతున్నారు..' అని మంత్రి పేర్కొన్నారు.

కత్తిపోటు రాజకీయానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

'పార్టీ దుబ్బాక అభ్యర్థి ప్రభాకరన్నను ఎన్నికల్లో ఎదుర్కోలేక కత్తితో పొడిచిండ్రు. కత్తిపోటు రాజకీయాలను ఓటుతో ఎదుర్కోవాలి. రఘునందన్‌రావును చిత్తుగా ఓడించి ప్రభాకరన్నను భారీ మెజారీతో గెలిపించాలి..' అని కేటీఆర్ కోరారు. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు కరెంట్ పైనే..

- మూడు గంటలు కావాలో.. 24 గంటలు కావాలో ప్రజలే తేల్చుకోవాలి
- రూ.35వేల కోట్ల కంటే కేసీఆర్‌కు 69లక్షల మంది రైతులే ముఖ్యం
- ఆ విషయం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాటలతోనే అర్థమైంది
- హుస్నాబాద్ రోడ్‌షోల్లో మంత్రి హరీశ్‌రావు

హుస్నాబాద్/చిగురుమామిడి/ అక్కన్నపేట/కోహెడ: కరెంటు సరఫరా ప్రధాన ఎజెండాగానే ఈ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలో, 24 గంటలు కరెంట్ ఇచ్చే కేసీఆర్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న మన తెలంగాణకు వచ్చి మా రాష్ట్రంలో 5 గంటల కరెంట్ ఇస్తున్నామంటూ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లొల్లి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కాంగ్రెసోళ్లకి కరెంట్‌పై ఎంత అవగాహన ఉందో డీకే మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్ నేతలు తెలంగాణలో ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హైదరాబాద్‌కు వచ్చి మంచి ముచ్చట చెప్పారని హరీశ్ వ్యాఖ్యానించారు. బోర్ బావుల వద్ద మోటార్లు బిగించిన రాష్ట్రాలకు కేంద్ర నిధులు ఇచ్చామని, తెలంగాణలో మీటర్లు బిగించడం లేదని, అందుకే రూ.35వేల కోట్ల రూపాయల నిధులను ఆపామని ఆమె చెప్పారని వివరించారు. బోరు బావుల వద్ద మీటర్లు బిగించమని కేసీఆర్ తెగేసి చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్‌కు రూ.35వేల కోట్ల కంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 69లక్షల మంది రైతులే ముఖ్యమని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు.

కర్ణాటకలో ప్రజలు అవస్థలు పడుతున్నారు

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో హుస్నాబాద్ అభ్యర్థి సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటకలో ఐదు గ్యారంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బోల్తా పడిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మనకు కూడా 6 గ్యారంటీలని వస్తున్నారని, వారి మాటలు విని ఆగం కావద్దని హెచ్చరించారు. అక్కడి ప్రభుత్వం అన్ని ధరలు పెంచడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. నీతి లేని కాంగ్రెస్‌ను నమ్మొద్దని హెచ్చరించారు.



అక్కన్నపేట రోడ్‌షోకు హాజరైన ప్రజలు. ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రైతుబంధు, రుణమాఫీపై తకరారు

- నిధుల విడుదలకు ఈసీ అనుమతి కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇంకా నిర్ణయం తీసుకోని ఈసీ
- పోలింగ్‌కు వారం ముందు అనుమతి కష్టమే అంటున్న అధికార వర్గాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుబంధు, రైతు రుణ మాఫీ అమలుతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) మంజూరుకు అనుమతించాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ధ్రువీకరించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ పథకాల అమలుకు అనుమతి కోరుతూ రెండు వారాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఈసీ పెండింగ్‌లో పెట్టింది. పోలింగ్‌కు వారం రోజుల గడువు ఉన్న నేపథ్యంలో ఓటర్లకు నగదు ప్రయోజనాలు కలిగించే ఈ పథకాలకు ఈసీ అనుమతించే అవకాశాలు కనిపించడం లేదు. యాసంగి పంటల సాగుకోసం రైతులకు రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయాల్సి ఉంది. రూ.లక్ష పంట రుణాల మాఫీకి సంబంధించి సైతం బ్యాంకులకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలను ప్రభుత్వం బకాయిపడి ఉంది. ఇంత కాలం వీటిని పెండింగ్‌లో పెట్టి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత విడుదల చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కాంగ్రెస్ ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసీ నిర్ణయాన్ని తీసుకోలేదని తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలు పూర్తయ్యాక కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం ఈ పథకాలకు నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటుందని అధికారవర్గాలు చెప్పాయి.

అద్భుతం.. 3డీ ప్రింటెడ్ ఆలయం

- శ్రీపాద కార్య సిద్ధేశ్వర స్వామి దేవస్థానంగా నామకరణం
- సిద్దిపేటలో నిర్మాణం.. 24 నుంచి భక్తులకు దర్శనం

సిద్దిపేట అర్బన్: వాస్తుశిల్ప సౌందర్యం, సాంకేతిక పరిజ్ఞానం మేళవింపుతో అసాధారణమైన రీతిలో నిర్మించిన ఆధ్యాత్మిక అద్భుతం.. ప్రపంచంలోనే మొట్టమొదటి 3డీ ప్రింటెడ్ హిందూ దేవాలయం సిద్దిపేటలో ఆవిష్కృతమైంది. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్‌తో కలిసి అప్సుజా ఇన్‌ఫ్రాటెక్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం బూరుగుపల్లి శివారులోని చర్విత మెడోస్‌లో నిర్మించిన 3డీ ప్రింటెడ్ దేవాలయానికి శ్రీపాద కార్య సిద్ధేశ్వర స్వామి దేవస్థానంగా నామకరణం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం మొదలైన ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు మరో రెండు రోజులు జరగనుండగా.. 24 నుంచి ఆలయాన్ని భక్తులు దర్శించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఐకానిక్ టెంపుల్ సాంస్కృతిక వారసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని అప్సుజా ఇన్‌ఫ్రాటెక్ మేనేజింగ్ డైరెక్టర్ హరికృష్ణ జీడిపల్లి వ్యాఖ్యానించారు.

4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో

35.5 అడుగుల పొడవు, 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని హరికృష్ణ తెలిపారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అమిత్ ఘూలే మాట్లాడుతూ.. ఆలయం భూకంపాలకు దెబ్బతినకుండా నిర్మించినట్లు తెలిపారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వసీం చౌదరి మాట్లాడుతూ గర్భగుడిలో వేదమంత్రాల ప్రతిధ్వనులతో భక్తులను మంత్రముగ్ధులను చేసేలా నిర్మాణం జరిగిందన్నారు. పూరీ జగన్నాథ ఆలయం శైలిలో గోపురం డిజైన్ చేసినట్లు వెల్లడించారు. ఆలయ నిర్మాణ పనులు 70 రోజుల్లో పూర్తయ్యాయి.



3డీ ప్రింటెడ్ విధానంలో నిర్మించిన ఆలయం

క్లుప్తంగా...

ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో 226 మంది నేరచరితులే...

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ నివేదిక



పంజగుట్ట (హైదరాబాద్): ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులే నేరచరితులైతే వారు సుపరిపాలన ఎలా అందిస్తారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రశ్నించింది. రాష్ట్రంలో మొత్తం 119 స్థానాల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి, హైదరాబాద్‌లో ఎంఐఎం నుంచి పోటీలో ఉన్న 360 మంది అభ్యర్థుల్లో 226 మంది నేరచరిత కలవారే ఉండటం బాధాకరమని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు యం.పద్మనాభరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుత అసెంబ్లీలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 38 శాతం మంది కళంకితులు ఉన్నారని, ఈసారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కొంతమందిపై తీవ్ర నేరాలు చీటింగ్, భూకబ్జాలు, మనీ లాండరింగ్ లాంటి కేసులు కూడా ఉన్నాయని, కానీ ఏ అభ్యర్థిపై హత్య, అత్యాచారం లాంటి కేసులు లేవని తెలిపారు. ఓటర్లు జాగ్రత్తగా ఓటేయాలని, నేరచరిత గల వారిని ఎన్నుకోరాదని, ఒకవేళ అభ్యర్థులు ఎవ్వరూ నచ్చకపోతే నోటాకైనా ఓటేయాలని సూచించారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టే..

బీజేపీ నేత మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినట్లేనని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు వ్యాఖ్యానించారు. తెలంగాణకు కాంగ్రెస్, ఎంఐఎం ద్రోహం చేస్తే...బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణను లూటీ చేసిందని ఆయన ఆరోపించారు. తెలంగాణకు నిజాం ఎంత ద్రోహం చేశాడో, కాంగ్రెస్ నాయకత్వం కూడా అంతే ద్రోహం చేసిందని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్ అభ్యర్థులకు 21 మందికి బీఆర్‌ఎస్ నిధులు అందిస్తోందని ఆరోపించారు. ఈ స్థానాల్లో మాస్టర్ ప్లాన్ బీఆర్‌ఎస్ ఆఫీసులోనే రూపొందుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల తీర్పును దొంగిలించేందుకు బీఆర్‌ఎస్ కుట్ర పన్నుతుంటే అధికార పార్టీ వ్యతిరేకతను సొమ్ము చేసుకుని ప్రజాతీర్పును దొంగిలించవచ్చనే ఉద్దేశంతో కాంగ్రెస్ కూడా కుట్రలకు పాల్పడుతోందన్నారు. అంబాసిడర్ కారు అవుట్‌డేటెడ్ అయిపోయిందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. బీజేపీని ఓడించేందుకు ఎంఐఎం, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. ప్రజల ఆత్మహత్యలకు కారణమై, చేసిన తప్పులకు సోనియాగాంధీ ఏనాడైనా అమరవీరుల స్తూపం ముందు సాష్టాంగ నమస్కారం చేశారా..?, తాము చేసిన తప్పులను క్షమించాలని రాహుల్ గాంధీ అమరవీరుల స్తూపం వద్ద చెంపలు వేసుకున్నారా..? అని ప్రశ్నించారు. తెలంగాణలో సరికొత్త హరిత విప్లవానికి పునాదులు వేసే మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించిందన్నారు.

సిరిసిల్లకు 'పవర్‌లూమ్ క్లస్టర్' తెస్తా

- బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమరెడ్డి హామీ
- సిరిసిల్ల నేతన్న విగ్రహం సాక్షిగా బాండ్ పేపర్ విడుదల



సిరిసిల్ల: సిరిసిల్ల నేతన్నల సమస్యల శాశ్వత పరిష్కారానికి పవర్‌లూమ్ క్లస్టర్‌ను తెస్తానని, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమరెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు సిరిసిల్ల నేతన్న విగ్రహం సాక్షిగా ఆమె మంగళవారం బాండ్ పేపర్ రాసి విడుదల చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో వస్త్ర పరిశ్రమ నిర్వీర్యమైందని ఆరోపించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ నేతన్నల జీవితాలపై చిన్నచూపు, బాధ్యతారాహిత్యంతో టెక్స్‌టైల్ పార్క్ మూతపడే స్థితికి చేరిందన్నారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు, వరంగల్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తరహాలో సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్‌ను సాధిస్తానని ఆమె బాండ్ పేపర్ విడుదల చేశారు.


ఆ ఎమ్మెల్యేలను తరమండి

మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రామగుండం, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని నిషేధిత భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీకి మద్దతు ఇస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి రాకుండా చూడాలని కోరారు.

కేసులున్నవారే.. కానీ యోగ్యులు!

- నేరారోపణలున్న వారికి టికెట్లు ఇవ్వడంపై రాజకీయ పార్టీల వివరణ
- పార్టీకి విధేయులను ఎంపిక చేశామని బీఆర్‌ఎస్ వివరణ
- వారిపై ఉన్న కేసుల్లో పస లేదని వెల్లడి
- కార్యకర్తల అభీష్టం మేరకే ఎంపిక చేశామన్న కాంగ్రెస్ పార్టీ
- సదరు అభ్యర్థులు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు కావడమే కారణమని వివరణ
- ఇంకా అభ్యర్థులపై డిక్లరేషన్ ప్రకటించని బీజేపీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో నేరారోపణలు, పోలీసు కేసులున్నవారికి అభ్యర్థులుగా అవకాశం ఇవ్వడంపై ప్రధాన రాజకీయ పార్టీలు వివరణలు ఇచ్చాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎలాంటి నేరారోపణలు లేని ఔత్సాహికుల పేర్లను సైతం పరిశీలించామని.. అయితే యోగ్యతల విషయంలో వారు నేరచరిత్ర గల అభ్యర్థులకు సాటిలేరని బీఆర్‌ఎస్ ప్రకటించింది. వారంతా పార్టీకి విధేయులని, అధినాయకత్వం చేపట్టే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో వారికి తిరుగులేదని పేర్కొంది. ఇక మాజీ మంత్రులు/మాజీ ఎమ్మెల్యేలు/ప్రస్తుత ఎంపీలు/ ఎమ్మెల్సీలు కావడంతోనే నేరచరిత్ర/కేసులున్న అభ్యర్థులను ఎంపిక చేశామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. తమ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు వారిని ఎంపిక చేశామని పేర్కొంది. ఈ మేరకు కళంకిత అభ్యర్థులకు టికెట్లు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందన్న అంశంపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తమ అధికారిక వెబ్‌సైట్లలో బహిరంగ ప్రకటనలు జారీ చేశాయి. నిబంధనల మేరకు అభ్యర్థుల నేర చరిత్రను 'ఫార్మాట్ సీ–2'రూపంలో వెల్లడించాయి. బీజేపీ ఇంకా తమ అభ్యర్థుల నేరారోపణలు, కేసుల అంశంపై ప్రకటన జారీ చేయలేదు.

మా అభ్యర్థులపై ఆరోపణలు, కేసుల్లో పసలేదు: బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ అధినాయకత్వం అభ్యర్థుల యోగ్యతలు, అయోగ్యతలను క్షుణ్నంగా పరిశీలించాకే ఎంపిక చేసిందని పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ డిక్లరేషన్‌లో ప్రకటించారు. బీఆర్‌ఎస్ తరపున పోటీచేస్తున్న 119 మంది అభ్యర్థుల్లో 57 మంది విషయంలో ఉమ్మడిగా ఈ డిక్లరేషన్ జారీ చేశారు. ప్రజాజీవితంలో ప్రశంసనీయ అనుభవాన్ని కలిగి ఉండడంతోపాటు తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తారనే ఈ అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ''అభ్యర్థులంతా విద్యావంతులేగాక సమాజంలో ఉన్నతస్థాయిల్లో ఉన్నవారే. వారిపై ఆరోపణలు, కేసుల తీవ్రతను పార్టీలోని సంబంధిత విభాగం పరిశీలించి వాటిలో పసలేదనే భావనకు వచ్చింది. అందుకే ఈ అభ్యర్థులు సరైనవారని పార్టీ అధినాయకత్వం భావించి తెలంగాణ సర్వతోముఖ అభివృద్ధి కోసం ఎంపిక చేసింది'' అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకు..

మొత్తం 52మంది అభ్యర్థులపై నేరారోపణలు, వారి ఎంపిక కారణాలను కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఒక్కో అభ్యర్థి ఎంపికపై ప్రత్యేకంగా కారణాలను వివరించింది. నేరచరిత్ర లేని ఇతర అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయలేదనే అంశంపై వివరణ ఇస్తూ.. పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు ఎంపిక జరిగిందని తెలిపింది. ప్రస్తుతం ఎంపీ కావడం, ప్రజాదరణ ఉండటంతోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కొడంగల్ స్థానానికి ఎంపిక చేసినట్టు వెల్లడించింది. పేరొందిన డాక్టర్లు, న్యాయవాదులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు కావడంతో మరికొందరిని ఎంపిక చేసినట్టు తెలిపింది.

'నేరచరిత' ప్రకటన ఎందుకు?

కేంద్ర ఎన్నికల సంఘం 2020 మార్చి 6న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న తమ అభ్యర్థులపై నేరారోపణలు/కేసుల వివరాలను 'ఫార్మట్–సీ2, ఫార్మాట్– సీ7'రూపంలో తమ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. సదరు నేరాల స్వభావం, చార్జిషీట్ దాఖలు అయిందా, కోర్టు పేరు, కేసు నంబర్ వంటి వివరాలనూ అందులో పేర్కొనాలి. దీనితోపాటు సదరు అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేశారు? నేరచరిత్ర లేని ఇతర అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేయలేకపోయారన్న వివరణను కూడా పొందుపరచాలి. అభ్యర్థుల విద్యార్హతలు, సాధించిన ఘనతలు, విజయాలు, ప్రతిభ వంటి అంశాలనూ పేర్కొనాలి. ఈ సమాచారాన్ని ఒక ప్రాంతీయ, ఒక జాతీయ పత్రికలో సైతం ప్రచురించాలి. రాజకీయ పార్టీకి సంబంధించిన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లోనూ ఈ వివరాలను వెల్లడించాలి.

ఫ్యామిలీ రాష్ట్ర సమితిగా మార్చుకోండి

- బీఆర్‌ఎస్ పాలన మొత్తం అవినీతిమయమే
- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ ధ్వజం
- బీజేపీ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో భారీ బైక్ ర్యాలీ
- హాజరైన ఫడ్నవీస్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్



బైక్‌ర్యాలీలో మాట్లాడుతున్న ఫడ్నవీస్. చిత్రంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, పూసరాజు

కవాడిగూడ: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పేరును ఫ్యామిలీ రాష్ట్ర సమితిగా మార్చుకోవాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ ఎద్దేవా చేశారు. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబం తెలంగాణలోని వనరులను అడ్డగోలుగా దోచుకుందని ధ్వజమెత్తారు. ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజును గెలిపించాలని కోరుతూ మంగళవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడ ఏవీ కళాశాల నుంచి భారీ బైక్‌ర్యాలీని నిర్వహించారు. ర్యాలీనుద్దేశించి ఫడ్నవీస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కేవలం తన కుటుంబ ఆస్తులను ఏవిధంగా పెంచుకోవాలనే ఆలోచనతోనే పాలన సాగించారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ పథకాల ప్రచారానికి చేసిన ఖర్చుతో రాష్ట్రంలోని దళిత కుటుంబాలను మొత్తం అభివృద్ధి చేయవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలను కొనే పార్టీ బీఆర్‌ఎస్ అయితే, అమ్ముడుపోయే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు ఒక్కటేనని ఆరోపించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే బీఆర్‌ఎస్‌కి గొర్రెల్లా అమ్ముడు పోతారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే తెలంగాణలో బీసీల రాజ్యం వస్తుందని భరోసానిచ్చారు.

ముషీరాబాద్ బాధ్యత నాదే

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి పూసరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే తప్ప బీఆర్‌ఎస్ పార్టీ చేసింది ఏమీలేదన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన పూసరాజును గెలిపిస్తే ముషీరాబాద్ అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్లు జి. రచనశ్రీ, కె.రవిచారి, సుప్రియా నవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కాదు కేఆర్‌ఎస్ పార్టీ అని పెట్టాల్సింది

తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై



హఫీజ్‌పేట (హైదరాబాద్): భారత రాష్ట్ర సమితి పార్టీ (బీఆర్‌ఎస్) అని కాకుండా కల్వకుంట్ల రాష్ట్ర సమితి పార్టీ (కేఆర్‌ఎస్) అని పేరు పెట్టుకోవాల్సిందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కరుణ, బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కన్వీనర్ రాఘవేందర్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ...తెలంగాణలో మద్యం అమ్మకాలతో ఆదాయం భారీగా పెరిగినప్పటికీ ప్రజలు మద్యానికి బానిసలు కావడం చాలా ప్రమాదకరమైన పరిణామమన్నారు. తమిళనాడు, తెలంగాణలకు దగ్గర పోలికలున్నాయని, రెండు చోట్లా అవినీతి, కుటుంబ పార్టీలు ఏలుతున్నాయని విమర్శించారు. రెండు రాష్ట్రాల్లో విద్య, వైద్యం సహా అన్నిరంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2009 నుంచి 2014 వరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా చేసిన భిక్షపతి యాదవ్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు తన తనయుడు రవికుమార్ యాదవ్ వస్తున్నారని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర తలసరి అప్పు సంగతేంటి?

▶ మొదటి పేజీ తరువాయి

పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని చెప్పామే తప్ప అది తప్పనిసరని చెప్పలేదని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం కేంద్రం ఒక్కో రాష్ట్రం అప్పుల పరిస్థితిని సమీక్షిస్తుందని... అన్నిచోట్లా విద్యుత్ మీటర్లు పెట్టినట్లు నివేదిస్తే ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి అదనంగా 0.25 శాతం రుణ పరిమితి పొందే వెసులుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో మీటర్లు పెట్టకుండా, ఆ మేరకు వచ్చే అప్పులు కూడా ఇవ్వాలంటే ఎలా కుదురుతుందని నిర్మల ప్రశ్నించారు. తాము ఎక్కడా తెలంగాణ రాష్ట్రం అప్పులు లేదా బదులు తీసుకోవడాన్ని ఆపలేదని స్పష్టం చేశారు. కానీ ఈ అంశంపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రధాని మోదీపై విమర్శలు చేస్తూ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు.

మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

బంగారం లాంటి మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చేసి రెండు తరాలపై అప్పుల భారం మోపడం వాస్తవం కాదా? అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. తెలంగాణలో తలసరి ఆదాయం ఎక్కువంటూ గొప్పగా మాట్లాడుతున్న అధికార పార్టీ నేతలకు దమ్ముంటే తలసరి అప్పు గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. పెద్ద మొత్తంలో అప్పులు తీసుకున్నా వాటితో ఆస్తుల కల్పన చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నిర్మల దుయ్యబట్టారు.

బీఆర్‌ఎస్‌ను ఎవరూ బలపరచనందుకే మళ్లీ తెలంగాణవాదం..

టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చడం ద్వారా ఇతర విపక్షాలను కూడదీసుకొని ప్రధాని కావాలని కేసీఆర్ కన్న కలలు కల్లలు అయ్యాయని... ఆయన్ను ఎవరూ బలపరచకపోవడంతో గత్యంతరం లేక మళ్లీ తెలంగాణ నినాదాన్ని కేసీఆర్ తలకెత్తుకున్నారని నిర్మలా సీతారామన్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. దీన్ని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో అందుకు తగ్గట్లుగా తీర్పునిస్తారని చెప్పారు.

కేసీఆర్ అవినీతిపై విచారణ చేయిస్తాం..

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సర్కార్ అవినీతిపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బీసీ నేతను సీఎంను చేయడంతోపాటు ఎస్సీ వర్గీకరణపై ప్రధాని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ అమలుతోపాటు పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు కూడా ప్రకటించినందున ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్డినెన్స్ జారీ సాధ్యం కాదని మరో ప్రశ్నకు నిర్మల బదులిచ్చారు.

జూబ్లీహిల్స్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

వెంగళరావునగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ కాలనీ చౌరస్తాలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పలువురు ముఖ్యనేతలతో కేంద్ర మంత్రి నిర్మల మంగళవారం మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇది తన మొదటి సమావేశమన్నారు. తెలంగాణలో ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవన్నారు. జూబ్లీహిల్స్‌లో యువ అభ్యర్థి బీజేపీ తరపున బరిలో ఉన్నారని, ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతిచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకెల దీపక్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నేతలు గౌతంరావు, కిలారి మనోహర్, గంగరాజు, రామకృష్ణ, ప్రేమ్, కీర్తిరెడ్డి, సుప్రియా, రూప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ స్థానాల్లో కాంగ్రెస్ లేదా బీఆర్‌ఎస్‌కు మద్దతు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో నిర్ణయం
- ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందు పిలుపు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ గెలిచే అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో, ఆ పార్టీ ద్విముఖ పోటీ ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నచోట.. బీఆర్‌ఎస్ లేదా కాంగ్రెస్ లేదా ఇతర వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల్లో ఏదో ఒక పార్టీకి మద్దతు ఇవ్వాలని సీపీఎం నిర్ణయించింది. బీజేపీని ఓడించే అవకాశం ఉన్న పార్టీలకు మాత్రమే మద్దతు ఇవ్వాలని భావిస్తోంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం మంగళవారం ఆన్‌లైన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికలు, వివిధ పార్టీల పరిస్థితి, గెలుపు ఓటములపై పార్టీ చర్చించింది. తాము పోటీ చేస్తున్న 19 నియోజకవర్గాల్లో పరిస్థితిని అంచనా వేసింది. ఈ నియోజకవర్గాల్లో పార్టీ ఓటింగ్‌ను ఏమాత్రం చేజారనీయకుండా గట్టిగా పోరాటం చేయాలని, ఆ మేరకు కార్యకర్తలను కార్యోన్ముఖం చేయాలని పార్టీ నేతలు నిర్ణయించారు. తాము పోటీ చేసే నియోజకవర్గాల్లో గణనీయంగా ఓట్లు సాధించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గం పిలుపునిచ్చింది.


ముక్కోణపు పోటీ ఉంటే ఏంచేయాలి?

రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలుండగా, అందులో సీపీఎం 19 స్థానాల్లో పోటీ చేస్తుండటం తెలిసిందే. ఆ స్థానాలపై ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. మిగిలిన 100 స్థానాల్లో వివిధ పద్ధతుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న దానిపై చర్చించారు. 40 స్థానాల్లో బీజేపీ గట్టి పోటీ లేదా గెలవగలిగే పరిస్థితి ఉందని సీపీఎం వర్గాలు భావిస్తున్నాయి. వీటిల్లో అధికంగా బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందంటున్నారు. అంటే ఆయా స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు సీపీఎం మద్దతు ఇచ్చే అవకాశముంది. మిగిలిన స్థానాల్లో బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య గట్టి పోటీ ఉంటుందని అనుకుంటున్నారు. అలాంటిచోట కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలనేది సీపీఎం సూత్రప్రాయ నిర్ణయం. ఇక బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు నువ్వా నేనా అన్నట్టు ముక్కోణపు పోటీ ఉండే చోట్ల బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలా? లేక కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలా? అన్నదానిపై నిర్ణయం తీసుకోలేకపోతోంది.

ఏకపక్ష మద్దతు సరైనదేనా?

ముక్కోణపు పోటీ ఉన్నచోట్ల ఏకపక్షంగా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడం సరైనదేనా అన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. కాంగ్రెస్‌తో పొత్తు చిత్తయిన నేపథ్యంలో ఆ పార్టీకి ఆయా చోట్ల మద్దతు ఇవ్వడం వల్ల క్యాడర్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కమిటీలు మరోసారి సమావేశమై ఏ నియోజకవర్గాల్లో ఏ పార్టీకి మద్దతు ఇస్తే బాగుంటుందో తెలియజేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గం సూచించింది. రెండు మూడు రోజుల్లో దీనిపై జిల్లా కమిటీలు స్పష్టత ఇవ్వాలని పేర్కొంది. ఆ ప్రకారం జిల్లా కమిటీలు ఏ పార్టీకి ఓటు వేయాలో క్యాడర్‌కు తెలియజేస్తారు. బహిరంగంగానే వైఖరి చెబుతారా లేక అంతర్గతంగా నిర్ణయం తీసుకొని పార్టీ ఓటర్లకు తెలియజేస్తారా అనేది చూడాల్సి ఉంది.

రాష్ట్రంలో ఖరారైన మోదీ సభలు



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన తేదీ సోమవారమే ఖరారు కాగా, ఆయన ఏ రోజు ఏ సభలో పాల్గొంటారనేది మంగళవారం రాత్రి ఖరారైంది. ఈమేరకు ప్రధాని కార్యాలయం రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి సమాచారం ఇచ్చింది. దీని ప్రకారం, ఈ నెల 25, 26, 27 తేదీల్లో తెలంగాణలోనే మోదీ మకాం వేయనున్నారు. ఈ నెల 25న మహేశ్వరం, కామారెడ్డి సభల్లో పాల్గొంటారు. ఈ నెల 26న తూప్రాన్, నిర్మల్ సభల్లో పాల్గొననున్నారు. ఈ నెల 27న మహబూబాబాద్, కరీంనగర్ సభల్లో... సాయంత్రం హైదరాబాద్‌లో రోడ్ షోలో మోదీ పాల్గొంటారు.

ఉద్యోగాలడిగితే దూషిస్తారా?

మంత్రి కేటీఆర్‌పై మండిపడిన బండి సంజయ్



కరీంనగర్‌లో సంజయ్‌ను సన్మానిస్తున్న బీజేపీ కార్యకర్తలు

కరీంనగర్ టౌన్: 'మంత్రి కేటీఆర్‌కు కండకావరం తలకెక్కింది. ఉద్యోగాలెందుకు ఇవ్వడంలేదని నిరుద్యోగులు నిరసన తెలిపితే, తప్పు చేశామని చెంపలేసుకోవాల్సిన కేటీఆర్.. చెత్త నా కొడుకుల్లారా.. సన్నాసుల్లారా.. అంటూ బూతులు తిడుతున్నారు. ఆయనకు అహంకారం ఎక్కువైంది. యువకుల్లారా బీఆర్‌ఎస్‌ను ఓడించి సత్తా చాటండి'అంటూ బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంజయ్ మాట్లాడుతూ 'కేటీఆర్ ఉండేందుకు వంద గదుల ప్రగతిభవన్ కావాలి. నిలువ నీడలేని పేదలకేమో ఇళ్లు వద్దా'? అని ప్రశ్నించారు. 'నీ కుటుంబంలోని అందరికీ కొలువులొచ్చాయి. మరి నిరుద్యోగులు ఏం పాపం చేశారు? వారికి కనీసం నిరుద్యోగభృతి ఎందుకు ఇవ్వలేదు'అని ప్రశ్నించారు. మంత్రి గంగుల కమలాకర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరిదీ భూకబ్జాల బాగోతమని, తనది పోరాటాల చరిత్ర అని, ప్రజలు ఎటువైపు ఉంటారో ఆలోచించి ఓటేయాలని అన్నారు.

తెలంగాణలో పోలీస్ రాజ్యం

గజ్వేల్ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల ధ్వజం



ప్రచారంలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్

గజ్వేల్: బీఆర్‌ఎస్ పాలనలో పోలీస్ రాజ్యం నడుస్తోందని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండతో పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. భూ నిర్వాసితులందరికీ తాము ఉండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకే తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల సందర్భంగా చేసిన కుట్రలనే ఇక్కడ కూడా తనపై అమలు చేయాలని అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అధికారంలోకి రాగానే ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల తిరస్కృతి

- ఈసీ నుంచి పాసులు రాలేదని కలెక్టర్ల నిర్ణయం
- దరఖాస్తుల తిరస్కరించిన తర్వాత పాసులను పంపిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం అర్హులైన జర్నలిస్టులు పూర్తి చేసి ఇచ్చిన 'ఫారం–12డీ'దరఖాస్తులను రాష్ట్రంలోని చాలా జిల్లాల కలెక్టర్లు తిరస్కరించారు. పోలింగ్ రోజు విధి నిర్వహణలో భాగంగా ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఓటు వేయలేకపోతున్న జర్నలిస్టులకు శాసనసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. పోలింగ్ ప్రక్రియను కవర్ చేసేందుకు సీఈసీ నుంచి పాసులు పొందే మీడియా ప్రతినిధులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు వందలాది మంది జర్నలిస్టులు .. పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం నిర్దేశిత గడువు నవంబర్ 8లోగా దరఖాస్తు చేసుకున్నారు. సీఈసీ నుంచి పాసులు వచ్చిన తర్వాతే జర్నలిస్టుల ఫారం–12డీ దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు సైతం రాసింది. సీఈసీ నుంచి పాసుల జారీ ఆలస్యం కావడంతో చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఫారం–12డీ దరఖాస్తులను తిరస్కరించారు.

సమన్వయలోపమే సమస్య

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ లేఖ రాశారని రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ కార్యాలయంలోని నోడల్ అధికారి 'సాక్షి'కి వెల్లడించారు. జర్నలిస్టుల పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను తిరస్కరించిన రెండు మూడు రోజులకే, సీఈసీ నుంచి వారికి పాసులు జారీ కావడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం, రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ, కలెక్టర్ల మధ్య సమన్వయలోపంతోనే అర్హులైన జర్నలిస్టులు మరోసారి రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటేసే అవకాశాన్ని కోల్పోయారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అనుబంధం పెంచుకోవడమే బాధలకు దారి తీస్తుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 22 నవంబర్ 2023

కోరి తెచ్చుకున్న కొరివి?

ఎన్నికలు, ఫలితాలనేవి ఉద్వేగాలను రేపడం సహజం. అయితే, కొన్ని ఎన్నికలు, కొందరి ఎంపికలు ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేస్తాయి. అనుమానాలతో పాటు ఆందోళనలూ రేపుతాయి. అర్జెంటీనా కొత్త అధ్యక్షుడిగా ఛాందసవాద జేవియర్ మిలీ తాజా ఎన్నిక అలాంటిదే. ఓట్ల లెక్కింపులో మిలీ 56 శాతం ఓట్లు సాధిస్తే, అధికార పక్షమైన పెరోనిస్ట్ ప్రభుత్వ ఆర్థిక మంత్రి సెర్జియో మస్సాకు 44 శాతం ఓట్లే వచ్చాయి. వర్తమాన అర్జెంటీనా రాజకీయ వ్యవస్థపై నెలకొన్న ప్రజాగ్రహానికి, 'సరికొత్త రాజకీయ శకం' తీసుకువస్తానన్న వాగ్దానం తోడై సృష్టించిన ప్రభంజనంలో మిలీ విజయ తీరాలకు చేరారు. అయితే, ఆయన విజయం అర్జెంటీనాలోని ప్రతిపక్షాల్లోనే కాదు... అంతర్జాతీయంగానూ ఆందోళన రేపుతోంది. కష్టపడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని భావిస్తున్నారు. నలభై ఏళ్ళుగా ప్రజాస్వామ్యాన్ని పాటిస్తున్న దక్షిణ అమెరికా దేశాన్ని కొత్త అధ్యక్షుడు మళ్ళీ వెనక్కి నడిపిస్తారనే భయం నెలకొంది. అదెలా ఉన్నా... అర్జెంటీనా దౌత్య సంబంధాలు, ఆర్థిక భవితవ్యం, ఆ ప్రాంత రాజకీయ సమీకరణాలు మారిపోనున్నాయి.

నాలుగున్నర కోట్ల జనాభా గల అర్జెంటీనాలో నవంబర్ 19న జరిగిన ఎన్నికలు, ఫలితాలు ఇంతగా చర్చనీయాంశమైంది అందుకే. ఎన్నికల్లో మిలీకి పట్టం కట్టినమాట నిజమే అయినా, అంత మాత్రాన అర్జెంటీనా ప్రజలందరూ ఆయన భావజాలంతో ఏకీభవిస్తున్నట్టు అనుకోలేం. దశాబ్దాల నిర్వహణ లోపాలు, అవినీతితో ఆ దేశం దీర్ఘకాలంగా ఆర్థిక కష్టాల ఊబిలో కూరుకుపోయింది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. ప్రపంచస్థాయిలోనే ఎక్కువగా ద్రవ్యోల్బణం 150 శాతానికి దగ్గరలో ఉంది. దారిద్ర్యం పెరుగుతోంది. దేశంలో నూటికి 40 మందికి పైగా దారిద్ర్యంలో మగ్గుతున్నారు. అధికార కరెన్సీ పెసో విలువ ఎన్నడూ లేనంతగా పడిపోయింది. మూడేళ్ళ క్రితం కరోనా రావడానికి ముందు దాకా 80 పెసోలు ఒక డాలరైతే, ఇవాళ వెయ్యి పెసోలైతే కానీ ఒక డాలర్‌కు సమానం కాని దుఃస్థితి. ఈ ఆర్థిక కష్టాలకు రాజకీయ వ్యవస్థ, ముఖ్యంగా వామపక్షాలు కారణమని మిలీ ఆరోపణ. ఆ ఆరోపణల్ని అధికారపక్ష అభ్యర్థి సమర్థంగా తిప్పికొట్టలేకపోయారు. ఎలాగైనా సరే జీవన పరిస్థితుల్లో మార్పు రావాలని తహతహలాడుతున్న జనం మిలీతో ఏకీభావం లేకున్నా ఆయనకే ఓటేశారు. అందుకే, ఈ ఎన్నిక ''నిరసన ఓటు'' ఫలితమని నిపుణుల మాట.

ఆర్థిక నిపుణుడు, మాజీ టీవీ ప్రముఖుడు, తాంత్రిక సెక్స్ కోచ్ 53 ఏళ్ళ జేవియర్ మిలీకి నిజానికి రాజకీయ అనుభవం లేదు. కానీ, ప్రజలకు ఆయన బాసలు కోటలు దాటాయి. పన్నులు తగ్గిస్తాననీ, అర్జెంటీనా కేంద్ర బ్యాంకును రద్దు చేస్తాననీ, దేశ కరెన్సీ పెసో స్థానంలో అమెరికా డాలర్‌ను తెస్తాననీ అన్నారు. గర్భస్రావంపై నిషేధం ఎత్తేస్తానన్నారు. కారుణ్య మరణాల్ని వ్యతిరేకించారు. తుపాకులపై నియంత్రణల్ని సడలిస్తానన్నారు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి 'సామ్యవాదంపై పోరాటం' చేయదలచిన దేశాలే అర్జెంటీనాకు మిత్రపక్షాలంటూ తన భావజాలాన్ని కుండబద్దలు కొట్టారు. అసలే కష్టాల్లో ఉన్న దేశాన్ని ఆయన అధ్యక్షత మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని వందమందికి పైగా ప్రముఖ ఆర్థికవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. పైగా, అతి పెద్ద వాణిజ్య భాగస్వామ్యదేశాలైన బ్రెజిల్, చైనా, అమెరికా, చిలీ నేతల్ని మిలీ దుమ్మెత్తిపోశారు. ఇక, సర్కారు వద్దే డాలర్లు లేని వేళ దేశ కరెన్సీ స్థానంలో డాలర్లను ప్రవేశపెడతాననడం ఆచరణ సాధ్యం కాని పని. ఏ కొద్దిగా ప్రయత్నించినా అది మరో సంక్షోభానికి తెర తీస్తుంది.

అర్జెంటీనా సంగతి అటుంచితే, మిలీ విజయవార్త మిగతా ప్రపంచానికీ శుభవార్తేమీ కాదు. అందుకు అనేక కారణాలు. టీవీ ప్రముఖుడిగా తెచ్చుకున్న పేరును ఆయన రాజకీయాల్లో మదుపు పెట్టారు. రెచ్చగొట్టే మాటలు, మితిమీరిన హావభావ విన్యాసాలతో ముందుకు సాగుతున్నారు. సుమారు అయిదేళ్ళ క్రితం రాజకీయాల్లోకి వచ్చిన ఈ స్వేచ్ఛావాది ప్రపంచ వాతావరణ మార్పు ఓ పెద్ద సామ్యవాద అబద్ధం అంటారు. ప్రపంచవ్యాప్తంగా అతివాదులకు నచ్చే ఆ మాటల్ని ఐరోపా లాంటివి స్వాగతిస్తున్నాయి. విజేత మిలీని తక్షణం అభినందించిన వారి జాబితాలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిర్ బొల్సొనారో తదితరులు ఉండడం గమనార్హం. అమెరికాలో ట్రంప్ హయాంలో, బ్రెజిల్‌లో బొల్సొనారో ఏలుబడిలో జరిగిందేమిటో అందరికీ తెలిసిందే, చూసినదే. మరి, స్నేహితుల్ని బట్టి స్వభావం తెలుస్తుందన్న దాన్ని బట్టి రానున్న రోజుల్లో మిలీ ఎలాంటి పోకడలు పోగలరో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలతో నిత్యం పోరాడే అధ్యక్షుడి వల్ల అర్జెంటీనా ప్రజాస్వామ్యం మరింత బలహీనపడే ముప్పుంది.

ఎన్నికల ప్రచార సమయంలో రంపం చేతబట్టి, ఖర్చునూ, కష్టాల్నీ కోసేస్తానని మిలీ చెబుతూ వచ్చారు. విజయోత్సవ ప్రసంగంలోనూ దేశంలో 'అంచెలంచెలుగా కాక సమూలంగా మార్పు తెస్తా'నని వాగ్దానం చేశారు. అనుభవమే కాదు... భావోద్వేగాలపై అదుపు కానీ, పార్లమెంట్‌లో మెజారిటీ కానీ లేని మిలీ ఏం చేయగలుగు తారు, ఎంతకాలం నిలబడగలుగుతారన్నది సందేహమే! కొద్దికాలమే పదవిలో ఉన్నా దేశానికి నష్టం భారీగా ఉండవచ్చని పలువురి భయం. అసలు అర్జెంటీనాలో ప్రజాస్వామ్యం బీటలు వారుతోందని ఇప్పటికి మూడేళ్ళుగా అమెరికా, బ్రెజిల్ హెచ్చరిస్తూనే ఉన్నాయి. మిలీ హయాంలో ఆ భయాలన్నీ నిజమైతే, ఆ దేశానికి అంతకన్నా విషాదం మరొకటి ఉండదు. మాటల్లో, చేష్టల్లో ట్రంప్‌కు తీసిపోని మిలీని అంతా 'ఎల్‌లోకో' (పిచ్చివాడు) అంటుంటారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం పక్కకుపోయి, అధికారం పిచ్చోడి చేతిలో రాయిగా మారితే కష్టమే! కారణాలేమైనా ఇది మెజారిటీ అర్జెంటీనా పౌరులు కోరి తెచ్చుకున్న కొరివి!!

రేపటి నగరాలను నిర్మించేదెలా?

అభిప్రాయం



సోలమన్ ఆరోక్యరాజ్

ప్రపంచవ్యాప్తంగా జీడీపీలో దాదాపు 80 శాతం వాటా సమకూరుస్తూ నగరాలు ప్రధాన ఆదాయ సముపార్జన కేంద్రాలుగా మారుతున్నాయి. భారతదేశంలో కూడా ఇందుకు భిన్నమైన పరిస్థితులు లేవు. దేశంలోని ముంబై, ఢిల్లీ వంటి నగరాలు ప్రపంచంలోని కొన్ని దేశాల కంటే అధికంగా జీడీపీని సమకూరుస్తున్నాయి. మన నగరాలను అభివృద్ధి పథంలో నిలపడానికి కొత్తగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడంలో ప్రభుత్వాలకున్న పరిమితుల దృష్ట్యా ప్రైవేటు పెట్టుబడులను సమీకరించడం నేడు అనివార్యంగా మారింది. విశాఖపట్నం లాంటి నగరాలు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి వినూత్న ఆదాయ నమూనాలను విజయవంతంగా వినియోగించుకుంటున్నాయి.

2036 నాటికి భారతదేశంలోని నగరాల్లో నివసించే జనాభా 60 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. ఈ స్థాయిలో జనాభా పెరుగుదల మంచి అవకాశాలను సృష్టించడంతో పాటు లక్షలాది మంది జనాభాకు అనుగుణంగా పౌర సేవలు విస్తరించడం, పౌరులకు మెరుగైన జీవనానికి అనువైన పరిస్థితులను కల్పించడం ప్రభుత్వానికి ఒక సవాలు కానుంది. అందువల్ల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పట్టణ మౌలిక సదుపాయాలను సిద్ధం చేయడానికి మనం గణనీయంగా వనరులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఈ అవసరాన్ని గుర్తించిన భారత జీ20 అధ్యక్షత 'ఫైనాన్సింగ్ సిటీస్ టుమారో: సస్టెయినబుల్, ఇంక్లూజివ్ అండ్ రజిలెంట్' అనే థీమ్‌ను ఎంపిక చేసుకుంది. అందుకనుగుణంగా నగరాల్లో స్థిరమైన మౌలిక సదుపాయాల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడానికి న్యూఢిల్లీ లీడర్స్ డిక్లరేషన్ పేరుతో 'ఫైనాన్సింగ్ సిటీస్ ఆఫ్ టుమారో' ఆవిర్భావానికి కొన్ని సూత్రాలను ఆమోదించారు.

పట్టణ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడంలో ప్రభుత్వాలకున్న పరిమితుల దృష్ట్యా ప్రైవేటు పెట్టుబడులను సమీకరించడం నేడు అనివార్యంగా మారింది. ఇందుకనుగుణంగా స్థిరమైన, సమ్మిళిత మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చుకోవడానికి నగరాలకు మార్గనిర్దేశం చేసే విధంగా భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 కొన్ని నివేదికలను ప్రకటించింది. ఈ వ్యూహంలో పట్టణ ప్రణాళిక సంస్కరణలు, సొంత ఆదాయ వనరులను పెంచుకోవడం, పెట్టుబడి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, నగరాల రుణ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం, గ్రీన్, సోషల్ మరియు సస్టెయినబుల్ బాండ్లు వంటి వినూత్న ఫైనాన్సింగ్ సాధనాలను ఉపయోగించుకుని స్థిరమైన పెట్టుబడి ప్రాజెక్టులను నిర్విరామంగా సాధించడం, నియంత్రణా వాతావరణాన్ని అందుబాటులో ఉంచడం, ఏఐ, సామర్థ్యాల పెంపు, సంస్థాగత సంసిద్ధత వంటి సాధనాలను ఉపయోగించుకోవడం వంటివి ప్రధానాంశాలుగా ఉన్నాయి.

భారతదేశంలోని అనేక నగరాలు వినూత్న ఆదాయ వనరుల సృష్టి, పెట్టుబడి అవకాశాలు సుసాధ్యమని నిరూపించాయి. మధ్యప్రదేశ్‌లోని రేవా మునిసిపల్ కార్పొరేషన్ (ఆర్‌ఎంసీ) మౌలిక సదుపాయాల కోసం సగటున ఏటా రూ. 350 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో కేవలం 34 శాతం మాత్రమే మున్సిపాలిటీ సొంత ఆదాయ వనరుల నుండి వస్తుంటే, మిగిలినది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వివిధ పథకాలు మరియు గ్రాంట్ల ద్వారా సమకూరుతోంది. మౌలిక వసతులకు సొంత ఆదాయం నుండి ఇంత తక్కువ మొత్తంలో



ఖర్చు చేస్తున్నప్పటికీ, పట్టణ భూభాగపు రీ-డెన్సిఫికేషన్ ఆధారంగా వ్యూహాత్మక పట్టణ ప్రణాళికతో న్యూ రేవా బస్ స్టాండ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పీపీపీ(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) విధానం ద్వారా విజయవంతంగా అమలు చేసింది. న్యూ రేవా బస్ స్టాండ్ ప్రాజెక్టులో 3.5 ఎకరాల ఖాళీ ప్రదేశాన్ని వాణిజ్య సముదాయంతో కూడిన బస్ స్టాండ్‌గా తీర్చిదిద్దడం ద్వారా, మున్సిపాలిటీకి రూ. 10.5 కోట్ల ప్రీమియంతో పాటు, ఏడాదికి రూ. 35 లక్షల అద్దె లభిస్తోంది.

భారతదేశంలోని ఇతర నగరాలు కూడా పట్టణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి వినూత్న ఆదాయ నమూనాలను విజయవంతంగా వినియోగించుకుంటున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వ్యర్థ జలాలను శుద్ధి చేసి ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో పరిశ్రమల వినియోగానికి నీటిని సరఫరా చేయడం ద్వారా ఏటా సుమారు రూ. 30 కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ప్రాజెక్టు నిధుల కోసం జీవీఎంసీ పన్నుల వసూళ్లు, సేవా పంపిణీ ప్రమాణాలను స్థిరంగా ప్రదర్శించడం ద్వారా రుణ అర్హతలను మెరుగుపరుచుకుని 'ఏఏ' క్రెడిట్ రేటింగ్‌ను సాధించింది. అదే విధంగా సూరత్ నగరం కూడా పారిశ్రామిక పునర్వినియోగం కోసం శుద్ధి చేసిన వ్యర్థ నీటిని విక్రయించడం ద్వారా 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.140 కోట్ల కొత్త ఆదాయ వనరులను సృష్టించుకుంది.

స్థిరమైన ఆర్థిక వనరుల సేకరణలో పేరుగాంచిన ఘజియాబాద్ భారతదేశంలో రూ. 150 కోట్ల మున్సిపల్ గ్రీన్ బాండ్లను విడుదల చేసిన మొదటి యూఎల్‌బీ (అర్బన్ లోకల్ బాడీ)గా నిలిచింది. మెరుగైన పట్టణ ప్రణాళిక, వినూత్న ఆర్థిక నమూనాల ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుని తమ పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి చిన్న నగరాలు కూడా ప్రైవేటు పెట్టుబడిదారులను ఆకర్షించగలవని పైన పేర్కొన్నవి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

జీ20 వెలువరించిన పత్రాలు నాణ్యమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి మన నగరాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంటే, భారతదేశ అనుభవాలు ప్రపంచ మౌలిక సదుపాయాల ఎజెండాను నిర్దేశించడానికి ఇతోధికంగా దోహదపడుతున్నాయి. అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (అమృత్), స్మార్ట్ సిటీస్ మిషన్, హౌసింగ్ ఫర్ ఆల్ (పీఎంఏవై), మెట్రో రైల్ ప్రాజెక్టులు, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్, స్మార్ట్ సిటీ మిషన్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్లు, వివిధ నగరాలు జారీ చేసిన మునిసిపల్ బాండ్లు, 2018లో రూపొందించిన భారతదేశ నేషనల్ అర్బన్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌యూపీఎఫ్) అమలు నుండి నేర్చుకున్న పాఠాలు... గ్రూపు ఆలోచనలను సుసంపన్నం చేశాయి. అలాగే వాటిని పరస్పరం పంచుకోవడం వివిధ దశలలో అభివృద్ధిలో ఉన్న నగరాల ఆకాంక్షలకు అనుగుణంగా సుస్థిర ఆర్థిక వనరుల సమీకరణకు ఇతర మార్గాలను ఉపయోగించుకునేందుకు మార్గదర్శకంగా నిలిచాయి.

సుస్థిర ఆర్థిక వనరుల సమీకరణకు ఇతర మార్గాలను ఉపయోగించుకునే దిశగా ముందుకు వెళ్లడానికి భారతీయ నగరాలు తమ సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, డిజిటైజ్డ్ అకౌంటింగ్ వ్యవస్థను అవలంబించడం, పెట్టుబడి పెట్టదగిన ప్రాజెక్టుల పైప్ లైన్‌ను కలిగి ఉండటం, వాటి విశ్వసనీయత, ఆదాయ సేకరణ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం అత్యవసరం. పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వైపు ప్రైవేట్ మూలధనాన్ని ఆకర్షించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ఈ పరివర్తన కీలకం.

వ్యాసకర్త జాయింట్ సెక్రటరీ, కేంద్ర ఆర్థిక శాఖ, భారత ప్రభుత్వం
(వ్యాసంలోని అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతం)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

దేనికి వేసిందో?



తెలంగాణలో మొదటి ఓటు పడిన విషయం మీకు తెలుసా? ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యం అయిన పోస్టల్ బ్యాలెట్లను సీనియర్ సిటిజన్ల నుంచి సేకరిస్తున్నారు. హైదరాబాద్‌లో 91 ఏళ్ల వృద్ధురాలు ఓటేసింది.

- శ్రీరామ్ కర్రి, సంపాదకుడు

సాధారణ మనిషా?



నవంబర్ 21న వెళ్లి పోయిన డా॥ ఎస్.ఎస్.బద్రీనాథ్‌కు మనం నివాళులు అర్పించాలి. చెన్నై లోని గొప్ప వైద్యసంస్థ శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడిగా ఆయన భారత్‌లో నేత్ర సంరక్షణ రూపురేఖలు మార్చేశారు. చివరి వరకూ తనను తాను 'సాధారణ మనిషి'గా పరిగణించుకున్న ఆయన, మరణానంతరం తన కోసం దీర్ఘ కర్మకాండలు జరపొద్దనీ, అనుపత్రి జనం ఒక్క సెకను కూడా పని ఆపొద్దనీ కోరారు.

- ఎన్. రామ్, సంపాదకుడు


సమానం



'రంగు మనుషులు' (పీపుల్ ఆఫ్ కలర్ - అన్నిరకాల శ్వేతేతర మనుషులు) అనే పదం వాడడం ఆపాల్సిన సమయం ఇదే. చర్మం రంగును బట్టి మనుషులను వర్గీకరించడం అర్థం లేనిది. దీనివల్ల తెల్లవాళ్లను, తెల్లవాళ్లు కానివాళ్లతో అనవసరంగా వ్యతిరేకంగా ఉంచుతుంది. యూఎస్‌లో మనం అందరం అమెరికన్లమే. అంతే!

- వివేక్ రామస్వామి, అమెరికా నాయకుడు


తగిన కూతురు



కాలేజీలో ఒకసారి, నా స్నేహితురాలిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్న కొందరు అబ్బాయిల మీదికి దాదాపుగా చితక్కొట్టేంత కోపంతో వెళ్లాను. ఈ కథను మా అమ్మ, స్నేహితుల నుంచి పదేపదే విన్నదేమో... నా కూతురి మనసులో నాటుకు పోయింది. చరిత్రను పునరావృతం చేయడానికి తైక్వాండో నేర్చుకుంటోంది.

- అనుపమ దాల్మియా, కంటెంట్ క్రియేటర్

చదువే ముందు...



భారత్‌లోని మొత్తం ముస్లింలలో కేవలం 2.75 శాతం మంది మాత్రమే పట్టభద్రులు. అంతకన్నా ఎక్కువ చదువుకున్న వాళ్లు. 43 శాతంతో భారత ముస్లింలలో అత్యధిక నిరక్షరాస్యత ఉంది. మనకు కావాల్సిన తక్షణ విప్లవం... విద్య.

- శెహలా రషీద్, యాక్టివిస్ట్

రంగస్థల ప్రతిభా యశస్వి!

నాటక రంగంలో మూడు దశాబ్దాల పాటు ఒక సంచలన చరిత్ర సృష్టించిన గొప్ప నటుడు, దర్శకులు, వక్త నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు. 1923 నవంబరు 20వ తేదిన పశ్చిమ గోదావరి జిల్లా దాగల్లులో ఆయన జన్మించారు. కళాశాల విద్యార్థిగానే నట ప్రవేశం చేశారు. 'ఆంధ్ర ప్రజానాట్య మండలి' విధా నాలన ఆపోశన పట్టిన కె. వెంకటేశ్వరరావు ఆ ఒరవడినే కొనసాగారు. ఆయన నటించే సన్నివేశంలో ఉన్న తోటి నటులు ఆయన నటనలో లీనమైపోయిన విధానానికి అబ్బురపడుతూ తమ డైలాగులు మరచిపోయి తడబడిన సందర్భాలెన్నో ఉన్నాయని శిష్యులంటారు. ఆయన మూడు దశాబ్దాల నాటక రంగ చరిత్రను పెద్ద కాన్వాస్‌పై చిత్రించాల్సి వుంది. దాట్ల శ్రీరాములు, దేవదాస్ కనకాల, గొల్లపూడి, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, గణేష్‌పాత్రో, ఎస్.కె. మిశ్రో, సి.ఎ. శివ రామిరెడ్డి వంటి ఎందరో ఆయన శిష్యులు ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్నారు.



నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు

మచిలీపట్నంలో 1955లో 'ఆంధ్రనాటక కళాపరిషత్' ఆధ్వర్యంలో నాటిక పోటీలు జరిగాయి. ఆత్రేయ రచించిన 'నా బాబు' నాటికలో నటనకు గాను 'ఉత్తమ నటుడు' బహుమతి గెలుచుకోవడంతో, ఆయన విజయపరంపర మొదలైంది. 1958లో ఆత్రేయ సాన్నిహిత్యం వలన, ఆయన నిర్మించిన 'వాగ్దానం' చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేయడమే కాక, ఒక పాత్రలో నటించారు. మళ్ళీ 1961లో 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో నటించారు. కానీ, విషాదం ఏమిటంటే, వెంకటేశ్వరరావు 'స్వరపేటిక'కు అసూయ, ఆందోళన చెందిన ఒక నటుడి ఒత్తిడి మేరకు వెంకటేశ్వరరావు పాత్రను 'మూగవాణ్ణి' చేసేశారు. అనాటి ఆ దుర్మార్గం నేపథ్యం బాగా తెలిసినవారు ఆ సంఘటన గురించి చెబుతారు. ఆ తర్వాత 1972లో 'కన్నెవయసు' చిత్రంలో అద్భుతంగా నటించారు. విజయవాడలో 'ర.స.న. సమాఖ్య' స్థాపించడం ద్వారా ఎందరినో గొప్ప నటులుగా తీర్చిదిద్దారు. అలాగే, న్యూఢిల్లీలో నటశిక్షణ కోసం వెళ్ళిన ఆయన అక్కడ 'దక్షిణ భారత నటీనట సమాఖ్య' స్థాపించారు.

వెంకటేశ్వరరావు నట, దర్శక వైదుష్యానికి ఒక 'అకడమిక్ స్టేటస్' కల్పించినవారు డా॥ కె.వి. గోపాలస్వామి. ఆంధ్రవిశ్వ విద్యాలయం 'థియేటర్ ఆర్ట్స్' విభాగంలో స్టేజి డైరెక్టరుగా ఆయన్ని నియమించింది వారే. దాంతో, ఎందరో ఔత్సాహికులను, నటన, దర్శకత్వంలో తీర్చిదిద్దిన అధ్యాపకునిగా ఆయన నాటక రంగ చరిత్రలో నిలిచిపోయారు. ఎన్నో నాటక సంస్థలు ప్రారంభించి, ఉన్నతంగా తీర్చిదిద్దారు. వాటిలో చివరిది 'బహురూప నటసమాఖ్య' (1971). ప్రముఖ నాటక రచయిత మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు, 'నటరాజ కె.వెంకటేశ్వరరావు నటీ, నటసమాఖ్య' పేరుతో నాటక సంస్థను నెలకొల్పారు. ఆ సమాజం ద్వారా తాను రచించిన సంచలన నాటక, నాటికలు, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి, కేవీ ఆశీస్సులందుకున్నారు.

1979లో విశాఖవాసి, స్వర్గీయ బి.ఎస్. చలం (నటుడు, నాటక పోషకులు) 'నటరాజ కె.వెంకటేశ్వరరావు స్మారక నాటక కళా పరిషత్' స్థాపించారు. నటుడు, దర్శకులు పి. శివప్రసాద్ 'కె.వి. మెమోరియల్ ఆర్ట్స్' సంస్థను నెలకొల్పారు. ఇంతటి ఘనత వహించిన ఆ నటరాజ మూర్తికి తెలుగు నాటకరంగం నిండు నివాళులర్పిస్తోంది.

- బి.వి. అప్పారావు | 93470 39294
(రంగస్థల దిగ్గజం కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

సమాఖ్య వ్యవస్థకు ఎంతటి దుర్గతి!

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

గవర్నర్ల వ్యవహార శైలి కారణంగా దేశానికి సమాఖ్య వ్యవస్థను ఇచ్చిన రాజ్యాంగం స్ఫూర్తి దెబ్బతింటోంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉండాలి. ఆర్టికల్ 155 ప్రకారం గవర్నర్ నియామకాన్ని భారత రాష్ట్రపతి చేస్తారు. ఆర్టికల్ 156 ప్రకారం రాష్ట్రపతి అనుగ్రహం ఉన్నంత వరకు గవర్నర్ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారు. దీనినిబట్టి ఎవరికైనా ఏమి అర్థమవుతుంది? గవర్నర్ పదవిలో ఉండే వారెవరూ కేంద్ర ప్రభుత్వానికి దాసులుగా ఉండాల్సిన అవసరం లేదనేకదా? ఇందుకు సంబంధించి 1979 మే 4న సుప్రీం కోర్టు ఓ కీలకమైన తీర్పు ఇచ్చింది. ఒక యజమాని (ఎంప్లాయర్)కీ, ఒక ఉద్యోగి (ఎంప్లాయీ)కీ ఉండే సంబంధం కేంద్ర ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ మధ్య ఉండదనీ, కేంద్ర ప్రభుత్వ అధీనంలో గవర్నర్ ఉండరనీ సుప్రీం కోర్టు 'రాక్టర్ రఘుకుల్ కేసు'లో స్పష్టంగా చెప్పింది. అంటే, 'గవర్నర్' అన్నది ఓ రాజ్యాంగబద్ధమైన పదవి. ఆ స్థానంలో ఉండే వారు రాజ్యాంగబద్ధమైన విధులను మాత్రమే నిర్వహించాలి. కానీ, ఆచరణలో అలా జరుగుతోందా?

గవర్నర్ల వ్యవస్థను కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, వారు దుర్వినియోగం చేసిన దృష్టాంతాలు అనేకం ఉన్నాయి. గవర్నర్ల నియామకంలోనూ పాటించవలసిన మార్గదర్శకాలనూ, విధివిధానాలనూ తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరించడం గత ఏడున్నర దశాబ్దాలుగా కనిపిస్తోంది. గవర్నర్‌ను కీలుబొమ్మగా చేసుకొని ఆయా రాష్ట్రాలలో ఆర్టికల్ 356ను దుర్వినియోగ పరిచి ప్రజా ప్రభుత్వాలను కూలగొట్టిన సంఘటనలు అనేకం. కేరళ కమ్యూనిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలుకొని ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి. రామారావు వరకు గవర్నర్ బాధితులు ఎందరో ఉన్నారు.

గవర్నర్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగపర్చడం శ్రీమతి ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా ఉన్నప్పుడు ఎక్కువగా జరిగింది. కేంద్రం- రాష్ట్రాల మధ్య ఉండే సంబంధాల సమతుల్యతపై అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు 1983లో ఏర్పాటయిన జస్టిస్ రాజేందర్ సింగ్ సర్కారియా ఐదేళ్ల తర్వాత సమర్పించిన నివేదికలో గవర్నర్ల నియామకం, వారి పనితీరుపై స్పష్టమైన సూచనల్ని చేసింది. నిజానికి సర్కారియా కమిషన్ కంటే ముందు... 1969లో అప్పటి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర-రాష్ట్ర సంబంధాల మెరుగుదలపై నివేదిక ఇవ్వాలని రాజమన్నార్ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ చాలా స్పష్టంగా 'గవర్నర్ నియామకంలో తప్పనిసరిగా రాష్ట్ర క్యాబినెట్‌తో సంప్రదింపులు జరపాలి' అని చెప్పింది. కానీ, ఈ కమిటీ రికమండేషన్లను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఆ తర్వాత దాదాపు 2 దశాబ్దాల అనంతరం, సర్కారియా కమిషన్ కూడా ఇదే సిఫార్సు చేసింది. కానీ, కేంద్రంలో ఎవరున్నా గవర్నర్లను ఏకపక్షంగా నియమించే సంప్రదాయమే కొనసాగుతోంది.

ఇటీవలి కాలంలో పంజాబ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గవర్నర్ల వ్యవహారశైలి దుమారం రేపుతోంది. కొన్ని నెలల క్రితం తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన గవర్నర్ ప్రసంగ పాఠానికి సొంతంగా మార్పులు చేర్పులు చేసి అసెంబ్లీలో ప్రసంగించడం కలవరం రేపింది.



అలాగే, కొన్ని బిల్లుల్ని ఆమోదించకుండా తిప్పిపంపారు. ఇక పంజాబ్ గవర్నర్ అయితే, రాష్ట్ర అసెంబ్లీని సమావేశపర్చాలని ఆ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించినా అందుకు ఆయన అనుమతి ఇవ్వలేదు. దీనిపై పంజాబ్ ప్రభుత్వం విధిలేని పరిస్థితులలో సర్వోన్నత న్యాయస్థానం గడప తొక్కింది. 'శాసనసభ నిర్వహణకు సంబంధించిన అధికారాలు అసెంబ్లీ స్పీకర్‌కు ఉండగా, వాటి నిర్వహణలో మీకు అభ్యంతరం ఏమిటి' అని పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ తీసుకున్న చర్యను సుప్రీం కోర్టు తప్పు పట్టింది. అంతేకాదు... 'మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారు' అని తీవ్రస్వరంతో సుప్రీం కోర్టు గవర్నర్ పట్ల తన అసంతృప్తిని వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఉండాల్సిన సుహృద్భావ వాతావరణం స్థానంలో రాజకీయ వైరం నెలకొని వారు ఎడమొఖం పెడమొఖంగా మారిన ఉదంతాలు గతంలో కోకొల్లలు. గవర్నర్ల రాజ్యాంగ అతిక్రమణలపై పార్లమెంట్ ఉభయ సభలలో ఎన్నో సందర్భాలలో వాడి వేడిగా చర్చోపచర్చలు జరిగాయి. గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిదని, దానిని రద్దు చేయాలనే డిమాండ్ సైతం వినిపించింది. ఆశ్చర్యం ఏమంటే, గవర్నర్ వ్యవస్థ వల్ల లోగడ ఇబ్బందులు ఎదుర్కొన్న భారతీయ జనతా పార్టీ... కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 'మేము సైతం' అంటూ కాంగ్రెస్ పార్టీ తరహాలోనే గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగపర్చడమే చర్చనీయాంశం. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఇటువంటి వివాదాలు చేటుచేసుకొన్న దాఖలాలు లేవుగానీ, 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ ఈ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో గవర్నర్లను తమ ఇష్టానుసారం బీజేపీయేతర ప్రభుత్వాలపై సవారీ చేయిస్తున్న తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ముఖ్యంగా బిల్లుల విషయంలో తమకులేని అధికారాలను ఆపాదించుకొని గవర్నర్ వాటిని ఆమోదించకుండా తొక్కిపెట్టడంతోనే ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కొందరు గవర్నర్లు పోషిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యల్ని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రశ్నించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం దేశంలో సమాఖ్య వ్యవస్థకు పట్టిన దుర్గతిగా రాజ్యాంగ నిపుణులు అభివర్ణించడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి కొన్ని అంశాలలో గవర్నర్లకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక అధికారాలు కట్టబెట్టిన మాట నిజం. గవర్నర్ తన విచక్షణాధికారాలు ఉపయోగించి నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ ప్రకారం దఖలు పడింది. కానీ, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన బిల్లులను సుదీర్ఘకాలం ఆమోదించకుండా లేదా తిప్పిపంపకుండా తొక్కి పెట్టడానికి గవర్నర్‌కు హక్కు లేదు. కాగా, తమ ప్రభుత్వానికి సహకరించని గవర్నర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు అనుచితంగా ప్రవర్తిస్తూ కక్ష తీర్చుకొంటున్న ఉదంతాలు కూడా చోటుచేసుకొంటున్నాయి. గవర్నర్‌కు ఇవ్వాల్సిన ప్రోటోకాల్ పాటించకపోవడం మొదలుకొని, అసలు గవర్నర్ లేకుండానే శాసన సభ సమావేశాలు నిర్వహించుకొనేందుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి.

ఈ మొత్తం వ్యవహారం భారతదేశ ప్రజాస్వామ్యానికి తలవంపులు తెస్తున్నది. ప్రజాస్వామ్య విలువల పతనంలో దేశం పాతాళంలోకి శీఘ్రగతిన ప్రయాణిస్తున్న వేళ... దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతంగా ముందుకు సాగిపోతోందనీ; చంద్రయాన్, సూర్యయాన్‌లతో ప్రపంచంలోనే భారతదేశ ప్రతిష్ఠ ఆకాశాన్నంటుతోందనీ కేంద్రం జబ్బలు చరుచుకొంటే ఉపయోగం ఏమిటి?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: శు.దశమి రా.10.31 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: పూర్వాభాద్ర సా.6.55 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.3.56 నుండి 5.25 వరకు (తెల్లవారితే గురువారం). దుర్ముహూర్తం: ప.11.21 నుండి 12.07 వరకు, అమృత ఘడియలు: ఉ.11.31 నుండి 12.56 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.21.

క్లుప్తంగా...

కాంగ్రెస్, టీజేఎస్, సీపీఐలతో సమన్వయ కమిటీ

కన్వీనర్‌గా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మిత్రపక్షాలు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ కన్వీనర్‌గా, కోదండరెడ్డి, మల్లు రవి (కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి, బాలమల్లేశ్, ఈటీ నర్సింహ (సీపీఐ), కోదండరాం, ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, బద్రుద్దీన్ (టీజేఎస్)లు కమిటీ సభ్యులుగా వ్యవహరించనున్నారు. చివరి వారం రోజుల పాటు మిత్రపక్షాల అభ్యర్థుల ప్రచారాన్ని సమన్వయం చేయడంతో పాటు పోలింగ్ ముగిసేంతవరకు మూడు పార్టీల సంయుక్త కార్యాచరణను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌కు డీఎంకే మద్దతు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు ద్రవిడ మున్నేట్ర కఴగం (డీఎంకే) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం పార్టీ ప్రధాన కార్యాలయం 'ఎక్స్' వేదికగా అధికార ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలోని డీఎంకే పార్టీకి సంబంధించిన అన్ని విభాగాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని, తద్వారా జాతీయ స్థాయిలో ఏర్పాటైన ఇండియా కూటమిని గెలిపించాలని ఆ ప్రకటనలో కోరింది.

వారికి మతి భ్రమించింది

సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ఇస్తామంటూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వింత మాటలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి తండ్రీకొడుకులకు మతి భ్రమించినట్లుందన్నారు. ఇంతకాలం నిరుద్యోగుల శవాల మీద అధికారంలో కూర్చున్న కేసీఆర్, కేటీఆర్‌లకు ఓట్లు అడగడానికి ఇజ్జత్, మానం ఉండాలని మంగళవారం ఆమె 'ఎక్స్' వేదికగా కేసీఆర్, కేటీఆర్‌పై ధ్వజమెత్తారు. బంగారు తెలంగాణలో ఇంటిల్లిపాది కొలువులు అనుభవించి, అందినకాడికి దోచుకొని, మళ్లీ గెలిస్తే ఇళ్లిస్తాం, ఉద్యోగాలిస్తామనడాన్ని ఆక్షేపించారు.

'ప్రవాసుల క్షేమం కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి'

సాక్షి, హైదరాబాద్: ప్రవాస తెలంగాణీయుల సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టీపీసీసీ ఎన్నారై సెల్ కోరింది. గల్ఫ్‌తో పాటు పలు దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని ఎన్నారై సెల్ నేతలు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కోరారు.

ఇందిరాగాంధీని విమర్శిస్తే మహిళలు తిరగబడతారు



సాక్షి, హైదరాబాద్: ఇందిరాగాంధీని విమర్శిస్తే తెలంగాణలోని మహిళలు తిరగబడతారని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. నిన్నటివరకు కేసీఆర్ సోనియాగాంధీని మాత్రమే తిట్టేవారని, ఇప్పుడు గరీబీ హటావో అని పేదలను ఆదుకున్న ఇందిరాగాంధీని కూడా తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకున్నందునే ఇందిరమ్మను విమర్శిస్తున్నారన్నారు. ఇందిరాగాంధీని విమర్శిస్తే తెలంగాణలోని ఏ ఒక్క మహిళా బీఆర్‌ఎస్‌కు ఓటేయబోరని వీహెచ్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 నియోజకవర్గాల్లో వరుసగా ఐదు రోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కక్షసాధింపులో భాగమే వివేక్‌పై ఐటీ దాడులు



పంజగుట్ట (హైదరాబాద్): రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాజీ ఎంపీ, చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి ఇంటిపై ఐటీ దాడులు నిర్వహిస్తున్నారని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య వ్యాఖ్యానించారు. జేఏసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఇంటిపై దాడులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న మహేశ్వరం, ఖమ్మం, ఇప్పుడు వివేక్ ఇంటిపై దాడులు చేయడం చూస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రజలకు అర్థమవుతుందన్నారు. మీరు ఎలాంటి చర్యలు తీసుకున్నా రెండు పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.





అచ్చంపేట సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, హాజరైన జనం

ప్రాజెక్టులు కట్టింది | ఇందిరమ్మ రాజ్యమే..

▶ మొదటి పేజీ తరువాయి

చింతమడకలో రోడ్లు, బడి, సిద్దిపేటలో చదువుకున్న డిగ్రీ కళాశాల నిర్మించింది కాంగ్రెస్సేనని చెప్పారు. మంత్రి హరీశ్ రావుకు 2004లో ఎమ్మెల్యే కాక ముందే మంత్రి పదవి ఇచ్చింది కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి, కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసింది, దేశాన్ని ప్రపంచంతోపాటు ఐటీ రంగంలో పోటీలో నిలిపింది ఇందిరమ్మ రాజ్యమేనని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాజెక్టును పూర్తిచేస్తాం

పాలమూరు జిల్లాను నమూనాగా చూపుతూ నిధులు పొంది రూ.వేలాది కోట్లు ఇతర జిల్లాలకు బదిలీ చేశారని రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు. పాలమూరు పూర్తి కావాలంటే మన బిడ్డనే గెలిపించాలని కోరారు. ఒకనాడు నిజాం విముక్తి పోరాటం తర్వాత మొదటి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టగా, ఇప్పుడు 75 ఏళ్ల తర్వాత మళ్లీ పాలమూరు బిడ్డకు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందన్నారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది ఉద్దండులు ఉండగా, యువకుడైన తనకు టీపీసీసీ అధ్యక్షుడిగా సోనియాగాంధీ అవకాశం ఇచ్చారని చెప్పారు. 'నాగర్‌కర్నూల్ గడ్డనుంచి శపథం చేస్తున్నా.. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజలంతా ఏకమై డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యాన్ని తెస్తాం. నేను నల్లమలలోనే పుట్టాను. మీ బిడ్డగా వచ్చాను ఆశీర్వదించండి' అని పేర్కొన్నారు. బహిరంగసభల్లో కర్ణాటక మంత్రి సుధాకర్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థులు తూడి మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అర్హత లేదు: కోదండరాం

సీఎం కేసీఆర్ పురాణాల్లోని భస్మాసురుడిలా మారి తనను గెలిపించిన ప్రజలపై చేయిపెట్టేందుకు బయలుదేరాడని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. కేసీఆర్‌కు సీఎం కుర్చీలో మళ్లీ కూర్చునే అర్హత లేదని వ్యాఖ్యానించారు. వ్యవసాయానికి 10 గంటల కరెంటు మాత్రమే అందుతోందన్నారు. 24 గంటల కరెంటు కాని మిగతా కరెంటును ఎవరికి అమ్ముతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

100 మంది కేసీఆర్‌లు వచ్చినా | నన్నేం చేయలేరు

- బండరాయిని రత్నం అనుకొని ఇన్నాళ్లూ ప్రజలు ఆయన్ను నెత్తిన పెట్టుకున్నారు
- ఇప్పుడు బండకేసి బాదడానికి సిద్ధంగా ఉన్నారు: సీఎల్పీ నేత భట్టి
- 20 సీట్లే వస్తాయనుకుంటే కాకిలా రాష్ట్రమంతా పర్యటనలెందుకు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

మధిర/ముదిగొండ: 'వంద మంది కేసీఆర్‌లు వచ్చినా, మీటింగ్ పెట్టినా మధిరలో నన్నేం చేయలేరు.. మధిర ప్రజలను కొనలేరు.. కేసీఆర్ అనే ఓ బండరాయిని రత్నం అనుకొని పదేళ్లు నెత్తిన పెట్టుకున్న ప్రజలు బండకేసి బాదడానికి రెడీగా ఉన్నారు' అని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు, బిడ్డ ఎందరు వచ్చి కుట్రలు పన్నినా తననేం చేయలేరని చెప్పారు. రాష్ట్రానికి దశాదిశా నిర్దేశించే వ్యక్తిగా తనను గెలిపించాలని మధిర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి 20 సీట్లే వస్తాయని కేసీఆర్ భావిస్తే కాకిలా రాష్ట్రమంతా ఎందుకు తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో గెలుపుపై నమ్మకం లేకే కామారెడ్డిలోనూ సీఎం కేసీఆర్ పోటీ చేస్తుంటే ఆయన మధిరలో నిలబెట్టిన అభ్యర్థి ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ 75కుపైగా స్థానాల్లో గెలుస్తుందని.. ఆ తర్వాత సీఎం ఎవరో తమ అధిష్టానం నిర్ణయిస్తుందని భట్టి చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉపాధి హామీ, పింఛన్లు, బ్యాంకుల జాతీయీకరణ, బహుళార్థక సాధక ప్రాజెక్టులు ఇలా ఎన్నో ఉన్నాయని తెలిపారు. సీఎంగా ఉండి కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమైతే, తాను సీఎల్పీ నేతగా మధిర నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని చెప్పారు. దళితబంధు పథకం అమలు విషయంలో తాను సూచనలు చేస్తే కేసీఆర్ మాత్రం ఓట్ల కోణంలో చూసి తనకు భయపడి మధిర అంతటా అమలు చేస్తానని ప్రకటించారని తెలిపారు.

భట్టికి వైఎస్సార్ మాదిరి పదవి రాబోతోంది

కల్వకుంట్ల రమ్యారావు



ముదిగొండ: రాబోయే కాంగ్రెస్ పాలనలో భట్టి విక్రమార్కకు వైఎస్ లాంటి గొప్ప పదవి రాబోతోందని, ప్రజలే ప్రాణమని పాదయాత్ర చేసిన గొప్పవ్యక్తి అని కల్వకుంట్ల రమ్యారావు (సీఎం కేసీఆర్ అన్న కూతురు) వ్యాఖ్యానించారు. మధిర ప్రజలు ఆయన్ను గెలిపించి చరిత్రకెక్కుతారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలం బాణాపురంలో మంగళవారం జరిగిన ప్రచార ర్యాలీలో ఆమె పాల్గొని భట్టికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం రావాలని వైఎస్సార్ మాదిరిగా మండుటెండలో భట్టి విక్రమార్క పాదయాత్ర చేశారని తెలిపారు. అభిమానులు భట్టి విక్రమార్కపై పూల వర్షం కురిపించినట్లుగానే ఓట్ల వర్షం కురిపించాలని కోరారు. కారు పార్టీ నేతలవి కారు కూతలని, ప్రజలను మభ్యపెట్టే మాటలని రమ్యారావు మండిపడ్డారు.

బరిలోకి బడా నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

నేతలతో సమావేశమయ్యారు. బుధవారం ఆయన అలంపూర్, నల్లగొండల్లో జరిగే ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఇక రాహుల్‌గాంధీ ఈనెల 24న తెలంగాణకు వస్తున్నారు. ఆయన 28వ తేదీ వరకు ఇక్కడే ఉంటారని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. అయితే ఆయన ఎన్ని రోజులు ఇక్కడ ఉండాలి, ఏయే నియోజకవర్గాల్లో పర్యటించాలన్న దానిపై సునీల్ కనుగోలు టీం కసరత్తు చేస్తోంది.

10 నియోజకవర్గాల్లో ప్రియాంక ప్రచారం

మరోవైపు ప్రియాంకాగాంధీ కూడా ఈనెల 24వ తేదీనే తెలంగాణకు వస్తున్నారు. పాలకుర్తిలో జరిగే బహిరంగ సభకు హాజరు కానున్న ప్రియాంక 25, 27 తేదీల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఆమె ఈ దఫాలో మొత్తం 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు. ఇలావుండగా సోనియాగాంధీని కూడా చివరి వారంలో ఎన్నికల ప్రచారానికి తీసుకురావాలని టీపీసీసీ యోచిస్తోంది. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఏఐసీసీ వెనుకాముందాడుతోందని, ఒకవేళ సోనియా పర్యటన ఖరారైతే 27, 28 తేదీల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆమె సభ ఉంటుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

పరిస్థితేంటి?: కేసీవీ ఆరా

ఎన్నికల ప్రచార సరళి, పార్టీ అభ్యర్థుల పనితీరుపై ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరా తీశారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన పార్టీ పరిశీలకులు, పార్లమెంటు ఇన్‌చార్జులు, అసెంబ్లీ కో ఆర్డినేటర్లు, పీసీసీ ముఖ్య నేతలతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్, బీజేపీల కంటే ప్రచారంలో ఎట్టి పరిస్థితుల్లో వెనుకబడకూడదని, ఈ మేరకు అభ్యర్థులతో సమన్వయం చేసుకోవాలని పరిశీలకులు, సమన్వయకర్తలకు ఆయన సూచించారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలోని కీలకాంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న 1.44 కోట్ల నగదు పట్టివేత

హస్తినాపురం (హైదరాబాద్): ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న తనిఖీల్లో ఎల్బీనగర్‌పరిధిలో సోమవారం కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.1.44 కోట్ల నగదును పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలను ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ మంగళవారం మీడియాకు వెల్లడించారు. చింతలకుంటలోని వాసవి ఎన్‌క్లేవ్, ఇంజనీర్స్ కాలనీలో డబ్బులు తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఇదేసమయంలో నగరంలోని నాంపల్లి హౌసింగ్ సొసైటీలో నివాసం ఉంటున్న రాజస్తాన్‌లోని అహోర్ గ్రామానికి చెందిన కీర్తి కుమార్ (60) తన కారులో వనస్థలిపురం వాసవి కాలనీ నుంచి బయల్దేరారు. తనిఖీల్లో భాగంగా ఆయన కారును పరిశీలించగా కారులో రూ.1.44 కోట్ల నగదు లభించింది. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించలేకపోవడంతో పోలీసులు ఆ డబ్బుల్ని స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌కే మద్దతిస్తాం

మాదిగ హక్కుల దండోరా ప్రకటన

పంజగుట్ట: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోసం చేసిన బీజేపీ మరోమారు మంద కృష్ణను అడ్డంపెట్టుకుని మాదిగలను మోసం చేసేందుకు చూస్తున్నదని మాదిగ హక్కుల దండోరా ఆరోపించింది. దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు అని తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ మాట్లాడుతూ..దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లారని, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి ఉషామెహ్రా కమిటీ వేయించారని గుర్తుచేశారు. కమిటీ కూడా వర్గీకరణ ఎంతో అవసరమని నివేదిక ఇచ్చిందని, కాని తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో కమిటీ నివేదికను నాయకులు పట్టించుకోలేదన్నారు.

కులమతాలకు అతీతంగా అభివృద్ధి: అసద్



హైదరాబాద్: కులమతాలకు అతీతంగా ఎంఐఎం పార్టీ అభివృద్ధి పనులను చేపడుతుందని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. మంగళవారం నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి మాజిద్ హుస్సేన్‌తో కలిసి విజయనగర్ కాలనీ, మాసబ్‌ట్యాంక్, శాంతినగర్ తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. మాజిద్ హుస్సేన్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నుంచి ఎంఐఎం పార్టీ ప్రజల సేవకే అంకితమైందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని పేర్కొన్నారు.

పుట్టపర్తిలో నేడు రాష్ట్రపతి పర్యటన



పుట్టపర్తి అర్బన్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి రానున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రపతి మధ్యాహ్నం 3.05 గంటలకు ఒడిశాలో బయలుదేరి 2.35 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన 2.45 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.05 గంటలకు సాయికుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 42వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. 3.35 గంటలకు స్నాతకోత్సవంలో భాగంగా 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తారు. అనంతరం ప్రసంగిస్తారు. 4.20 గంటలకు రోడ్డు మార్గాన సత్యసాయి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

ఓటమి భయంతోనే దుష్ప్రచారం

బీఆర్‌ఎస్‌పై సీఈసీకి ఫిర్యాదు చేస్తామన్న అభిషేక్ సింఘ్వీ



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్‌కు కళ్లముందు ఓటమి కనిపిస్తోందని, ఆ భయంతోనే కేసీఆర్ ఆయన కుటుంబం కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తోందని సీడబ్ల్యూసీ సభ్యుడు, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ ఆరోపించారు. కేసీఆర్ కారు బేకారు అయిందని, రాష్ట్రం అవినీతి ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. మంగళవారం ఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ కార్యాలయంలో అభిషేక్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఎన్నికల సంఘం అనుమతి లేకుండా 'ఏ టూ జెడ్ ఆఫ్ స్కాంగ్రెస్' పేరుతో ప్రకటనలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. 'కేసీఆర్ భరోసా' తదితర ప్రకటనలకు ఈసీ అనుమతి తీసుకున్న కేసీఆర్ 'ఏ టూ జెడ్ ఆఫ్ స్కాంగ్రెస్' ప్రకటనకు ఎందుకు అనుమతి తీసుకోలేదని ప్రశ్నించారు. ఈసీ అనుమతి ఇవ్వదని తెలిసే కనీసం దరఖాస్తు కూడా చేయలేదన్నారు. ఈ ప్రకటనలను చూస్తుంటే బీజేపీతో కేసీఆర్ దోస్తీ చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోందని అభిషేక్ చెప్పారు. అవాస్తవాలు ప్రచారం కాకుండా, ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి కోరుతామన్నారు.


'స్కాంగ్రెస్‌పై' ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

బీఆర్‌ఎస్‌తో క్షమాపణ చెప్పించాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: స్కాంగ్రెస్ పేరుతో బీఆర్‌ఎస్ తరఫున రాష్ట్రంలోని పత్రికలకు ఇచ్చిన ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేసే విధంగా ప్రకటనలు ఇస్తున్న బీఆర్‌ఎస్‌పై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఇలాంటి ప్రకటనలకు ఎంసీఎంసీ ఎలా అనుమతిస్తుందని ప్రశ్నించిన నిరంజన్.. ఒకవేళ ఈసీ అనుమతి తీసుకోకుండా ఈ ప్రకటన ఇచ్చి ఉంటే బీఆర్‌ఎస్ తరఫున క్షమాపణలు చెప్పిస్తూ మరో ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఎన్నికలయ్యేంతవరకు బీఆర్‌ఎస్ ప్రకటనలను నిలిపివేయించాలని ఆ ఫిర్యాదులో నిరంజన్ కోరారు.

కర్ణాటకలో 166 హామీల్లో.. 158 నెరవేర్చాం

ఆ రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే



సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో కర్ణాటక ప్రజలకు 166 హామీలిచ్చామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందులో 158 నెరవేర్చామని ఆ రాష్ట్ర ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి పుష్పలీల, ఏఐసీసీ అధికార ప్రతినిధి రమణి తదితరులతో కలిసి మాట్లాడారు. కర్ణాటక ప్రజలకిచ్చిన ఐదు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడం ద్వారా 1.60 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, అన్నభాగ్య యోజన కింద 1.82 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా రోజుకు లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. తెలంగాణలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగా కర్ణాటకలో అవినీతికి చోటు లేదని, ప్రజల డబ్బు ప్రజలకే ఖర్చు చేస్తున్నామన్నారు. ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని ప్రియాంక్ ఖర్గే వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌ను గద్దె దించే వరకు నిద్రపోను

మెదక్ రోడ్‌షోలో విజయశాంతి



మెదక్: పదేళ్లు తెలంగాణను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అప్పగిస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆయనను గద్దె దింపే వరకూ నిద్రపోనని కాంగ్రెస్ మహిళానేత విజయశాంతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మెదక్ రోడ్‌షోలో ప్రసంగించారు. మీరు కాంగ్రెస్‌కు వేసే ఒక్కో ఓటు కేసీఆర్‌కు పోటు కావాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్లు కొల్లగొట్టిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదేనని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోతుందని, ఇది ఆయన అవినీతికి నిదర్శనమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒక్కటేనని, లిక్కర్ మాఫియా కేసులో కవితను అరెస్టు చేయకుండా ఎందుకు వదిలి పెట్టారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని మరవొద్దని, మరో పది రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం చేరిక



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే పార్టీ కండువా కప్పి ఆయనను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎన్నికల పరిశీలకులు బోసు రాజు, వీహెచ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వివేక్‌పై ఈడీ దాడులు

- మంచిర్యాల, రామగుండం, హైదరాబాద్‌లోని ఇళ్లు, ఆఫీసులపై ఏకకాలంలో సోదాలు
- బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరగానే నాపై ఈడీ దాడులు: వివేక్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సాక్షి హైదరాబాద్: మాజీ ఎంపీ, చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామికి చెందిన ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాడులు చేశారు. మంచిర్యాల, రామగుండం, హైదరాబాద్‌లోని దాదాపు పది చోట్ల జరిగిన ఈ తనిఖీల్లో ఆరుగురు ఈడీ అధికారులతో కూడిన రెండు బృందాలు పాల్గొన్నాయి. ఉదయం 5.30 గంటలకే ముగ్గురు ఈడీ అధికారులు మంచిర్యాల పట్టణం హైటెక్ సిటీలోని వివేక్ ఇంట్లో విస్తృత సోదాలు మొదలుపెట్టారు. ఆ సమయంలో వివేక్, కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. మరోవైపు హైదరాబాద్ సోమాజిగూడలోని వివేక్ ఇల్లు, బేగంపేటలోని విశాక ఇండస్ట్రీస్ హెడ్ ఆఫీస్‌లోనూ సోదాలు జరిగాయి. విశాక ఇండస్ట్రీస్‌కు చెందిన బ్యాంక్ లావాదేవీలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో కొన్ని కీలక పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈడీ దాడుల విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు చెన్నూరులోని ఆయన నివాసానికి భారీగా తరలివచ్చారు.

ఆ ఫిర్యాదుతోనే...

విశాక ఇండస్ట్రీస్ నుంచి ఇటీవల రూ. 8 కోట్లు అనుమానాస్పదంగా రామగుండానికి చెందిన విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థకు బదిలీ అయ్యాయంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఈసీతోపాటు ఐటీ, ఈడీకి ఫిర్యాదు చేయడం, ఈసీ ఆదేశాలతో సైఫాబాద్ పోలీసులు ఆ ఖాతాను ఫ్రీజ్ చేసిన నేపథ్యంలో ఈడీ సోదాలు జరగడం గమనార్హం.

అంతా లీగల్ డబ్బే: వివేక్

తన ఆస్తులపై ఏకకాలంలో పది చోట్ల ఈడీ దాడులు చేసిందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోదాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.8 కోట్ల లావాదేవీలపై 12 గంటలపాటు తనను నిర్బంధించి, ప్రశ్నించినా ఏం దొరకలేదన్నారు. తాను ఇప్పటివరకు రూ.10 వేల కోట్ల ఆదాయపన్ను కట్టానని... తన వద్ద అక్రమ సంపాదన ఏదీ లేదని... అంతా లీగల్ డబ్బే ఉందన్నారు. నాలుగేళ్లు బీజేపీలో ఉన్నప్పుడు జరగని ఈడీ దాడులు కాంగ్రెస్‌లో చేరగానే జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో అమిత్ షా, రాష్ట్రంలో కేసీఆర్ కుట్రపన్ని దాడులు చేయిస్తున్నారన్నారు.

జిన్నింగ్ మిల్లులు, వ్యాపారుల ఇళ్లలో ఐటీ తనిఖీలు..

ఓ వ్యాపారి ఇంట్లో రూ. 8.5 కోట్ల నగదు లభ్యం

జమ్మికుంట/చిల్పూరు/రఘునాథపల్లి: రాష్ట్రవ్యాప్తంగా పలువురు కాటన్ వ్యాపారుల ఇళ్లు, వ్యాపార సముదాయాలపై ఆదాయపన్ను (ఐటీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో దాడులు చేశారు. కాటన్ ఎగుమతులు, దిగుమతుల క్రయవిక్రయాలతోపాటు డబ్బులకు సంబంధించిన రోజువారీ రికార్డులను పరిశీలించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట, కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లా జోగిపేట, జనగామ జిల్లా చిల్పూరు, రఘునాథపల్లికి చెందిన పలువురు కాటన్ వ్యాపారుల ఇళ్లలో ఈ తనిఖీలు జరిగాయి. ఆసిఫాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి రఫీక్ నివాసంలో జరిగిన తనిఖీల్లో రూ. 8.50 కోట్లకుపైగా నగదు లభించినట్లు సమాచారం. గత ఆరేళ్లలో కాటన్ వ్యాపారులు పెద్దమొత్తంలో లావాదేవీలు నిర్వహించారని, గతంలో ఓ పార్టీకి చెందిన వ్యక్తికి రూ. కోట్లు సర్దుబాటు చేశారని.. దీనిపై భాగస్వాముల్లో ఒకరు ఐటీకి ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీలు జరిగాయని పలువురు చర్చించుకున్నారు. ఈ వ్యాపారుల్లో కొందరు అధికార బీఆర్‌ఎస్‌కు సన్నిహితులు కావడం గమనార్హం.

ముస్లింలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలి

తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

పంజగుట్ట: అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ సలీం పాషా, కో కన్వీనర్ షేక్ యూసుఫ్ బాబా(స్కైబాబా), ముఖ్య సలహాదారుడు ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ, రాష్ట్ర కోఆర్డినేటర్ మహ్మద్ యూనస్ పర్వేజ్, కోర్ కమిటీ సభ్యులు జీనత్‌ఫర్ అక్మీ సయ్యద్, సయ్యద్ సవాత్, షేక్ హనీఫ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు మహ్మద్ అహ్మద్ ఖాన్‌తోపాటు రాష్ట్ర కమిటీసభ్యులు, తెలంగాణలోని అన్ని జిల్లాల ముస్లిం జేఏసీ ఇన్‌చార్జ్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టిందని, ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఉన్న పరస్పర అవగాహనే కారణమని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీల రహస్యమైత్రిని తెలంగాణ ముస్లిం సమాజం గమనిస్తోందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలవకుండా చేస్తేనే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించడం సులువవుతుందన్న అభిప్రాయం మేరకు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపాలని సూచించారు. దేశంలోని ముస్లింలపట్ల బీజేపీ విద్వేషాన్ని చిమ్ముతోందని, దానిని బలపరుస్తున్న బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని ఎంఐఎం చెబుతోందన్న విషయాన్ని గ్రహించాలని కోరారు.

నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆరోపణ

హైదరాబాద్: గత 9 సంవత్సరాల కాలంలో యువతను, నిరుద్యోగులను అన్నిరకాలుగా మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, రాష్ట్ర మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్ తాము అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని చెబుతూ మరోమారు మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాల సాధన కోసం వందలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు.

విజయానికి ఏడు హామీలు

రాజస్థాన్‌లో గహ్లోత్‌కు చావో రేవో ● ప్రజాకర్షక పథకాలపైనే ఆశలు

సర్వశక్తులూ ఒడ్డుతున్న సీఎం ● చరిత్రను తిరగరాసే ప్రయత్నం

రాజస్థాన్‌లో గత 30 ఏళ్లలో అధికార పార్టీ నెగ్గిన దాఖలా లేదు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రభుత్వం మారుతూ వస్తోంది. ఈసారి మాత్రం వరుసగా రెండో విజయంతో చరిత్రను తిరగరాసేందుకు సీఎం అశోక్ గహ్లోత్ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఈ విషయంలో 'ఏడు హామీ'లపై బాగా ఆశలు పెట్టుకున్నారు. ఆ పథకాలు తనను కచ్చితంగా గట్టెక్కిస్తాయని నమ్ముతున్నారు...!

రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల పర్వం క్లైమాక్స్‌కు చేరుతోంది. అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. పోలింగ్‌కు మరో మూడు రోజులే ఉంది. గురువారం సాయంత్రంతో ప్రచారానికి కూడా తెర పడనుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని సీఎం గహ్లోత్ టాప్ గేర్‌లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్ తరఫున అంతా తానై వ్యవహరిస్తున్నారు. రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలతో హోరెత్తిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో వీలైనన్ని అసెంబ్లీ స్థానాలను కవర్ చేయనున్నారు. ముఖ్యంగా మహిళలకు రూ.10 వేల భృతి మొదలుకుని రూ.25 లక్షల వైద్య సాయం దాకా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న, అందించబోయే పథకాలను ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ప్రచార సభలోనూ అవి ప్రధానంగా ప్రస్తావనకు వచ్చేలా జాగ్రత్త పడుతున్నారు.

జీవన్మరణ సమస్య!

72 ఏళ్ల గహ్లోత్‌కు ఒకరకంగా ఈ అసెంబ్లీ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ యువ నేత సచిన్ పైలట్‌ను ఈసారి ఆయన పూర్తిగా పక్కన పెట్టారు. కనుక ఫలితాలు ఏ మాత్రం వికటించినా గహ్లోత్ రాజకీయ జీవితానికి తెర పడవచ్చన్న అభిప్రాయముంది. అందుకే కొద్ది రోజులుగా ఆయన దూకుడు పెంచారు. రోజుకు కనీసం నాలుగైదు సభల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఒక్క రోజు ఏకంగా 800 కిలోమీటర్లు పర్యటిస్తున్నారు! తన ఓబీసీ సామాజిక వర్గ మూలాలను కూడా సమయానుకూలంగా ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ప్రచార సభలోనూ ప్రధాని మోదీపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ఆయన ప్రసంగాల్లో కాంగ్రెస్ పథకాలనే యథాతథంగా కాపీ కొడుతున్నారంటూ ఎద్దేవా చేస్తున్నారు. తమ ఏడు హామీలకు పోటీగా బీజేపీ తెరపైకి తెచ్చిన 'మోదీ హామీ'లను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ, అవన్నీ కాంగ్రెస్ హామీలకు నకళ్లేనని పదేపదే చెబుతున్నారు. ''ఇది బీజేపీకి బాగా మైనస్‌గా మారుతోంది. ఈసారి కచ్చితంగా గెలుపు కాంగ్రెస్‌దే. ఓటర్లు ఈ మేరకు నిర్ణయించుకున్నారు కూడా'' అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రోజూ క్రమం తప్పకుండా స్వీయ ప్రచార వీడియోలను కూడా విడుదల చేస్తూ, అవి వీలైనంత మందికి చేరేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు గహ్లోత్.

రాజస్థాన్లో కాంగ్రెస్ ఏడు హామీలు...

1. కుటుంబ పెద్ద అయిన మహిళకు ఏటా రూ.10,000 భృతి
2. ప్రభుత్వ కాలేజీలో చేరే ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్
3. చిరంజీవి ఆరోగ్య బీమా పథకం ద్వారా రూ.25 లక్షల దాకా వైద్య సాయం. ఇందులో భాగంగా రూ.15 లక్షల ప్రమాద బీమా
4. అందరికీ ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్య
5. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
6. పాత పెన్షన్ పథకానికి చట్టబద్ధత
7. రైతుల నుంచి రూ.2కు కిలో చొప్పున పేడ కొనుగోలు

అధిష్టానం అనుగ్రహం కోసం...

రాష్ట్రస్థాయిలో గెలుపు కోసం శాయశక్తులా ప్రయత్నాలు చేస్తూనే, అధిష్టానంతో సంబంధాలను కూడా సరిదిద్దుకునే పనిలో పడ్డారు గహ్లోత్. గతేడాది కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగాల్సిందిగా సోనియా ఆదేశించినా ఆయన బేఖాతరు చేయడం తెలిసిందే. దీనిపై గాంధీ కుటుంబం గుర్రుగా ఉన్న నేపథ్యంలో, వీలు దొరికినప్పుడల్లా సోనియా, రాహుల్, ప్రియాంకలను ఆయన ఆకాశానికెత్తుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రచార పర్వమంతా రాహుల్, ప్రియాంక కనుసన్నల్లోనే జరుగుతోందని పదేపదే చెప్పుకొస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



కార్మికులు కనిపించారు

- ఎండోస్కోపీ కెమెరాతో ప్రయత్నాలు సఫలం
- బయటికొచ్చిన మొట్టమొదటి విజువల్స్
- పైప్‌లైన్ ద్వారా మరింత స్పష్టంగా మాట్లాడే అవకాశం

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగం కూలిన 10వ రోజైన మంగళవారం సానుకూల పరిణామం సంభవించింది. లోపల చిక్కుకున్న 41 మంది కార్మికులతో వారి కోసం బయట వేచి ఉన్న కుటుంబసభ్యులు మరింత సులువుగా, స్పష్టంగా మాట్లాడారు. అంతేకాకుండా, లోపలున్న వారికి సంబంధించిన విజువల్స్ మొట్టమొదటిసారిగా బయటకు వచ్చాయి. దీంతో, కూలిన సొరంగం శిథిలాల్లోంచి తవ్విన ఆరంగుళాల పైప్‌లైన్ ద్వారా ఎండోస్కోపిక్ కెమెరాను పంపించి, లోపలున్న వారి యోగ క్షేమాలను తెలుసుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు విజయవంతమైనట్లయింది. ఈ పైపును 53 మీటర్ల మేర అడ్డుపడిన శిథిలాల గుండా సోమవారం లోపలికి ప్రవేశపెట్టారు. కెమెరాను సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి అక్కడికి పంపించారు. పసుపు, తెలుపు రంగుల హెల్మెట్లను ధరించిన కార్మికులు, పైపులైన్‌ద్వారా లోపలికి పంపించిన ఆహార పదార్థాలను ఒకరికొకరు అందించుకుంటూ, మాట్లాడుకుంటూ ఆ విజువల్స్‌లో కనిపించారు. బయటున్న అధికారులు పెద్ద స్క్రీన్‌పై వారిని చూస్తూ తగు సూచనలు ఇచ్చారు. కెమెరా లెన్స్ శుభ్రంగా ఉంచుతూ, తమను తాము పరిచయం చేసుకోవాలని కోరారు. పైప్‌లైన్ దగ్గరకు చేరుకుని లోపలికి పంపించిన వాకీటాకీలతో మాట్లాడాలని చెప్పారు. అనంతరం ఆ కెమెరాను వెనక్కి తీశారు. ఇప్పటికే కొందరి కుటుంబసభ్యులు నాలుగంగుళాల కంప్రెషర్ ట్యూబ్ ద్వారా లోపలున్న తమ వారితో మాట్లాడారు. ఆ ట్యూబ్ ద్వారానే డ్రైఫ్రూట్స్ వంటివి కూడా లోపలికి పంపించారు. అయితే, తాజాగా అందుబాటులోకి వచ్చిన పైప్‌లైన్ కార్మికుల పాలిట లైఫ్‌లైన్‌గా మారింది. ఇంతకుముందు కంటే ఎక్కువ ఆహారాన్ని పంపొచ్చు. కుటుంబసభ్యులతో మరింత సులువుగా, స్పష్టంగా మాట్లాడుకోవచ్చు. కొత్త పైపు ద్వారా లోపలున్న వారికి నారింజ, అరటి, యాపిల్ పండ్లు, బాటిళ్లలో కిచిడీ, సెల్‌ఫోన్లు, చార్జెర్లను సైతం పంపించారు. ఒక డాక్టర్ కూడా లోపలున్న కార్మికులతో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కడుపులో మంట, మూత్ర విసర్జనలో సమస్య..తదితరాలను తెలపగా వారికి మల్టీవిటమిన్ ట్యాబెట్లు, ఎలక్ట్రోలైట్ పౌడర్, యాంటీ డిప్రెస్సెంట్‌లను పంపినట్లు డాక్టర్ పీఎస్ పొఖ్రియాల్ చెప్పారు. సొరంగంలో చిక్కుకుపోయిన ప్రదీప్ కిక్కు క్షేమంగానే ఉన్నట్లు ఆయన మరదలు తెలిపారు.



సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులు, వారు ఆహారం తీసుకుంటున్నప్పటి దృశ్యాలు

మరో పక్క నుంచి టన్నెల్ పనులు

కార్మికులను సాధ్యమైనంత త్వరగా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందుకోసం సొరంగం రెండో వైపు బార్‌కోట్ నుంచి సొరంగాన్ని నిర్మించే పనులు మొదలుపెట్టారు. ఈ బ్యాకప్ టన్నెల్ వ్యాసం మూడు మీటర్లుంటుందని అధికారులు చెప్పారు. ఇది పూర్తయితే లోపలున్న వారందరినీ తేలిగ్గా బయటకు తీసుకువచ్చేందుకు వీలుపడుతుంది. సొరంగంలోని కూలిన భాగం, పూర్తయిన నిర్మాణం మధ్య దూరాన్ని అంచనా వేసేందుకు రెండు సార్లు డ్రోన్‌లతో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒక డ్రోన్ శిథిలాల మీదుగా 28 మీటర్లకు మించి దూరం వెళ్లలేకపోగా, మరో డ్రోన్ దెబ్బతిందని అధికారులు చెప్పారు. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన రోబో కూడా నిటారుగా ఉన్న శిథిలాల మీదుగా పైకెక్కలేకపోయింది. కొండప్రాంతం పైనుంచి సొరంగంలోకి నిటారుగా డ్రిల్లింగ్ చేసేందుకు 75 టన్నుల భారీ యంత్రానికి ప్లాట్‌ఫాంగా ఉపయోగించుకునేందుకు తలపెట్టిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది.

రామాయణం, భారతం ఇక 'సాంఘికం'

ఎన్‌సీఈఆర్‌టీ ప్యానెల్ సిఫార్సులు

న్యూఢిల్లీ: రామాయణ, మహాభారతాలను పాఠశాల విద్యార్థులకు సాంఘికశాస్త్ర పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా బోధించాలని జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) ప్యానెల్ సిఫార్సు చేసింది. గత ఏడాది ఏర్పాటైన ప్యానెల్ తాజాగా చేసిన పలు సిఫార్సులపై మంగళవారం జాతీయ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. రాజ్యాంగ పీఠికను తరగతి గదుల గోడలపై ముద్రించాలని ప్యానెల్ సిఫార్సు చేసిందని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ సీఐ ఇసాక్ చెప్పారు. 'సిఫార్సులపై ఎన్‌సీఈఆర్‌టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఏటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి ఆ దేశ పౌరసత్వం కోసం పడిగాపులు పడుతున్నారు. ఈ తరం పిల్లల్లో దేశభక్తి లోపించింది. దేశభక్తి, భారతదేశ ఘన చరిత్ర చూసి మనం ఎంతగా గర్వపడాలో తెలిపేలా పాఠ్యాంశాలు ఉండాలి. కొన్ని బోర్డులు ఇప్పటికే రామాయణ, మహాభారతాలను బోధిస్తున్నాయి. అయితే ఇప్పుడు అది విస్తృతస్థాయిలో జరగాలి' అని ఇసాక్ వ్యాఖ్యానించారు.

కరోనా టీకాతో తప్పిన ఆకస్మిక మరణాల ముప్పు

న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. భారత్‌లోనూ కోట్లాది మంది ఈ వైరస్ బారినపడ్డారు. లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా వ్యాప్తిని నియంత్రించడానికి టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలు టీకా రెండు డోసులు తీసుకున్నారు. ఒక డోసు తీసుకున్నవారు కూడా ఉన్నారు. అయితే, ఈ వ్యాక్సిన్ యువతకు చాలా మేలు చేసినట్లు భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) అధ్యయనంలో వెల్లడయ్యింది. కరోనా వ్యాక్సిన్‌తో దేశంలో యువతీ యువకుల్లో ఆకస్మిక మరణాల ముప్పు చాలావరకు తగ్గినట్లు తేలింది. కనీసం ఒక డోసు తీసుకున్న వారిలోనూ ఆకస్మిక మరణాలు తగ్గాయని అధ్యయనం వెల్లడించింది. 2021 అక్టోబర్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా 47 ఆస్పత్రుల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. ఎలాంటి వ్యాధులు లేకుండా ఆకస్మికంగా మరణించిన 18–45 ఏళ్ల వయసున్న యువత కేసులను విశ్లేషించారు. 729 కేసులను అధ్యయనం చేశారు. కరోనా టీకా రెండు డోసులు తీసుకున్న వారిలో ఆకస్మిక మరణానికి గురయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది.

'ఆ 3 చట్టాలకు హిందీ పేర్లు పెట్టొచ్చు'

న్యూఢిల్లీ: భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షాస్మృతి, భారతీయ సాక్ష్యాధారాల చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం సమర్థించింది. ఇందుకు సంబంధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(హోం శాఖ) తాజాగా తన నివేదికను రాజ్యసభకు సమర్పించింది. 'నేర చట్టాలకు ప్రతిపాదిత మూడు హిందీ పేర్లు రాజ్యాంగవిరుద్ధమైనవి కావు. రాజ్యాంగంలోని 348 అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులు, చట్టాలు, బిల్లులు, ఇతర అధికార పత్రాలు ఇంగ్లిష్ భాషలోనే ఉండాలనే నిబంధన ఉంది. ఆ చట్టాల పేర్లు హిందీలో ఉండకూడదు అనే నిబంధన లేదు. చట్టాలకు మాత్రమే హిందీ పేర్లు పెట్టారు. చట్టాల్లోని వాక్యాలు మొత్తం ఇంగ్లిష్‌లోనే ఉన్నాయి. ఇక్కడ రాజ్యాంగ ఉల్లంఘన జరగలేదు'' అని స్టాండింగ్ కమిటీ నివేదించింది. భారతీయశిక్షా స్మృతి-1860 చట్టం పేరును భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్-2023)గా, నేర శిక్షా స్మృతి-1898 చట్టం పేరును భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్-2023)గా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 చట్టం పేరును భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ-2023)గా ప్రతిపాదిస్తూ సంబంధిత మూడు బిల్లులను మోదీ సర్కార్ ఆగస్టు 11వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే.

యాడ్స్ ఆపకుంటే రూ.కోటి జరిమానా

న్యూఢిల్లీ: కొన్ని రకాల వ్యాధులను అల్లోపతి కంటే పతంజలి ఉత్పత్తులే నయం చేయగలవంటూ తప్పుడు వాణిజ్య ప్రకటనలు వెలువడుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. ఆ యాడ్స్ ఇస్తున్న పతంజలి ఆయుర్వేదను గట్టిగా మందలించింది. 'అల్లోపతి ఔషధాలను లక్ష్యంగా చేసుకుంటూ యాడ్స్ ఇవ్వడం మానుకోండి. లేదంటే కోటి రూపాయల జరిమానా విధిస్తాం. తప్పుడు ప్రకటనలను భవిష్యత్తులోనూ ఇవ్వబోమని హామీ ఇవ్వండి' అని పతంజలి ఆయుర్వేదను జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. మీడియా ముందు అసంబద్ధ ప్రకటనలు చేయకూడదని సూచించింది. పతంజలి యాడ్స్‌ను తప్పుబడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) దాఖలుచేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై విధంగా ఆదేశాలిచ్చింది. 'పతంజలి చేస్తున్న ప్రచారానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. డ్రగ్స్, ఇతర మేజిక్ రెమిడీస్ యాక్ట్-1954, వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019లను ఉల్లంఘించేలా పతంజలి యాడ్స్ ఉన్నాయి' అని ఐఎంఏ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ అంశంలో సరైన మార్గదర్శకాలు జారీచేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

రన్‌వే దాటి సముద్రంలోకి దూసుకెళ్లి...

అమెరికాలో నావికాదళ విమానానికి స్వల్ప ప్రమాదం



హోనలూలు: అమెరికా నావికా దళానికి చెందిన భారీ విమానమొకటి రన్‌వేను దాటేసి అకస్మాత్తుగా సముద్రంలోకి దూసుకెళ్లింది. బోయింగ్ తయారీ పోసిడాన్-8ఏ రకం భారీ విమానం హవాయిలోని మెరైన్ కోర్ సైనికస్థావరం రన్‌వేను దాటి కనోహే బే సముద్రజలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ఇందులోని తొమ్మిది మంది సిబ్బంది సురక్షితంగా బయటపడటం విశేషం. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటన తాలూకు వివరాలను అమెరికా తీర గస్తీ దళ విభాగ అధికార ప్రతినిధి ఓర్లాండో పెరెజ్ వెల్లడించారు. వాతావరణంలో పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో ఘటనాస్థలి వద్ద విమానానికి ఒక మైలు దూరం మించి కనిపించే పరిస్థితి లేదని హోనలూలులోని జాతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రమాదానికి పొగమంచే అసలు కారణమని తెలుస్తోంది. అధికారికంగా కారణాలను అధికారులు వెల్లడించలేదు.

బందీలకు ఇక విముక్తి!

- హమాస్‌తో కొలిక్కివచ్చిన సంప్రదింపులు
- ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలన్న హమాస్
- కాల్పుల విరమణ పాటించాలని, మానవతా సాయాన్ని అనుమతించాలని స్పష్టీకరణ
- మిలిటెంట్ల షరతులకు ప్రభుత్వం అంగీకారం
- ఇజ్రాయెల్–హమాస్ మధ్య అతి త్వరలో ఒప్పందం

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: గాజాస్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న దాదాపు 240 మంది బందీలకు త్వరలోనే విముక్తి లభించే సూచనలు కనిపిస్తున్నాయి. బందీల్లో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులూ ఉన్నారు. వారందరినీ క్షేమంగా విడిపించడానికి ఇజ్రాయెల్, అమెరికా, ఖతార్ దేశాలు ప్రయత్నాలు వేగవంతం చేశాయి. ఆయా దేశాల ప్రతినిధులు హమాస్‌తో కొన్ని రోజులుగా జరుపుతున్న సంప్రదింపులు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. బందీలను విడుదల చేయాలంటే ఇజ్రాయెల్ సైన్యం తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలని, గాజాలోకి పెద్ద ఎత్తున మానవతా సాయాన్ని అనుమతించాలని, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఫైటర్లను విడుదల చేయాలని హమాస్ షరతు విధించింది. దీనికి ఇజ్రాయెల్ అంగీకరించినట్లు సమాచారం. బందీలకు స్వేచ్ఛ ప్రసాదించే విషయంలో అతి త్వరలో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని హమాస్ సీనియర్ నాయకుడు ఇజ్జత్ రిష్క్ మంగళవారం వెల్లడించారు. ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న పాలస్తీనియన్లను విడుదల చేస్తే బందీలను వదిలిపెట్టడానికి తాము సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందానికి చాలా సమీపంలోకి వచ్చామని ప్రవాసంలో ఉన్న హమాస్ నేత ఇస్మాయిల్ హనియేహ్ చెప్పారు. ఒప్పందం చివరి దశలో ఉందని ఖతార్ తెలియజేసింది. అంతా అనుకున్నట్లు జరిగితే గాజా నుంచి బందీలు వారి స్వదేశాలకు చేరడం ఖాయమే. అయితే, హమాస్‌పై ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రభుత్వం నోరువిప్పడం లేదు. హమాస్ చెరలో ఉన్న తమ ఆప్తులను విడిపించాలని బందీల కుటుంబ సభ్యులు ఇజ్రాయెల్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. నిత్యం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అంశం రాజకీయంగా తనకు చాలా నష్టం కలిగించే ప్రమాదం ఉండడంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ నాలుగు మెట్లు కిందికి దిగొచ్చినట్లు స్థానిక మీడియా అంచనా వేస్తోంది.

హమాస్ షరతులేమిటి?

గాజాపై ఐదు రోజులపాటు భూతల, వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపివేస్తే బందీల్లో 50 మంది మహిళలు, చిన్నారులను వదిలేస్తామని హమాస్ షరతు విధించినట్లు తెలిసింది. ఆ తర్వాత ముగ్గురు పాలస్తీనియన్ ఖైదీలకు చొప్పున బదులుగా ఒక్కో బందీని విడిచిపెడతామని చెబుతున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ జైళ్లలో 8 వేల మందికిపైగా పాలస్తీనా ఫైటర్లు శిక్ష అనుభవిస్తున్నారు. వారిని విడిపించుకోవడానికి బందీలను ఎరగా వాడుకోవాలని హమాస్ నిర్ణయించుకుంది.

జబాలియాపై వైమానిక దాడులు

ఒకవైపు బందీల విషయంలో సంప్రదింపులు జరుగుతుండగానే మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం యథాతథంగా కొనసాగుతోంది. ఉత్తర గాజాలోని జబాలియా సిటీని పూర్తిగా చుట్టుముట్టామని ఇజ్రాయెల్ మంగళవారం ప్రకటించింది. హమాస్ శిబిరాలపై వైమానిక దాడులు చేశామని, చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు మృతి చెందినవారి సంఖ్య 13,300కు చేరుకుంది. అల్–షిఫా ఆసుపత్రి నుంచి 31 మంది శిశువులను బయటకు తరలించిన సంగతి తెలిసిందే. నెలలు నిండక ముందే జన్మించిన వీరిని మెరుగైన చికిత్స కోసం ఈజిప్టుకు తరలిస్తుండగా, ఇద్దరు శిశువులు అల్–షిఫా ఆసుపత్రిలోనే చనిపోయారని వైద్యులు చెప్పారు. ఈజిప్టుకు చేర్చిన 28 మంది శిశువులకు చికిత్స కొనసాగుతోంది. మరో శిశువుకు గాజాలోనే చికిత్స అందిస్తున్నారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ఇద్దరు జర్నలిస్టులు మృతి

లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లో మంగళవారం హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు నిర్వహించింది. క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో ఫరా ఒమర్, రబీహ్ మామరీ అనే ఇద్దరు జర్నలిస్టులు, మరో ఇద్దరు పౌరులు బలయ్యారు. మృతిచెందిన ఇద్దరు జర్నలిస్టులు లెబనాన్‌కు చెందిన అల్–మయాదీన్ టీవీ చానల్‌లో పని చేస్తున్నారు.

అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు..

మూడు శత్రువులు

- రాజస్తాన్ ప్రచారంలో మోదీ



జైపూర్: అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ మారుపేరు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారకుండా ఈ మూడు భూతాలు అడ్డుపడ్డాయని అన్నారు. ఇవి మన మధ్య ఉన్నంత కాలం అనుకున్న లక్ష్యాలను సాధించలేమని వెల్లడించారు. దేశానికి ఈ మూడు ప్రధాన శత్రువులని తేల్చిచెప్పారు. మంగళవారం రాజస్తాన్‌లోని బరన్, కోటా, కరౌలీ జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో బాధలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దొంగలు, నేరగాళ్ల చేతికి అప్పగించిందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఓటమి ఖాయమని చిన్నపిల్లలు సైతం చెబుతున్నారని గుర్తుచేశారు. గహ్లోత్ పాలనలో రాష్ట్రం నేరగాళ్లకు అడ్డాగా మారిపోయిందని, సంఘ విద్రోహ శక్తులు చెలరేగిపోయాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి రాగానే వ్యవస్థలను ప్రక్షాళన చేస్తామన్నారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని, వారి సాధికారతే ధ్యేయంగా పని చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. యువత కలలను కాంగ్రెస్ ప్రభుత్వం భగ్నం చేసిందన్నారు. అరాచక ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. డిసెంబర్ 3న రాజస్తాన్‌లో ప్రభుత్వం మారడం తథ్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

పీఎం అంటే 'అపశకున మోదీ'

- దురదృష్టాన్ని మోసుకొచ్చే వ్యక్తి నరేంద్ర మోదీ: రాహుల్ గాంధీ



జైపూర్: ప్రధానమంత్రి(పీఎం) అంటే అపశకున మోదీ (పనౌతీ మోదీ) అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆయన దురదృష్టాన్ని మోసుకొచ్చే వ్యక్తి అని విమర్శించారు. మంగళవారం రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ ప్రసంగించారు. వన్డే క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో మోదీ పేరిట ఉన్న స్టేడియంలో ఆస్ట్రేలియా చేతిలో భారత జట్టు ఓడిపోయిందని, ప్రధాని మోదీ ఈ మ్యాచ్‌కు హాజరయ్యారని గుర్తుచేశారు. ప్రధానిపై రాహుల్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటంటూ బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థే

తిరువనంతపురం: పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తోయిబా ఉగ్ర సంస్థేనని ఇజ్రాయెల్ మరోసారి స్పష్టం చేసింది. ముంబై ఉగ్రదాడులకు 15 ఏళ్లు పూర్తి కావొస్తున్న సందర్భంగా ఇజ్రాయెల్ ఈ మేరకు ప్రకటించింది. 'లష్కరే తోయిబా ఉగ్ర సంస్థే. 2013 నుంచీ ఆ సంస్థ ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తోంది. పరిపాలనా పరమైన పొరపాటు కారణంగానే ఇటీవల ఆ విషయాన్ని స్పష్టం చేశాం. అంతే తప్ప ఇదేమీ కొత్త విషయం కాదు' అని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. అంతకుముందు ఇదే విషయాన్ని భారత్‌లోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం ప్రకటించింది.

'నేషనల్ హెరాల్డ్' ఉదంతంలో రూ.752 కోట్ల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక యాజమాన్య హక్కులున్న యంగ్ ఇండియా సంస్థ లావాదేవీల్లో మనీ లాండరింగ్ జరిగిందంటూ దాఖలైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది. మంగళవారం ఒక ప్రకటనలో సంస్థ ఈ మేరకు పేర్కొంది. 'ముంబై, ఢిల్లీ, లక్నోలో స్థిరాస్తులకు సంబంధించి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) రూ.661.69 కోట్ల విలువైన నేరాలకు పాల్పడింది. ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో యంగ్ ఇండియా(వైఐ) రూ.90.21 కోట్ల విలువైన నేరాలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలింది'' అని ఈడీ వివరించింది.

దేశ ప్రయోజనం కోసమే జమిలి ఎన్నికలు

మాజీ రాష్ట్రపతి, 'వన్ నేషన్– వన్ ఎలక్షన్'కమిటీ చైర్మన్ కోవింద్ వెల్లడి

రాయ్‌బరేలీ(యూపీ): జమిలి ఎన్నికల విధానం దేశ హితం కోసమేతప్ప, ఏ ఒక్క రాజకీయ పార్టీకీ సంబంధించింది కాదని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. దేశంలో లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకే విడతలో ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై కేంద్రం నియమించిన 8 మంది నిపుణుల కమిటీకి కోవింద్ చైర్మన్ అన్న విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో సోమవారం రాత్రి కోవింద్ మీడియాతో మాట్లాడారు. 'ఒకే విడతలో ఎన్నికలు జరిపితే డబ్బు ఆదా అయి, ప్రజలకు మంచి జరుగుతుంది. ఆ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. అందుకే, ఈ అంశాన్ని దేశానికి ప్రయోజనం కలిగించేది భావించి, సహకరించాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా. జమిలి ఎన్నికలతో ఏ రాజకీయ పార్టీకీ సంబంధం లేదు'అని ఆయన స్పష్టం చేశారు. 'పార్లమెంటరీ కమిటీ, నీతీ ఆయోగ్, భారత ఎన్నికల సంఘం వంటివి ఇప్పటికే జమిలి ఎన్నికలు ప్రయోజనకరమని చెప్పాయి. జమిలి ఆనవాయితీని దేశంలో మళ్లీ తీసుకురావాలని సూచించాయి. ప్రభుత్వం అందుకే కమిటీ ఏర్పాటు చేసింది. మేం ప్రజలతో సంప్రదింపులు జరిపి, ప్రభుత్వానికి సూచనలిస్తున్నాం. ఇప్పటికే రిజిస్టర్డ్ జాతీయ పార్టీలతో మాట్లాడి, వారి సలహాలు తీసుకున్నాం. వారంతా దాదాపుగా మద్దతు ప్రకటించారు. ఈ అంశాన్ని జాతికి ప్రయోజనకరమైందిగా భావించి సహకరించాల్సిందిగా అన్ని పార్టీలను కోరుతున్నా'అని కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలతో ప్రత్యేకంగా ఏ ఒక్క పార్టీకి లబ్ధి కలగదన్నారు. 'ఈ విధానం అమలైతే, ఆ సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి లాభం చేకూరుతుంది. అది బీజేపీ, కాంగ్రెస్ లేదా మరే ఇతర పార్టీ అయినా కావచ్చు. ఇందులో వివక్షకు తావులేదు'అని వెల్లడించారు. జమిలిపై పార్టీలతో పాటు లా కమిషన్ అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

బైజూస్ సహ వ్యవస్థాపకుడికి

ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ: రూ.9,300 కోట్ల మేర విదేశీ మారకద్రవ్య నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఎడ్‌టెక్‌లో అగ్రగామిగా ఉన్న బైజూస్‌కు, ఆ సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకుడు కూడా అయిన రవీంద్రన్ బైజూకు నోటీసులిచ్చినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. రవీంద్రన్‌తోపాటు సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారికి చెందిన బెంగళూరులోని మూడు ప్రాంతాల్లో ఏప్రిల్‌లో సోదాలు జరిపిన విషయం గుర్తు చేసింది. దేశం వెలుపల చేసిన ముందస్తు చెల్లింపులకు తగిన దిగుమతుల పత్రాలను సమర్పించడంలో సంస్థ విఫలమైందని ఈడీ తెలిపింది.

మురుగునీటిలో కుబేరుడు

బ్రస్సెల్స్: వేల కోట్లకు పడగలెత్తిన సంపన్నులు ఆకాశహర్మ్యాల్లో బిజినెస్‌లో బిజీగా ఉంటారని తెలిసిందే. అందుకు భిన్నంగా ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ బెల్జియంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థలో దిగారు. ముక్కు మూసుకుని అక్కడి కంపును భరిస్తూనే బ్రస్సెల్స్ నగరంలో అమలవుతోన్న సీవేజ్ సిస్టమ్‌ను స్వయంగా పరిశీలించారు. అక్కడి మురుగువ్యవస్థ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియం తాలూకు మ్యాన్‌హోల్‌లో బిల్‌గేట్స్ దిగుతున్న ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. సంబంధిత వీడియోను బిల్‌గేట్స్ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'నవంబర్ 19వ తేదీన వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్యంలో మురుగునీటి పాత్రను తెలియజేప్పేందుకు బ్రస్సెల్స్ సిటీ అండర్‌గ్రౌండ్ మురుగు ప్రపంచంలో విహరించా' అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. ''1800 కాలంలో సెన్నీ నదిలో బ్రస్సెల్స్ నగర చెత్తనంతా పారబోసేవారు. దాంతో ఆకాలంలో భయంకర కలరా వ్యాధి ప్రబలడంతో నగర ప్రజలు కష్టాలుపడ్డారు. ఆ తర్వాత 322 కిలోమీటర్ల మేర విస్తృత స్థాయిలో మురుగునీటి పారుదల వ్యవస్థ, నీటి శుద్ధి కర్మాగారాలను ఏర్పాటుచేసుకుని నగరాన్ని కడిగిన అద్దంలా మార్చుకున్నారు'' అని బిల్‌గేట్స్ తన వీడియోలో వ్యాఖ్యానించారు.


జంగ్ తెలంగాణ

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి
వనం దుర్గాప్రసాద్

అభివృద్ధికి అందలమా.. మార్పునకు పట్టమా?

ఉద్యమాల గడ్డ.. రాజకీయ చైతన్య అడ్డా.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాజకీయ సమీకరణలు మారాయి. 2018 నాటికి జిల్లాలోని మెజారిటీ అసెంబ్లీ స్థానాల్లో అధికార బీఆర్ఎస్ పట్టు సాధించింది. 2014 తర్వాత సీపీఐ నుంచి ఒకరు గెలిచినా, కాంగ్రెస్ నుంచి ఇంకొకరు గెలిచినా.. ఇద్దరూ బీఆర్ఎస్‌లోకి చేరిపోవడంతో మొత్తం గులాబీదళమైంది. ఉప ఎన్నికల్లో హుజూర్‌నగర్.. నాగార్జున సాగర్... మునుగోడుల్లోనూ గులాబీ వికసించింది. ఇప్పుడు 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఢీ.. అంటే ఢీ అనే వాతావరణం కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాల్లో నెలకొన్న క్షేత్రస్థాయి రాజకీయ ముఖచిత్రంపై ప్రత్యేక కథనం...

గ్రౌండ్ రిపోర్ట్
ఉమ్మడి నల్లగొండ



గెలుపు గుర్రాల పరుగెంత?

తుంగతుర్తి తేడా ఒక్క శాతమే..

ఒక్క శాతం ఓట్లే ఇక్కడ జయాపజయాలను నిర్ణయిస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్, కాంగ్రెస్ నుంచి మందుల సామేల్ మధ్యే ప్రధాన పోటీ. నిజానికి ఈ స్థానాన్ని అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ తొలుత కేటాయించింది. ఆఖరి నిమిషంలో సామేల్ తెరమీదకొచ్చారు. దయాకర్ హైకమాండ్ బుజ్జగింపుతో తప్పుకున్నారు. ఆయన గత రెండు పర్యాయాలు ఒక్క శాతం ఓటుతోనే ఓడిపోయారు. సామేల్‌కు మద్దతిస్తున్న ఆయనకు ప్రజల్లోనూ సానుభూతి ఉంది. ఇదే ఆ పార్టీకి సానుకూలాంశం. అధికార పార్టీ అభ్యర్థి రెండుసార్లు గెలిచిన అనుభవం, అభివృద్ధి ఎజెండాతో ముందుకెళ్తున్నారు. అయితే, దళిత బంధు, డబుల్ బెడ్‌రూం కేటాయింపుల్లో అవినీతిపై ఎదురయ్యే దాడి ప్రతికూలంగా ఉంది. ఇది ఏమేర ప్రభావం చూపతుందనేదే ఇక్కడ గెలుపోటములను నిర్ణయిస్తుంది.

మునుగోడు మజా..

ఉపఎన్నికతో దేశవ్యాప్తంగా ఆకర్షించిన మునుగోడు రాజకీయం ఇప్పుడూ రసవత్తరంగానే ఉంది. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2022లో బీజేపీలోకి వెళ్లి రాజీనామా చేశారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన గెలుపు కోసం యావత్ బీఆర్ఎస్ నాయకత్వం సర్వశక్తులొడ్డింది. ఇప్పుడు రాజకీయం మారింది. కోమటిరెడ్డి మళ్లీ పార్టీ మారి, కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఇప్పుడు ఆ పార్టీకి దూరమయ్యారు. ఇక కూసుకుంట్ల కోసం ఉప ఎన్నికల మాదిరి పార్టీ మొత్తం పనిచేసే పరిస్థితి లేదు. అభివృద్ధి నినాదంతో ఆయన బరిలో ఉంటే..ఉపపోరులో కలసి ఉన్న సీపీఎం ఈసారి పోటీలో ఉంది. స్వల్ప మెజారిటీ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు కామ్రేడ్ల పోటీ వల్ల కూసుకుంట్లలో కలవరం లేకపోలేదు. పాల్వాయి స్రవంతి వల్ల ఏమేర నష్టం ఉంటుందనే ఆందోళన కోమటిరెడ్డిలోనూ లేకపోలేదు. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న చల్లమల కృష్ణారెడ్డి ప్రభావమూ కీలకమే. ఎన్ని ఓట్లు ఈ పార్టీ సాధిస్తుందనేది ఆసక్తి కల్గించే అంశం.

గాసిప్ టైమ్

ఆ పార్టీలో అందరూ సీఎం అభ్యర్థులే.. కానీ...

ఆ పార్టీలో అందరూ సీఎం అభ్యర్థులే.. ఎవరికి వారు తాము సీఎం అవుతున్నట్టు ఊహించుకుంటారు. కానీ బాధ్యతల విషయానికి వచ్చేసరికి ఎవరికి వారు తప్పుకునే పరిస్థితి ఉందట. ఈసారి జరుగుతున్న ఎన్నికలు ఆ పార్టీకి విజయమో వీరస్వర్గమో అన్న రీతిలో పోరాడాల్సిన తరుణంలో పార్టీలోని నాయకులంతా రాష్ట్రం నలుమూలల చుట్టివస్తూ.. ఆర్థికంగా, పార్టీపరంగా కాస్త బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టాల్సి ఉంది. ఈ సీఎం అభ్యర్థుల్లో పలువురు స్టార్ క్యాంపెయినర్స్ కూడా ఉన్నారు. ఆ స్టార్ క్యాంపెయినర్స్ అంతా తమ సొంత నియోజకవర్గాలకు మాత్రమే పరిమితం అవడం ఏంటి అని పార్టీ కేడర్ వాపోతున్నరట.. అధికార పార్టీని ఇరుకున పెట్టే విధంగా ఘాటుగా విమర్శించడం, ఆ పార్టీ అనుసరించిన విధానాలను ఎండగట్టడం చేయాల్సిన పలువురు నేతలు తమ నియోజకవర్గం లేదా పక్కనే ఉన్న నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కావడంపై కేడర్ గుసగుసలాడుతోంది. అధికారానికి అయితే అందరూ ముందుంటారు కానీ..రాళ్ల దెబ్బలు తినాల్సి వచ్చే సమయానికి వారంతా తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం ఆ పార్టీ లీడర్లకే సాధ్యమైందంటున్నారట కేడర్..

నల్లగొండ జనం ఎవరి వెంటో?


వెంకట్‌రెడ్డి


భూపాల్‌రెడ్డి

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత, సిట్టింగ్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య రసవత్తర పోరు సాగుతోంది. బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం అభ్యర్థి సుధాకర్‌రెడ్డి తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మెడికల్ కాలేజీ, ఐటీ హబ్ రావడం. రహదారుల విస్తరణ, పట్టణ సుందరీకరణ, పార్కుల అభివృద్ధి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల ప్రచారాస్త్రాలుగా మారాయి. కానీ సొంతపార్టీలో పెరిగిన అసంతృప్తి, ప్రత్యర్థుల ఆరోపణలు ఆయనకు తలనొప్పిగా మారాయి. ఇక ఎలాగైనా ఈ స్థానం దక్కించుకోవాలన్నది కోమటిరెడ్డి ఎత్తుగడ. అధికార పార్టీలో అసంతృప్తులకు గాలం వేస్తున్నారు. ఎంపీగా గెలిచాక నల్లగొండకు దూరమయ్యారనేది కోమటిరెడ్డికి మైనస్ పాయింట్. 1999 నుంచి నాలుగు సార్లు గెలిచిన కోమటిరెడ్డి, 2018లో కంచర్ల చేతిలో 23 వేల పైచిలుకు ఓట్లతో ఓడిపోయారు. గతంలో విజయ వ్యూహాలు, కాంగ్రెస్ మార్పు నినాదంపై ఆయన నమ్మకం పెట్టుకున్నారు. నల్లగొండ, తిప్పర్తి, మాడ్గులపల్లి, కనగల్ ఓటర్ల తీర్పే ఈ ఇద్దరికీ కీలకం.

నకిరేకల్ ఆ ఇద్దరే..!

చిరుమర్తి లింగయ్య ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థి. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఆ తర్వాత పార్టీ మారారు. 2014లో టీఆర్ఎస్ అభ్యర్థి వేముల వీరేశం. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక వీరిద్దరి మధ్యే ఇక్కడ పోటీ. 2018లో చిరుమర్తికి 8,259 ఓట్ల మెజారిటీ వచ్చింది. బీఆర్ఎస్‌లో ఆయనకు వర్గపోరు ఉంది. వేముల వీరేశంకు బీఆర్ఎస్‌లోని కొంతమంది సహకరిస్తున్నారనే భయం లింగయ్యను వెంటాడుతోంది. సంప్రదాయ ఓటు బ్యాంకు, బీఆర్ఎస్‌లో మిత్రులు, సిట్టింగ్‌పై ఉన్న వ్యతిరేకత తనకు కలిసి వస్తుందని వీరేశం భావిస్తున్నారు.

దేవరకొండ 'నాయక్' ఎవరు?

కాంగ్రెస్, కమ్యూనిస్టుల అడ్డా దేవరకొండలో తెలంగాణ ఏర్పడ్డాక సమీకరణలు మారాయి. 2014లో సీపీఐ టికెట్‌పై గెలిచిన రమావత్ రవీంద్ర కుమార్ నాటి టీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2018లోనూ ఆయన విజయం సాధించారు. ఇప్పుడూ ఆయనే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బాలూనాయక్‌తో తలపడుతున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధిపత్యమున్న ఈ స్థానంలో ఈసారి గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. బీఆర్ఎస్ హయాంలో సాగిన అభివృద్ధి ఎమ్మెల్యేపై వ్యతిరేకతను డామినేట్ చేస్తోందని ఆ పార్టీ వారే చెప్పుకుంటున్నారు. దళితబంధులో కమీషన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో ప్రజాగ్రహం కాంగ్రెస్ ప్రచారాస్త్రాలుగా మారాయి. ఏడాదిగా బాలూ నాయక్ ప్రజలతో మమేకమై రాజకీయ యుద్ధానికి సిద్ధమవ్వడం ఇప్పుడు హాట్‌టాపిక్. ఈ నేపథ్యంలో ఎవరి బలం ఎంతో తేలాల్సి ఉంది.


జగదీశ్‌రెడ్డి


దామోదర్‌రెడ్డి


వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట సిరి ఎవరిదో?

అధికార పార్టీ నుంచి మంత్రి జగదీశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, బీజేపీ నుంచి సంకినేని వెంకటేశ్వరరావు బరిలో ఉన్నారు. 2018లో జగదీశ్ రెడ్డి కేవలం 5,900 ఓట్ల మెజారిటీతో తెలిచారు. అప్పట్లో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన పటేల్ రమేశ్‌రెడ్డి ఏఐఎఫ్‌బీ తరఫున పోటీ చేయడం కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి పడింది. ఈసారి ఈయన్ను అధిష్టానం ఒప్పించి, బరిలో లేకుండా చేసింది. ఇది తమకు కలిసి వస్తుందనేది కాంగ్రెస్ వాదన. దీంతో పాటు ప్రభుత్వంపై వ్యతిరేకత, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ఆ పార్టీ ఫోకస్ పెట్టింది. జగదీశ్‌రెడ్డి అభివృద్ధి పనులపై ప్రజల్లో మంచి పేరుంది. ఇవే గెలిపిస్తాయనేది ఆయన నమ్మకం. ఇక్కడ బీజేపీ ఓటు బ్యాంకు కూడా 39 వేల వరకూ ఉంటుంది. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనన్న కాంగ్రెస్ ప్రచారంతో బీజేపీ ఓటు బ్యాంకు స్థిరంగా ఉంటుందా? అనే సందేహాలున్నాయి. ఇవి ఓటింగ్‌ను ప్రభావితం చేసే అంశాలు.

వారసుల సాగరం విజేతెవరో?

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుందూరు జానారెడ్డి కుమారుడు జయవీర్‌రెడ్డి, దివంగత నోముల నర్సింహయ్య కొడుకు భగత్ పోటీ పడుతున్నారు. 2018లో ఓటమి చవి చూసిన జానారెడ్డి వారసుడి గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. తన రాజకీయ అనుభవాన్ని రంగరించి పనిచేస్తున్నారు. ఉప ఎన్నికలో నోముల భగత్ విజయానికి పార్టీ యావత్ కృషి చేసింది. ఇప్పుడు ఒంటరిగానే ప్రచార బరిలో నిలిచారు. తండ్రి మరణంతో వచ్చిన సానుభూతి ఉప ఎన్నికల్లో గెలిపిస్తే..ఆ తర్వాత జరిగిన అభివృద్ధి ఈసారి గెలుపునకు మార్గమన్నది ఆయన వాదన. అనుభవ రాహిత్యంతో కేడర్ దూరమైందనేది అక్కడ పరిశీలన. జానారెడ్డి వ్యూహాలను ఎలా తిప్పికొడతాడనే దానిపై ఆయన విజయావకాశాలుండే వీలుంది. కాంగ్రెస్‌కు కలిసి వచ్చే మార్పు నినాదం, పాతుకుపోయిన కేడర్ కుందూరు బలాలుగా చెప్పుకుంటున్నారు.

భువనగిరి ఎవరి బలమెంత?

ఇక్కడ పార్టీల ఆధిపత్యం తరచూ మారుతుంటుంది. బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్ మధ్యనే పోటీ ఉంది. బీజేపీ, సీపీఎంది నామమాత్రపు పోటీనే. ఫ్లోరైడ్ ప్రాంతాల్లో మంచినీరు అందించడం శేఖర్‌రెడ్డి సాధించిన విజయంగా ప్రచారబరిలో ఉన్నారు. ప్రజల్లోనే ఉంటారనే పేరూ ఉంది. అయితే రైతుల ఆందోళన సందర్భంగా జరిగిన అరెస్టులపై జనం కాస్త వ్యతిరేకంగా ఉన్నారు. సొంతపార్టీలో వర్గపోరూ ఇబ్బందిగా ఉంది. కుంభం అనిల్ కుమార్‌కు కాంగ్రెస్ మార్పు నినాదం, ఎమ్మెల్యేపై వ్యతిరేకత కలిసి వచ్చే అంశాలు. కానీ పార్టీలు మారతారనే అంశం ప్రతికూలంగా ఉంది. ఎస్సీలు 20, గౌడ్ 13, రెడ్డి 10, యాదవ 10, పద్మశాలీ 8, ముదిరాజులు 8 శాతం ఇక్కడున్నారు. ఎస్సీ, గౌడ ఓటర్లతో పాటు, రెడ్డి సామాజిక వర్గం ఓట్లు అధికార పార్టీలో ఉన్న వర్గపోరు వల్ల తనకు వస్తాయనేది అనిల్ నమ్మకం.

జీ 'హుజూర్' ఎవరికో ?

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే సైదిరెడ్డి (బీఆర్ఎస్), సీనియర్‌నేత ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంది. 1999 నుంచి ఉత్తమ్ ఇక్కడ విజయం సాధిస్తున్నారు. ఎంపీగా వెళ్లడంతో 2019లో ఉప ఎన్నిక జరిగింది. బీఆర్ఎస్ సైదిరెడ్డి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తమ్ సతీమణి పద్మావతి ఉప పోరులో తలపడ్డా, కాంగ్రెస్ అపజయం చవిచూసింది. ఈసారి ఉత్తమ్ బరిలో ఉండటం, బీఆర్ఎస్ నుంచి వలసలు ఎక్కువ ఉండటంతో తమ గెలుపుపై ఉత్తమ్ ధీమాగా ఉన్నారు. సొంత పార్టీలో వర్గపోరు సర్దుకుంటే సైదిరెడ్డి కొన్ని ప్రాంతాల్లో ఓట్లు రాబట్టే వీలుంది. ఈ దిశగా అధిష్టానం ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీ, సీపీఎం ఇక్కడ పోటీలో ఉన్నా వీరు ఎవరి ఓట్లు చీలుస్తారు? బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఆఖరి నిమిషంలో వదిలే ప్రచారాస్త్రాలు గెలుపోటములను ప్రభావితం చేస్తాయి.

కోదాడ కొత్త రాజకీయం

కోదాడలో బొల్లం మల్లయ్య యాదవ్ (బీఆర్ఎస్), ఎన్ పద్మావతిరెడ్డి (కాంగ్రెస్) హోరాహోరీగా తలపడుతున్నారు. పద్మావతి ఉత్తమ్ సతీమణి. 2014లో ఆమె గెలిచినా, 2018లో మల్లయ్యయాదవ్ చేతిలో కేవలం 756 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పట్లో టీడీపీ మద్దతివ్వడం ..బీఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్ రాజేయడంతో పద్మావతికి ప్రతికూలత ఏర్పడింది. ఈసారి ఇక్కడ అనేక రాజకీయ సమీకరణలు కనిపిస్తున్నాయి. ఆంధ్రకు సరిహద్దు స్థానం కావడం, టీడీపీ ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం పద్మావతికి కలిసి వచ్చే అంశాలు. యాదవ్‌ను గత ఎన్నికల్లో బలంగా వెనకేసుకొచ్చిన చందర్‌రావు ఈసారి వ్యతిరేకంగా ఉన్నాడనేది మల్లయ్యయాదవ్‌లో కనిపిస్తున్న కలవరం. అవినీతి ఆరోపణలు ఆయనకు మైనస్ పాయింట్‌గా ఉంది. బలమైన బీఆర్ఎస్ నేతలూ కాంగ్రెస్ బాట పట్టడం మరో ప్రతికూలత. అభివృద్ధి మంత్రమే గెలిపిస్తుందని ఆయన నమ్ముతున్నారు.


గొంగిడి సునీత


బీర్ల ఐలయ్య

ఆలేరు.. ఆ సెంటిమెంట్‌పైనే చర్చ

ఇక్కడ ఒక పార్టీ నుంచి వరుసగా మూడోసారి గెలిచిన దాఖలాల్లేవు. ఇదే ఇప్పుడు రాజకీయ చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి గొంగిడి సునీత ఇప్పటికే రెండుసార్లు గెలిచారు. మరోసారి పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్య గట్టి పోటీనే ఇస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ పార్టీ సంప్రదాయ ఓటర్‌ను కాపాడుకునే పనిలో ఉన్నారు. 8 మండలాలున్న ఈ స్థానంలో గౌడ ఓటర్లు 40 వేలు. యాదవ ఓటర్లు 38 వేలుంటారు. వీళ్లే ఇక్కడ ప్రభావం చూపనున్నారు. యాదాద్రి టెంపుల్ ను బీఆర్ఎస్ ఫోకస్ చేస్తోంది. మహిళా ఓటర్లను తనవైపు తిప్పుకోగలననే నమ్మకాన్ని సునీత వ్యక్తం చేస్తున్నారు. అయితే, సొంత పార్టీ నేతలే కలిసిరాని ప్రతికూలతను ఆమె ఎదుర్కొంటున్నారు. ఐలయ్యకు జిల్లా నేతల ఆశీస్సులుండటం, కాంగ్రెస్ గాలి వీస్తోందన్న ప్రచారం సానుకూలాంశాలుగా చెబుతున్నారు. పార్టీలో చేరికలు ఈయనకు కలిసి వచ్చే అంశం.

మిర్యాలగూడ ఘాటెవరికో?

బీఆర్ఎస్ తరఫున నల్లమోతు భాస్కర్‌రావు సిట్టింగ్ ఎమ్మెల్యే. కాంగ్రెస్ ఆయనపై పోటీకి బత్తుల లక్ష్మారెడ్డిని బరిలోకి తెచ్చింది. సీపీఎం తరఫున జూలకంటి రంగారెడ్డి తలపడుతున్నారు. సాధినేని శ్రీనివాసరావును బీజేపీ రంగంలోకి దించింది. బీఎల్ఆర్‌గా ప్రజాక్షేత్రంలో సామాజిక కార్యక్రమాలతో కొన్నేళ్లుగా లక్ష్మారెడ్డి దూసుకెళ్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని కొంతమంది వ్యతిరేకించినా, కాంగ్రెస్ జిల్లా నేతలు బుజ్జగించి దారికి తెచ్చారు. 2018లో ఇక్కడ భాస్కర్‌రావుకు 30 వేల మెజారిటీ వచ్చింది. స్కైలాబ్ నాయక్ 2018లో కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేసి, 14 వేల ఓట్లు తెచ్చుకున్నారు. ఈసారి ఆయన కాంగ్రెస్ వైపు ఉన్నారు. దీంతో కాంగ్రెస్ గెలుపు తథ్యమనేది వారి వాదన. ఇక్కడ సంప్రదాయ సీపీఎం ఓట్లు 10 వేలు ఉంటాయి. దీంతో స్వల్ప మెజారిటీతోనే ఎవరైనా గెలిచే వీలుందని తెలుస్తోంది.



విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి

విద్యారంగంలో మంచి మార్పులొస్తే ఎన్నో రంగాల్లో సమూల మార్పులొస్తాయి. అందుకే ఏ రాజకీయ పార్టీ గెలిచినా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. నిధులు పెంచాలి.. అప్పుడే నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుంది. అన్నివర్గాలకూ అది ఉపయుక్తంగా ఉంటుంది. -మంత్రి ప్రగడ కనకయ్య



వాళ్లేం చేస్తారో చూద్దాం

తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్ పాలన చూశాం. ఇచ్చిన కాంగ్రెస్ పాలనా చూద్దాం. ఒకసారి అవకాశమిద్దాం. అయితే, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

- కొండా కనకమ్మ, రైతుకూలీ, చిలుకూరు



మధ్యతరగతి నలిగిపోతోంది

ఏ పార్టీలైనా మధ్యతరగతి గోడు పట్టించుకోవడం లేదు. ఓట్ల రాజకీయాలు తప్ప, అన్నింటా నలిగిపోతున్నది మధ్య తరగతి ప్రజలే. వాళ్లగురించి పాలకులు సానుకూలంగా ఆలోచించాలి.


- వంగాల మాధవి, గృహిణి, మిర్యాలగూడ



ఉద్యోగాలు ఇవ్వాలి

లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి లేదు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఓ పద్ధతిగా జరగాలి. ప్రైవేటు ఉద్యోగాలు వచ్చే నైపుణ్యం పెంచాలి.

-కొరదాల సాయికుమార్, చివ్వెంల, సూర్యాపేట



బహుజన వాదం

బలపడేనా.. వినబడేనా?

1994 నుంచి ఉనికి చాటుకోవాలని బీఎస్పీ ప్రయత్నం

2014లో ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలిచి టీఆర్ఎస్‌లోకి..

ఈసారి మాజీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్రమంతా పోటీ

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ త్రిముఖ పోటీలో బీఎస్పీ ఉనికి చాటే ప్రయత్నం

పోలంపల్లి ఆంజనేయులు

ఉత్తరప్రదేశ్‌లో బలమైన రాజకీయశక్తిగా ఎదిగిన నాటినుంచి తెలుగునేలపై కాలు మోపాలని యత్నిస్తున్న బహుజన సమాజ్ పార్టీ ఈసారి మాత్రం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. అందుకే ఏకంగా రాష్ట్రంలోని 118 నియోజకవర్గాలకు అభ్యర్థులను నిలిపింది. కేవలం ఎన్నికల సమయంలోనే వినిపించే బహుజనవాదాన్ని రెండేళ్లుగా జనాల్లోకి తీసుకెళ్లిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ ఈ దఫా బీఎస్పీ సత్తా చూపాలని పట్టుదలతో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న ప్రవీణ్ కుమార్ స్వయంగా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు నుంచి సీనియర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఢీకొంటున్నారు. పటాన్‌చెరు, సూర్యాపేట, పెద్దపల్లి, అలంపూర్, జహీరాబాద్, నకిరేకల్, వర్ధన్నపేట, పాలేరు వంటి పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు బీఎస్పీ అభ్యర్థులు సవాల్ విసురుతున్నారు. ప్రధాన పక్షాలుగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అభ్యర్థుల అధికార, అర్థబలం తట్టుకొని బీఎస్పీ అభ్యర్థులు చివరి వరకు ఎలా నిలబడతారన్నదే ప్రశ్న అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఆ ముద్ర లేకుండా..

బీఎస్పీ అంటే దళితుల పార్టీ అనే ముద్రను చెరిపివేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర సారథి ప్రవీణ్ కుమార్ భారీ కసరత్తు చేశారు. ఐపీఎస్‌గా, గురుకులాల కార్యదర్శిగా వ్యవహరించిన సమయంలో ఉన్న సంబంధాలు ఆయనకు రాజకీయంగా ఉపయోగపడ్డాయనే చెప్పాలి. అగ్ర కులాలు మొదలుకొని 60 శాతం మంది బీసీలకు సీట్లిచ్చారు. ప్రవీణ్‌కుమార్ జనరల్ సీటు అయిన సిర్పూరు నుంచి పోటీ చేస్తుండడం గమనార్హం. బహుజన వాదమే ఎజెండాగా చెపుతున్న ఆయన అభ్యర్థుల ఎంపికలోనూ విలక్షణతను చాటుకున్నారు. మంథనిలో చల్లా నారాయణరెడ్డి, నల్లగొండలో కోమటి సాయితేజ్ రెడ్డి, పెద్దపల్లిలో ఉష (పద్మశాలి), నిజామాబాద్‌లో షేక్ ఇమ్రాన్‌ఖాన్, సూర్యాపేటలో వట్టె జానయ్య (యాదవ), ఎల్‌బీనగర్– గువ్వ సాయి రామకృష్ణ ముదిరాజ్ ..ఇలా వివిధ వర్గాల వారికి సీట్లు ఇచ్చారు. వరంగల్ ఈస్ట్ నుంచి ట్రాన్స్‌జెండర్ చిత్రపు పుష్పిత లయకు సీటు కేటాయించడం ద్వారా రాష్ట్రంలో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

1994 నుంచి బరిలో నిలుస్తున్నా...

రాష్ట్రంలో 1994 శాసనసభ ఎన్నికల సమయంలోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం, అధ్యక్షురాలు మాయావతి తమ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టినా ఫలితం దక్కలేదు. అప్పటి నుంచి అడపాదడపా ఎన్నికల సమయంలో బీఎస్పీ పోటీలో నిలబడడం, ఏనుగు గుర్తుపై అభ్యర్థులు పోటీ చేయడం జరుగుతూ వచ్చింది. 2004 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు నుంచి లాకే రాజారావు బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత 2014లో అప్పటి రాజకీయ సమీకరణాల దృష్ట్యా ప్రస్తుత మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో పలువురు అభ్యర్థులు వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేశారు నిర్మల్ నుంచి పోటీ చేసిన ఇంద్రకరణ్‌రెడ్డి, సిర్పూరు నుంచి బరిలో నిలిచిన కోనేరు కోనప్ప మాత్రమే విజయం సాధించారు. కానీ గెలిచిన వెంటనే బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) అధినేత కేసీఆర్ పిలుపు మేరకు అధికార పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి పోటీ చేసిన ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ రెండోస్థానానికి పరిమితమయ్యారు.

రాష్ట్రంలో బీఎస్పీపై ప్రవీణ్ ముద్ర

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్‌కు చెందిన రేపల్లె శివ ప్రవీణ్‌కుమార్ 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన 2013 నుంచి 2021 జూలై నెలలో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకునేంత వరకు ప్రభుత్వ గురుకులాల సంస్థ (స్వేరోస్) కార్యదర్శిగా సేవలు అందించారు. ప్రవీణ్‌కుమార్ అదే సంవత్సరం ఆగస్టులో మాయావతి సమక్షంలో బీఎస్పీలో చేరారు. ప్రభుత్వంలో లోటుపాట్లు, మంచి చెడులు తెలిసిన ఆయన బహుజనవాదం నినాదంతో బీఎస్పీని రాష్ట్రంలో బలమైన శక్తిగా తయారు చేసేందుకు తనవంతు ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా ఏడాది కాలం పాటు పాదయాత్ర జరిపి వేలాది గ్రామాలను చుట్టి వచ్చారు. సొంత నియోజకవర్గం అలంపూర్‌ను కాదని సిర్పూర్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తూ, మిగతా అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను నిలిపారు.

మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు.. డబ్బులు ఇవ్వకండి

ఓ వ్యక్తి ఇంటి ముందు ఫ్లెక్సీ ఏర్పాటు



కేసముద్రం: 'మేము ప్రశ్నించే హక్కులను అమ్ముకోము..మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు' అంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన ఇస్లావత్ రాజు తన ఇంటి గోడకు మంగళవారం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అన్ని పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేస్తూ..'దయచేసి ఓటు వేసేందుకు డబ్బులు ఇవ్వకండి..మాకు నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తాం. ప్రశ్నించే హక్కును కలిగి ఉంటాం' అంటూ అందులో రాసుకొచ్చారు.



ఆయకట్టుపై
పట్టు ఎవరికి ?

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధి స్థానాల్లో గత ఎన్నికల్లో భిన్నమైన తీర్పు

- కీలకంగా తొమ్మిది నియోజకవర్గాలు
- ఈసారి గెలుపుపై ప్రధాన పార్టీల ప్రత్యేక దృష్టి
- బరిలో హేమాహేమీలు

బొల్లం శ్రీనివాస్

నాగార్జునసాగర్ ఆయకట్టు.. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పచ్చని పైర్లకు నెలవు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కితే ఆయకట్టులో పంటలు కళకళలాడుతాయి. ఈ ఆయకట్టులో ఏ ఎన్నికలు పరిశీలించినా ఆసక్తికర ఫలితాలే వస్తున్నాయి. మొత్తం ఈ ఆయకట్టులో తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, ఖమ్మం జిల్లాలో పాలేరు, ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల్లోని ఏడింట కాంగ్రెస్ గెలిచింది. వైరాలో వైఎస్సార్‌సీపీ, సత్తుపల్లిలో టీడీపీ పాగా వేశాయి. గత 2018 ఎన్నికల్లో నాగార్జునసాగర్, మిర్యాలగూడ, కోదాడ, ఖమ్మం స్థానాల్లో బీఆర్‌ఎస్, హుజూర్‌నగర్, పాలేరు, మధిర స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. సత్తుపల్లి టీడీపీ ఖాతాలో చేరితే.. వైరా ఇండిపెండెంట్ ఖాతాలో పడింది. గత రెండు ఎన్నికల ఫలితాలు విలక్షణంగా వచ్చిన నేపథ్యాన ప్రస్తుత ఎన్నికలు అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారాయి.

6.45 లక్షల ఎకరాలు.. 3.10 లక్షల రైతులు

నాగార్జునసాగర్ కింద మొదటి జోన్‌లోని నల్లగొండ, రెండో జోన్‌లోని ఖమ్మం జిల్లా కలిపి మొత్తం 6.45 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు పరిధిలో 3.10 లక్షల మంది రైతులు ఉన్నారు. సాగర్ నీరు విడుదలైతే రెండు పంటలు వరితోపాటు పత్తి, మిర్చి, కంది సాగవుతాయి. ఈ తొమ్మిది నియోజకవర్గాలకు సాగర్ జలాలే ఆధారం. ఈ నియోజకవర్గాల్లో రాజకీయ చైతన్యం కూడా ఎక్కువే. ప్రధాన పార్టీలకు ఇక్కడ ఓటర్లు ఇచ్చే తీర్పు కీలకమవుతుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఆయకట్టు రైతులు విలక్షణంగా తీర్పు ఇస్తే...ఈసారి వారి అంతరంగం ఎలా ఉండబోతుందోనన్న రాజకీయ విశ్లేషణ సాగుతోంది.

ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హవా

2014 ఎన్నికల్లో పాలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి వెంకటరెడ్డి గెలుపొందగా.. ఆ తర్వాత ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలుపొందారు. 2018 ఎన్నికల్లో నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ నుంచి గెలవడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలిచారు. అలాగే 2018లో నాగార్జునసాగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన నోముల నరసింహయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఉప ఎన్నికల్లో ఆయన తనయుడు నోముల భగత్.. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జానారెడ్డిపై గెలుపొందారు.

ఈసారి పోటీలో ఉద్ధండులు

ఈ ఎన్నికల్లో సాగర్ ఆయకట్టులోని తొమ్మిది నియోజకవర్గాల్లో హేమాహేమీలు, ముఖ్య నేతల వారసులు పోటీ పడుతున్నారు. నాగార్జునసాగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కె.జానారెడ్డి కుమారుడు జయవీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే నోముల నరసింహయ్య తనయుడు భగత్ పోటీలో ఉన్నారు. హుజూర్‌నగర్ నుంచి ఎంపీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి ఆయన భార్య పద్మావతి బరిలో నిలిచారు. పాలేరు నుంచి కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ పడుతున్నారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కందాల ఉపేందర్‌రెడ్డిని ఆ పార్టీ పోటీకి దింపింది. ఖమ్మం నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల సమరంలో నిలిచారు. మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క కాంగ్రెస్ అభ్యర్థిగా, సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి సండ్ర వెంకటవీరయ్య పోటీ పడుతున్నారు.

ప్రజల తీర్పు ఎలా ఉంటుందో...

రెండు జిల్లాల్లోని తొమ్మిది నియోజకవర్గాల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయి.. ఏ నియోజకవర్గంలో ఎవరికి ప్రజలు పట్టం కడతారనే ఉత్కంఠ నెలకొంది. గత రెండు ఎన్నికల్లో భిన్నమైన తీర్పు రావడం, ఈసారి ప్రధాన పార్టీల ముఖ్యమైన నేతలు బరిలో ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు ఈ తొమ్మిది స్థానాల్లో పోటీలో ఉండగా.. సీపీఎం కూడా ఈ తొమ్మిది నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. దీంతో ఎవరి ఓట్లు చీలుతాయి, ప్రజలు ఎవరిని విజయతీరాలకు చేరుస్తున్నారన్నది డిసెంబర్ 3న తేలనుంది.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ఇలా

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం :	6.45 లక్షల ఎకరాలు
ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులు:	3.10 లక్షలు
మొత్తం నియోజకవర్గాలు:	తొమ్మిది
ప్రధాన పార్టీలు:	బీఆర్‌ఎస్, కాంగ్రెస్

జంగ్ తెలంగాణ



డప్పు కొట్టి.. ఊపు తెచ్చి..

కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో డప్పు చప్పుళ్లతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు డప్పుకొట్టి ప్రచారంలో ఊపుతెచ్చారు.



అలసిపోయి..ఆదమరిచి నిద్రలోకి...

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలో తిరిగితిరిగి అలసిపోయారు నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నల్లగొండ మండలంలోని ఖాజీరామారం గ్రామంలోని ఓ కార్యకర్త వ్యవసాయ క్షేత్రంలోని ఇంటి వద్ద కుర్చీలోనే కునుకు తీస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.



మళ్లీ గెలిపిస్తే.. మరింత మెరిపిస్తా!

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పలు డివిజన్లలో మంగళవారం ప్రచారం చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో చెప్పులు కుట్టే వ్యక్తి వద్ద కస్టమర్ల చెప్పులను పాలిష్ చేసి ఓట్లు అభ్యర్థించారు.

మామా.. మనోళ్ల నంబర్లు పంపు!

- పట్నంలో ఉండే దోస్తులను ఫాలోఅప్ చేస్తున్న గ్రామాల్లోని యువత
- ఆన్‌లైన్‌లో డబ్బులు వేయిస్తామంటూ హామీలు



సాక్షి, హైదరాబాద్: 'హలో..మామా బాగున్నావా రా?..బిజీగా ఉన్నావా..? రెండు నిమిషాలు మాట్లాడొచ్చా..' హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సతీశ్‌కు ఊరి నుంచి టెన్త్ క్లాస్‌మేట్ శివ ఫోన్‌లో చేసిన పలకరింపు వ్యాఖ్యలివి..

'ఎప్పుడూ లేనిది వీడు అకస్మాత్తుగా ఫోన్ చేసి టైం అడుగుతున్నడేంది'? అనుకుంటూనే.. 'నేను బాగున్నారా..ఏంటి విషయం చెప్పు..'అని సతీశ్ సమాధానమిచ్చాడు. శివ బదులిస్తూ...'ఈ ఎన్నికల్లో నువ్వు నాకొక సాయం చేయాలి రా' అని అన్నాడు. 'నేనేమైనా రాజకీయ నాయకుడినా..ఎన్నికల్లో నేనేం సాయం చేస్తాను రా' అని సతీశ్ సమాధానమిచ్చాడు. 'ఏం లేదురా...మీ ఇంట్లో వాళ్లవి..హైదరాబాద్‌లో ఉంటున్న మీ బాబాయి.. మీ పెదనాన్న కొడుకు, మీ అక్క వాళ్ల ఫోన్ నంబర్లు పంపు రా..' అంటూ శివ తన మాటల్ని కంటిన్యూ చేశాడు.

''ఒరే శివా.. కాస్త ఆగు.. అసలు మా ఇంట్లో వాళ్ల ఫోన్ నంబర్లు..మా ఫ్యామిలీ మొత్తం ఫోన్ నంబర్లు నీకెందుకు?'' అని ప్రశ్నించాడు సతీశ్..

''ఏం లేదు రా..మీ వాళ్లందరికీ మన ఊరిలో ఓట్లున్నాయి. ఓటర్ లిస్ట్‌లో కూడా చెక్ చేశాను..మా పార్టీ వాళ్లు మీకు ఫోన్‌పే, లేదంటే గూగుల్‌పే చేస్తారు రా.. ఓటింగ్ ముందు రోజు..మీ అందరి నంబర్లు వాళ్లకు ఇస్తే నాకూ కొంత ఉపయోగపడుతుంది రా..మామా.. పదిహేను రోజుల నుంచి మన పోరగాళ్లంతా ఈ పనిలోనే ఉన్నారు..''అని చెప్పుకొచ్చాడు..

అప్పటికి అర్థమైంది సతీశ్‌కు శివ ఫోన్‌కాల్ సారాంశం...

ఇప్పుడంతా గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లకు గాలం వేసేందుకు ఆన్‌లైన్‌లో ఉన్నారని!!

అరుణతార.. ట్రిపుల్ పీజీ



సాక్షి, కామారెడ్డి: జుక్కల్ నుంచి పోటీ చేస్తున్న టి.అరుణతార ఉన్నత విద్యావంతురాలు. ఎంకాం, ఎంబీఏ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులు పూర్తి చేశారు. 1999 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తటస్థులు, విద్యావంతులను టీడీపీ ఎన్నికల బరిలో నిలిపింది. ఆ సమయంలో ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన జుక్కల్‌లో అరుణతారకు అవకాశం దక్కింది. విజయం సాధించి ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తర్వాత 2004 ఎన్నికల్లో టికెట్ లభించలేదు. 2018 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో మరోసారి బీజేపీ అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సినిమా కథలూ, రాజకీయాలూ
సేమ్ టు సేమ్!

చిత్రేశ్వర్రావు ఓ సినిమా జర్నలిస్ట్. ఆ ప్రొఫెషన్‌లోకి వస్తాడని తల్లిదండ్రులా పేరు పెట్టారా, లేక ఆ పేరు పెట్టుకున్నందుకు అలా అయ్యాడా తెలియదు. కానీ అతడికి తెలిసిందల్లా సినిమాను శ్వాసించడమే! స్టాఫ్ తక్కువయ్యారంటూ చిత్రేశ్వర్రావును ఎత్తి ఎన్నికల పేజీల్లోకి కుదేశారు. నేను చెయ్యలేను మొర్రో అంటున్నా వినకుండా పాలిటిక్స్ మీద ఎనాలసిస్సు రాయమంటూ ఓ అసైన్‌మెంటూ ఇచ్చారు. అప్పుడాయన రాసిన స్క్రిప్టు ఇది...

ఈ లోకంలో ఎటుతిరిగీ మొత్తం ఏడు కథలే ఉన్నాయట. అటు తిరిగీ ఇటు తిరిగీ అవే అవే పదే పదే ప్రతి సినిమాలో రిపీట్ అవుతూ ఉంటాయట. అలాగే.. చెప్పుకోదగ్గ పార్టీలూ కొన్నే. ఉదాహరణకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ. ఇవే మాటిమాటికీ పవర్‌లోకి వస్తూ పోతూ ఉంటాయి.

మొదట సినిమాలు ఎలా రిపీటవుతుంటాయో చూద్దాం. 'అడవిరాముడు', 'పోకిరి'..ఈ రెండింటిదీ ఒకటే కథ. అడవిరాముడులో హీరో మొదట



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

అడివికి వెళతాడు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఎందరో ఆఫీసర్లు ఎలా మర్డరయిపోతుంటారో అండర్‌కవర్‌గా ఇన్వెస్టిగేట్ చేస్తుంటాడు. ఇంటర్వెల్ బ్యాంగు తర్వాత ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఎంట్రీ! ఈలోపు గుమ్మడికి రెండు కళ్లూ పోతాయి. క్లైమాక్స్‌లో హీరో ఎత్తుకుపైఎత్తు వేయడమూ..నాగభూషణం, సత్యనారాయణల మీద విమానం మోత మోగడమూ జరుగుతుంది.

ఇక పోకిరిలో హీరో జులాయిగా తిరిగే ఓ అల్లరిచిల్లరి క్యారెక్టర్. రౌడీయిజాలు చేస్తూ, స్మగ్లర్లను తుదముట్టిస్తుంటాడు. క్రిమినల్ల భారమూ, భూభారం తగ్గించి, భూమాత రిలాక్సయ్యేలా చేస్తుంటాడు. క్లైమాక్స్‌లో హీరో తండ్రి నాజర్‌ను చంపేయడంతో విపరీతమైన కోపం తెచ్చుకుంటాడు. ఇక అండర్‌కవర్ అవతారం చాలించి, ఐపీఎస్‌గా అలరించి, విలన్ల వీపు మీద వందేభారత్ రైలు మోత మోగించి, దేశద్రోహుల పనిబడతాడు.

ఇక సంతోషం, సింహాద్రి, అత్తారింటికిదారేది..ఈ మూడింటిదీ ఒకటే లైన్. హీరోను ప్రేమించి తండ్రికి ఇష్టంలేని పెళ్లి చేసుకుంటుంది హీరోయిన్. దాంతో హీరో, హీరోయిన్ల మీద హీరోయిన్ తండ్రికి విపరీతమైన కోపం. హీరోయిన్‌ని తీసుకువెళ్లి, హొరైజన్‌లో ఎక్కడో దూరంగా బతికేస్తుంటాడు హీరో. 'సంతోషం'లో కె.విశ్వనాథ్ అలిగితే, సింహాద్రిలో అలకసీను నాజర్‌ది, 'అత్తారింటికి దారేది'లో అలక బోమన్ ఇరానీది. ఫ్యామిలీ డ్రామా తీస్తే 'సంతోషం', మాస్‌మసాలా కలిపితే 'సింహాద్రి' లేదా 'అత్తారింటికి దారేది'.

ఇప్పుడు రాజకీయాల్లోకి వద్దాం. సినిమా కథలన్నీ ఒక్కలాంటివైనట్లే.. పార్టీ ఏదైనా ప్రచారాలూ, నినాదాలూ, శాపనార్థాలూ, వరప్రసాదాలూ.. అన్నీ సేమ్ టు సేమ్. ఉదాహరణకు...

- ఇన్ని కోట్ల స్కామ్ చేశావు కాబట్టి నువ్వు 'స్కాంగ్రెస్' అని బీఆర్‌ఎస్ అంటే..నీ హయాంలో నువ్వూ, నీ కుటుంబసభ్యులూ కలిసి, ఇంత అవినీతి చేశారూ, బంగారు తెలంగాణను ఇంతింతగా దోచేసి, ఇత్తడి తెలంగాణ చేసేశారంటారు కాంగ్రెస్ వారు.
- మేం గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకే ఇస్తానని కాంగ్రెస్ అంటే, మేం నాలుగొందలకేనంటుంది బీఆర్‌ఎస్.
- అన్నపూర్ణతో బీఆర్‌ఎస్ సన్నబియ్యమిస్తే..సన్నబియ్యంతో పాటు రేషన్‌డీలర్లకు ఐదువేల రూపాయల భృతి ఎగ్‌స్ట్రా కాంగ్రెస్ నుంచి.
- ఒకళ్లవి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు..మరొకరివి ఇందిరమ్మ ఇళ్లు.
- ఒకళ్లది ధరణి అయితే, ఇంకొకళ్లది భూమాత.
- బీఆర్‌ఎస్‌ది కల్యాణలక్ష్మి... కాంగ్రెస్‌ది కల్యాణమస్తు.

మరి ఈ ఎన్నికలన్నింట్లోనూ క్లైమాక్స్ ఏమిటి? 1983లో కాంగ్రెస్ విలనయ్యింది. ఎన్టీఆర్ హీరోగా దాని పనిబట్టాడు. ఆ తర్వాత తెలుగుదేశం విలన్..కాంగ్రెస్ హీరో. తర్వాత ఎన్టీఆర్ స్థానంలోకి నారాసురుడు వచ్చి చేరాక, ఆ 'నారాకా'సుర సంహారం కాన్సెప్టుతో వైఎస్.రాజశేఖరరెడ్డి హీరోగా కాంగ్రెస్ బొమ్మ వరుసగా రెండుసార్లు బ్లాక్‌బస్టర్!! ఆటు తర్వాత... మా ఇల్లు మాదేనంటూ, మా 'బొమ్మరిల్లు'మాకేననే కాన్సెప్టుతో రెండుసార్లు కాంగ్రెస్‌ను విలన్ని చేసి, కేసీఆర్ హీరో హిట్టుకొట్టాడు. ఇక్కడా మళ్లీ సినిమాలాంటి విమర్శలే.. 'మీది భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి, రేవంతుల్లాంటి వారితో మల్టీస్టారర్ కాదా?' అని బీఆర్‌ఎస్ వాళ్లంటే..'మీరేమైనా తక్కువా, కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితలతో మీది మాత్రం మల్టీ స్టారర్ కాదా' అంటూ కాంగ్రెస్!

తాజాగా 2023లో రిలీజవుతున్న ఈ భారీబడ్జెట్ పిక్చర్లలో హిట్టెవరో, ఫట్టెవరో తెలుసుకోవాలనుందా? అమిత సస్పెన్సుతో కూడిన ఈ సినిమాల రి'జోల్టు'లు చూడాలనుందా? మా రాబోయే మూవీలను తెలంగాణ 'ఐమాక్స్' వెండితెరలపై తప్పకచూడండి. డిసెంబరు మూడున బ్రహ్మాండమైన విడుదల!!

other voice

- పాలకులు, పార్టీలు ఆ దిశగా ఆలోచించడం లేదు
- ప్రజారవాణా వ్యవస్థను ఒక ఉద్యమంలా ప్రమోట్ చేయాలి
- రూ. వేలకోట్లతో మెట్రో, ఫ్లైఓవర్లు కడుతున్నా.. నడవడానికి ఫుట్‌పాత్‌లు లేని పరిస్థితి
- ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రజారవాణా వ్యవస్థ సమగ్రంగా లేకపోవడం బాధాకరం

రవాణారంగ నిపుణుడు ప్రొఫెసర్ సి రామచంద్రయ్య



ప్రజారవాణాపై ఎజెండా ఎక్కడ?

గాదె దేవేందర్

''జన జీవనంలో రవాణా వ్యవస్థ అత్యంత కీలకమైనది. కానీ ప్రజారవాణాపై పాలకులకు గానీ రాజకీయపార్టీలకు గానీ ఎజెండా లేకుండా పోతోంది. మేనిఫెస్టోలో ఎన్నో కార్యక్రమాల గురించి చెప్పుకొస్తున్నా.. రవాణా వ్యవస్థపై ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకటించడం లేదు. సౌకర్యవంతమైన ప్రజారవాణా కల్పిస్తామని హామీ ఇవ్వడం లేదు. ప్రజలకు రవాణా వ్యవస్థ సౌకర్యవంతంగా ఉంటే..బయటకు వచ్చిన ప్రతి వ్యక్తి వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లే. అలాంటి ఆదాయం ఇచ్చే వ్యవస్థను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరం. రూ. వేల కోట్లతో మెట్రో, ఫ్లైఓవర్లు కడుతున్నా.. రోడ్లపై సురక్షితంగా నడించేందుకు ఫుట్‌పాత్‌లు లేని పరిస్థితి ఉంది..'' అని రవాణారంగ నిపుణుడు ప్రొఫెసర్ సి రామచంద్రయ్య వ్యాఖ్యానించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన 'సాక్షి' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

జనాభా పెరుగుతున్నా.. సరిపడా బస్సులేవి?

పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ప్రజారవాణాను అందించే విషయమై పాలకులు దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష మంది జనాభాకు 60 బస్సులు అవసరం. ఆ లెక్కన కోటి జనాభా దాటిన హైదరాబాద్‌లో ఎన్ని బస్సులుండాలి..? ప్రస్తుతం రాష్ట్రం మొత్తం తిరుగుతున్న బస్సులను హైదరాబాద్‌లోనే తిప్పాల్సి ఉంటుంది. ప్రయాణికులు వీలైనంత మేర సొంత వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే పరిస్థితి రావాలి. దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలి.. ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలి. అప్పుడే ఇటు ప్రభుత్వానికి, అటు ప్రయాణికులకు మంచి జరుగుతుంది. కానీ మన దగ్గర అంతా అస్తవ్యస్తంగా ఉంది. రాష్ట్ర పురోగతిని ఇతర రాష్ట్రాలు, దేశాలతో పోల్చే ముందు మన దగ్గర రవాణా వ్యవస్థ, రోడ్లు ఎలా ఉన్నాయో ఒక్కసారి బేరీజు వేసుకోవాలి.

చంద్రబాబు ఆర్టీసీని దెబ్బ తీశారు..

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ఆర్టీసీ కోలుకోని విధంగా దెబ్బతింది. చార్జీలు అడ్డగోలుగా పెంచుతూ పోయారు, ఫలితం.. ఆర్టీసీలో సమ్మెలకు దారితీసింది.

పాదచారులు సురక్షితంగా నడిస్తేనే..

కేసీఆర్ అధికారంలో ఉన్న ఈ తొమ్మిదిన్నరేళ్లలో ఆర్టీసీకి ఏవిధమైన ప్రాధాన్యం ఇవ్వలేదు. నగరంలో ప్రజారవాణాకు ఇప్పటికీ ఆర్టీసీనే వెన్నెముక. కానీ దాని పట్ల ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఫ్లైఓవర్ల మీద ఉన్న శ్రద్ధలో వందోశాతం కూడా ఫుట్‌పాత్‌ల మీద లేదు. దాంతో నడవడం, రోడ్లు దాటడం కూడా ప్రమాదకరంగా మారింది. నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మూడు శాతం పాదచారులే బలవుతున్నారు. పాదచారులు సురక్షితంగా నడిచే నగరాలనే ప్రపంచ శ్రేణి నగరాలుగా పరిగణిస్తారు. ఎంఎంటీఎస్ రెండో దశను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

ఫుట్‌పాత్, బస్‌స్టాప్‌లు ఎక్కడ

అనేక దేశాల్లో ఫుట్‌పాత్ అంటే రోడ్డులో ఒక భాగం. కానీ మన దగ్గర మాత్రం ప్రయాణికులు నడవాలంటే సరైన ఫుట్‌పాత్‌లే ఉండవు. ఒక్కసారి ఎర్రగడ్డ నుంచి ఎల్బీనగర్ వరకు చూస్తే ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం అవుతుంది. రూ.వేల కోట్లతో మెట్రో రైలు వ్యవస్థ ఏర్పాటు, ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతున్నా.. పాదచారుల కనీస అవసరమైన ఫుట్‌పాత్‌లను మాత్రం తీవ్రంగా విస్మరిస్తున్నారు. విదేశీ పర్యటనలు చేసి వచ్చే నేతలు అక్కడి ఫుట్‌పాత్‌లను చూసి కూడా తీరు మార్చుకోకపోవటం విడ్డూరం.

ప్రజలు బయటికొస్తే ఆదాయం వచ్చినట్టే కదా

ప్రజా రవాణా వ్యవస్థను గాలికొదిలేయడం వల్ల వ్యక్తిగత వాహనాలు పెరుగుతున్నాయి.చాలా దేశాల్లో ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారు. ప్రజలు అవసరాల నిమిత్తం రోడ్ల మీదకు వచ్చారంటే ప్రభుత్వానికి ఏదో ఒక రకంగా ఆదాయం వచ్చినట్లు అనే విషయాన్ని ప్రభుత్వాలు ఎందుకు చూడడం లేదో అర్థం కావడంలేదు.

నగరం చుట్టూ సైకిల్ ట్రాక్ ఉండాలి

విస్తరిస్తున్న నగరాల్లో సైకిల్ ట్రాక్ కూడా అందుబాటులో ఉండాలి. అభివృద్ధి చెందిన ఎన్నో నగరాల్లో జనం సైకిళ్లను విస్తృతంగా వాడుతున్నారు. ఇది వాహన రద్దీని నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది. కానీ హైదరాబాద్ నగరం అలాంటి వ్యవస్థకు దూరంగా ఉంది. ఎక్కడో ఓ చోట నిర్మించాం చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. నగరం చుట్టూ సైకిల్ ట్రాక్ ఉండాలి.

పీక్ అవర్స్‌పై దృష్టి పెట్టాలి

కీలక సమయాలుగా పేర్కొనే వేళల్లో రోడ్లపై రద్దీని నియంత్రించేందుకు పక్కా ప్రణాళిక అవసరం. ఆయా వేళల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా అందుబాటులో ఉండాలి. హైదరాబాద్‌లో చూడండి.. పీక్ అవర్స్‌లో సొంత వాహనాలు రోడ్లను ట్రాఫిక్ జామ్‌లతో నింపేస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాలను విస్మరించండి అంటూ అభివృద్ధి చెందిన దేశాల్లో సూచనలు కనిపిస్తుంటాయి. ఒకవేళ ఎవరైనా ఆ మార్గాల వైపే వెళ్లాలనుకుంటే చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. మనదగ్గర అలాంటి వ్యవస్థ లేదు.

ఓట్ల కోసమే ఆరాటం తప్ప..

నేతలు కేవలం ఓట్ల కోసం మేనిఫెస్టో తయారు చేస్తున్నారు. ఎలాంటి అంశాలు చేరిస్తే ఎక్కువ ఓట్లు వస్తాయన్న వాటిపైనే ఆలోచిస్తున్నారు. ప్రజా రవాణాను మెరుగుపరుస్తామని చెబితే పెద్దగా ప్రయోజనం ఉండదనుకుంటున్నారు. అందుకే మేనిఫెస్టోల్లో ఆ అంశాన్ని చేర్చటం లేదు. ప్రజా రవాణా వ్యవస్థపై రాజకీయ పార్టీలకు ఎంత చులకన భావం ఉందో ప్రస్తుత మేనిఫెస్టోలను చూస్తే అర్థం అవుతుంది.



ప్రత్యేక పోలింగ్ కేంద్రాలిక్కడే..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏయే కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో వివరించారు.

10లో▸



ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి మంగళవారం ఎల్ఎండీకి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి 3,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్ఠం/కనిష్ఠం

31.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

భవిష్యత్ రోబోటిక్స్‌దే



కరీంనగర్ సిటీ: భవిష్యత్‌లో రోబోటిక్స్ నిత్య జీవితంలో కీలకంగా మారనున్నాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీలక్ష్మి తెలిపారు. ఎస్సారార్, మహిళా కళాశాల భౌతికశాస్త్ర విభాగం డిగ్రీ, పీజీ విద్యార్థులకు వేర్వేరుగా రోబోటిక్స్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సోహం అకాడమీ సహకారంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు బ్లింకింగ్ ఎల్ఈడీ, బటన్ కంట్రోల్ ఎల్ఈడీ, ఫ్లోయింగ్ ఎల్ఈడీ, సెవెన్ సెగ్మెంట్ డిస్‌ప్లే, టచ్ సెన్సార్ కంట్రోల్డ్ ఎల్ఈడీ, అల్ట్రాసోనిక్ డిస్టెన్స్ సెన్సార్, స్మార్ట్‌ఫోన్ ఉపయోగించి హోమ్ ఆటోమేషన్ లాంటి 21 రకాల ప్రయోగాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ఇలాంటి వర్క్‌షాప్ ద్వారా సాంకేతి పరిజ్ఞానం పెంపొందించుకోగలుగుతారని పేర్కొన్నారు. సోహం అకాడమీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ సహదేవ్ కొమురగిరి మాట్లాడుతూ ఇరు కళాశాలల్లో ఉన్న భౌతికశాస్త్ర ప్రయోగాలలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు నవ కల్పనలతో ప్రాజెక్టులు చేసే విధంగా ప్రోత్సహిస్తామని భౌతికశాస్త్ర విభాగాధిపతి బి.సత్యనారాయణ తెలిపారు. అధ్యాపకులు కె.రామచంద్రం, కృష్ణప్రసాద్, కిరణ్ కుమార్, ఎంఎ.షుకూర్, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంపొందించాలి



చొప్పదండి: విద్యార్థుల్లో వారి జీవితానికి ఉపయోగపడేలా సామర్థ్యాలను పెంపొందించాలని, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు అన్నారు. మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యా బోధనతో పాటు, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, హెచ్ఎం బి.రఘుకిశోర్, ఉపాధ్యాయులు పి.శ్రీధర్, ఎస్.సురేందర్, సరోజ, శ్రీనివాస్, మల్లికార్జున్, దుష్యేంద్రమణి పాల్గొన్నారు.

రసమయికి నిరసన సెగ



నిరసన తెలుపుతున్న సమ్మయ్య

శంకరపట్నం: మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు నియోజకవర్గంలో నిరసన సెగ తప్పడం లేదు. శంకరపట్నం మండలం గొల్లపల్లిలో ప్రచారానికి వెళ్లిన రసమయి బాలకిషన్‌ను గ్రామానికి చెందిన కాను సమ్మయ్య నిలదీశాడు. తన కూతురును అల్లుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తనతో పాటు భార్య, కూతురు కలిసి ఎమ్మెల్యేకు తమ గోడు చెప్పుకుందామని వెళ్తే కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు గెంటేశారని అన్నాడు. బెల్ కొడితే స్పందిస్తానన్న ఎమ్మెల్యే, తన సమస్య పరిష్కరించాలని క్యాంపు కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎమ్మెల్యే ఆడియో కలకలం

మానకొండూర్: సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫైర్ అయినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో కలకలం రేపుతోంది. నాకేమైన ఆస్తులున్నాయా, కేసీఆర్ ఏమైనా నాకు ఇచ్చాడా అంటూ ఎల్లన్నతో మాట్లాడిన ఘాటు వ్యాఖ్యలు వైరల్ అవుతుండడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ నాయకులు ఇది ఫేక్‌అని కొట్టిపారేస్తున్నారు.

క్వింటాల్ పత్తి రూ.6,750

జమ్మికుంట(హుజూరాబాద్): పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర మంగళవారం రూ.6,750 పలికింది. మార్కెట్‌కు 158 వాహనాల్లో 1,800 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,100ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 24 మంది రైతులు 45 క్వింటాళ్లు తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,300, మోడల్ ధర రూ.6,100, కనిష్ఠ ధర రూ.5,500కు కొనుగోలు చేశారు.

సీసీఐ కొనుగోళ్లు

మార్కెట్‌లో 16 మంది రైతుల నుంచి 189.10 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,739, మోడల్ ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ.6,880 పలికింది. క్రయవిక్రయాలను మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

జంగ్ తెలంగాణ

కేసుల చిట్టా విప్పాల్సిందే!

- సుప్రీం ఆదేశాలతో ముందుకు వస్తున్న అభ్యర్థులు
- కేసులు ఉన్నా లేకున్నా దినపత్రికల్లో వెల్లడిస్తున్న వైనం
- కొందరికి అనుకూలం, మరికొందరికి ప్రతికూలం
- నేర స్వభావం చూసి ఓటేయాలంటున్న మేధావులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరూ తమపై ఎన్ని కేసులు ఉన్నాయో ప్రజలకు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల నామినేషన్లు వేసిన సమయంలో కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి నేరచరిత్ర ఉన్నా బయటపెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమ కేసుల చిట్టాను విప్పుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి మొత్తంగా 216 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పుడు వీరంతా తమపై కేసులు ఉన్నా లేకున్నా పత్రికా ప్రకటనలు అనివార్యంగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరికీ మినహాయింపు లేదు..

రాజకీయంగా పారదర్శకత పాటించే ఏ నాయకుడికీ ఈ ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎందుకంటే రాజకీయ నాయకుడు అన్నాక కేసులు ఉండటం సర్వసాధారణం. ప్రజా సమస్యల పోరాటంలో భాగంగా అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఏదో ఒక సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తుంది. మన రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో దాదాపు అన్ని పార్టీల నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. అందులో చాలామటుకు కొట్టుడుపోగా.. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయి. కానీ, రాజకీయ జీవితం మొదలు కాకముందు, రాజకీయాల్లోకి వచ్చాక వ్యక్తిగత కారణాలతో నమోదైన క్రిమినల్ కేసులు కొందరిని తీవ్రంగా ఇబ్బంది పెట్టబోతున్నాయి. వీటిలో ప్రధానంగా భూకబ్జాలు, ఫోర్జరీలు, మోసాలు, హత్యాయత్నాలు ఉన్న వారికి ఈ ప్రకటనల జారీ ప్రతికూలంగా మారనుంది. చిన్న కేసు ఉన్నా తక్కువలో తక్కువ 12 సెం.మీల పొడవు, వెడల్పు విస్తీర్ణం కలిగిన యాడ్ ఇవ్వాల్సి వస్తోంది. అంతే కాకుండా, కేసుల వివరాలు, నేర స్వభావం, నమోదైన ఐపీసీ సెక్షన్లు, విచారణ స్థితిగతులు తదితరాలు పట్టికలో స్పష్టంగా పొందుపర్చాల్సి ఉంటుంది. కనీసం మూడు రోజులపాటు జిల్లా ప్రజా సంబంధాల అధికారి వద్ద నమోదైన గుర్తింపు పొందిన దినపత్రికల్లో ప్రచురించాలి. ఈ వ్యవహారంలో లేని వారికి మినహాయింపు ఏమీ లేదు. వారు కూడా తమపై కేసులు లేవని ప్రకటన ఇస్తున్నారు.

వెల్లడించకపోతే న్యాయపరమైన చిక్కులు

అభ్యర్థి నేరాల పట్టికను చదివిన వారికి అతని గుణంపై నిర్దిష్టమైన అభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఏ నేరానికి ఏ సెక్షన్ పెడతారన్నది తెలుసుకోవడం క్షణాల్లో పని. ఎందుకంటే దురుద్దేశంతో చేసిన నేరానికి, ప్రజాపోరాటాల్లో భాగంగా నమోదైన కేసులకు స్పష్టమైన తేడా ఉంటుంది. ఇందులో ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన వారికి ఇది కలిసి వచ్చే అంశం కాగా, ఉద్దేశపూర్వక నేరచరితులకు మాత్రం ముమ్మాటికీ గండమే. ఒకవేళ కేసుల విషయాలు వెల్లడించకపోతే.. సదరు అభ్యర్థి భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు. ఒకవేళ గెలిచి పదవిలో ఉంటే ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశాలున్నాయి.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు..

కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, చొప్పదండిలో 14, మానకొండూరులో 10, సిరిసిల్లలో 21, వేములవాడలో 16, పెద్దపల్లిలో 17, మంథనిలో 21, రామగుండంలో 23, జగిత్యాలలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు.

మంచివారిని ఎన్నుకోవాలి



మంచి వ్యక్తిత్వం, సమాజానికి సేవ చేయాలన్న భావాలున్న వ్యక్తులను ఎన్నికల్లో ఎన్నుకోవాలి. వ్యక్తిగత నేరస్వభావం ఉన్నవారి గురించి ఆలోచించాలి. డబ్బులున్నవారికే టికెట్లు ఇచ్చే ధోరణిని రాజకీయ పార్టీలు మార్చుకోవాలి. నైతిక విలువలు, ప్రజల సమస్యలు పట్టించుకునేవారికి ఇవ్వాలి. ప్రజలు కూడా అలాంటి వారికే ఓటు వేయాలి.

– బుర్ర మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎస్సారార్ కళాశాల

ఒక్క ఓటూ కీలకమే



- తాయిలాలకు ఆకర్షితులు కావొద్దు
- ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి
- మంచి నాయకుడిని ఎన్నుకోండి
- మహిళలు చైతన్యవంతులవ్వాలి
- 'సాక్షి'తో మహిళా వైద్యులు

కరీంనగర్ టౌన్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో మనం జీవిస్తున్నందుకు ఆనందపడాలి.. ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యతను భుజాన వేసుకోవాలి. ఇందుకోసం రాజ్యాంగం 18 ఏళ్లు నిండినవారికి ఓటుహక్కు కల్పించింది. ప్రతీ ఒక్కరు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. మంచి అభ్యర్థిని ఎన్నుకుంటేనే సమాజం బాగు పడుతుంది. ఓటు వేయకపోతే అసమర్థులు అందలమెక్కి, ప్రజలను అణగదొక్కేందుకు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యం చేసేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు మహిళా వైద్యులు తమ అభిప్రాయాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

నిర్లక్ష్యం వీడాలి



ఓటు ఎంతో విలువైనది. ఒక్క ఓటు వేయకుంటే ఏం కాదులే అనే నిర్లక్ష్యం వీడాలి. సరైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు తప్ప వేరే మార్గం లేదు. ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి.

– డాక్టర్ ప్రతిష్ఠారావు, మెడికవర్ ఆస్పత్రి

ప్రజాస్వామ్యానికి పునాది



మన దేశంలో ఓటు ప్రజాస్వామ్యానికి పునాది వంటిది. ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులు కావాలి. ఓటు వేయకపోతే సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు వేయాలి.

– డాక్టర్ ప్రీతి, రాచకొండ మైండ్‌కేర్ హాస్పిటల్

తప్పకుండా ఓటేయాలి



ప్రతీ పౌరుడు సమాజంలో మార్పునకు కృషి చేయాలి. ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారందరూ తప్పకుండా ఓటు వేయాలి. ఒక్క ఓటూ కీలకమే. మార్పు లేదనేవారు ఓటుతో సరైన నాయకున్ని ఎన్నుకోవాలి.

– డాక్టర్ విజయలక్ష్మి, సంజీవని హాస్పిటల్

రాజ్యాంగాన్ని కాపాడాలి



నిజమైన పౌరులుగా ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకొని, సమాజాన్ని కాపాడాలి. ఈ విషయంలో యువత ముందుండాలి. పార్టీలు, నాయకులు ఇచ్చే ఎలాంటి తాయిలాలకు లొంగకుండా ఓటు వేయాలి.

– డాక్టర్ చేతన, సాగర్ హాస్పిటల్

ప్రలోభాలకు లొంగొద్దు



ఓట్లు సాధించేందుకు అన్ని పార్టీలు ప్రలోభాలతో ఎరవేసేందుకు సిద్ధమయ్యాయి. వాటికి లొంగొద్దు. అభ్యర్థులు ఇచ్చే తాయిలాలకు ఆకర్షితులు కావొద్దు. ఆలోచించి, సరైన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలి.

– ఎనమల్ల శ్రీదేవి, రోహన్ ఆస్పత్రి

పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు

- అత్యవసర సేవలకు ఫెసిలిటేషన్ కేంద్రాలు
- ప్రతీ ఓటరుకు పోల్‌స్లిప్‌లు పంపిణీ చేయండి
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీసీలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 30న సక్రమంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ రోజు అత్యవసర సేవల కింద విధులు నిర్వహించే ఓటర్లు తమ ఓటుహక్కు ముందస్తుగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వందశాతం, గ్రామీణ ప్రాంతాల్లో 60శాతం వెబ్ కాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ సవ్యంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ర్యాండమైజేషన్ పూర్తిచేసి, ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. ఎన్నికల ప్రచారాలకు సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి పమేల సత్పతి అధికారులతో మాట్లాడారు. ఎన్నికల విధులలో పాల్గొనే వారు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడానికి పోస్టల్ బ్యాలెట్ సౌలభ్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. చొప్పదండి, కరీంనగర్ రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్ దేశాయ్, కె.మహేశ్వర్, పరిశ్రమలశాఖ అధికారి నవీన్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగార్జున, డీఆర్వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్: ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పమేల సత్పతి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. పమేల సత్పతి మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో పనిచేసే సిబ్బందికి టెండర్ ఓటు, పోల్ ఓట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటరుకు ఎపిక్‌కార్డు లేకపోయినా.. ఎన్నికల సంఘం గుర్తించిన 12రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని చిరునామాతో సంబంధం లేకుండా అనుమతించి ఓటును సద్వినియోగించుకునేలా చూడాలన్నారు. మైనారిటీ మహిళా ఓటర్లను గుర్తించడానికి మహిళా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు, నోడల్ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

ఓటర్లకు భద్రతాభావం కల్పించాలి

- సీపీ అభిషేక్ మహంతి



టూటౌన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ

కరీంనగర్ క్రైం/వీణవంక: ఎన్నికల నేపథ్యంలో పాతనేరస్తులు, రౌడీషీటర్లపై దృష్టి సారించి ఓటర్లలో భద్రతాభావాన్ని కల్పించాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, వీణవంక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇరు స్టేషన్లలో పలు రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నేరస్తులు, రౌడీషీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేని సమావేశాలు, విందు కార్యక్రమాలు, అక్రమ పంపిణీలపై నిఘా ఉండాలని, బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐలు శ్రీనివాస్, కిశోర్, ఎస్సైలు సురేందర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

అగ్రనేతలొస్తున్నారు..



ప్రధాని మోదీ అమిత్‌షా సీఎం కేసీఆర్ యూపీ సీఎం యోగి ప్రియాంక గాంధీ మాయావతి రేవంత్ రెడ్డి

- ఉమ్మడి జిల్లాకు ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్, యోగి, అమిత్‌షా, మాయావతి, ప్రియాంకా గాంధీ, రేవంత్‌రెడ్డి
- రేపటి నుంచి 28 వరకు వరుస పర్యటనలు
- భారీ బహిరంగ సభలతో హోరెత్తనున్న ప్రచారం
- జనసమీకరణతో బలనిరూపణకు సిద్ధమవుతున్న పార్టీలు

ఏ రోజు ఎవరు..

- 23న – మాజీ సీఎం మాయావతి (పెద్దపల్లి)
- 24న – ప్రియాంక గాంధీ (హుస్నాబాద్, ధర్మపురి)
- 24న – సీఎం కేసీఆర్ (రామగుండం)
- 25న – యూపీ సీఎం యోగి (వేములవాడ)
- 26న – పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి (పెద్దపల్లి)
- 27న – ప్రధాని మోదీ (కరీంనగర్)
- 28న – హోంమంత్రి అమిత్‌షా (పెద్దపల్లి)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల అధినేతలు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచే మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటనలతో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపారు. షెడ్యూల్ విడుదలయ్యాక సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావం పూరించి, పలు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా మెట్‌పల్లిలో ధర్మపురి అరవింద్‌కు మద్దతుగా బహిరంగ సభలో పాల్గొన్నారు. తాజాగా మరోమారు పెద్దపల్లిలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ఆ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, సత్తా చాటారు. రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణికి మద్దతుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కవిత రామగిరి, పెద్దపల్లిల్లో ప్రచారంలో పాల్గొన్నారు.

బీఎస్పీకి మద్దతుగా మాయావతి

పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ నెల 23న పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు.

మరోసారి గులాబీ దళపతి..

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ నెల 24న సింగరేణి స్టేడియంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు హాజరు కానున్నారు. మంత్రి కేటీఆర్ రామగుండం, మంథనిల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. వారం రోజుల్లో ఇలా అగ్రనేతలు రానుండటంతో అందరి దృష్టి ఉమ్మడి జిల్లాపై పడింది.

హుస్నాబాద్, ధర్మపురికి ప్రియాంక గాంధీ

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు హుస్నాబాద్‌లో, సాయంత్రం 4 గంటలకు ధర్మపురిలో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. అలాగే, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు మద్దతుగా 26న నిర్వహించే విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

బీజేపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ..

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఎస్సారార్ కాలేజీలో ఈ నెల 27న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని హోదాలో ఆయన మొదటిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో భారీ జనసమీకరణతో సభ సక్సెస్ చేసేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సైతం ఈ సభకు రానున్నారు. బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావును గెలిపించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 28న పెద్దపల్లికి రానున్నారు. వేములవాడలో 25న నిర్వహించే బహిరంగ సభలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు పలు నియోజకవర్గాల్లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ త్వరలో రామగుండంలో పర్యటించనున్నారు.

పార్టీ ఏదైనా వేదికలు ఇవే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల సభలను ఒక్కటే ప్రాంగణంలో నిర్వహిస్తుండటం గమనార్హం. కరీంనగర్‌లో ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్, పెద్దపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, రామగుండంలో సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియమే వేదికలవుతున్నాయి.

మద్యం విక్రయాలపై పటిష్ట నిఘా

హుజూరాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మద్యం విక్రయాలపై పటిష్ట నిఘా ఉంచామని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పరకాల క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు వివరించారు. రిజిస్టర్ సరిగ్గా లేని మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాల యాజమానులు అధిక మొత్తంలో ఓ వ్యక్తికి మద్యాన్ని విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని పాల్గొన్నారు.



ప్రత్యేక పోలింగ్ కేంద్రాలిక్కడే

- నియోజకవర్గానికి ఐదు మహిళా, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు
- నియోజకవర్గానికి ఒక దివ్యాంగ, యూత్ పోలింగ్ కేంద్రం
- సిబ్బంది నియామక ఏర్పాట్లలో ఎన్నికల యంత్రాంగం

కరీంనగర్ అర్బన్: ప్రత్యేక పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు కసరత్తు పూర్తి చేశారు. సిబ్బంది నియామక ఏర్పాట్లు చివరి దశకు చేరుకోగా అలాట్‌మెంట్ చేయడమే తరువాయి. నియోజకవర్గానికి ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలతో పాటు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రాలుండాలని స్పష్టం చేసింది. సదరు ఆదేశాల దరిమిలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టగా ప్రత్యేక కేంద్రాలను ప్రకటించారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, యువ పోలింగ్ కేంద్రంలో యువ ఉద్యోగులు, మహిళా పోలింగ్ కేంద్రంలో మహిళా ఉద్యోగులే విధులు నిర్వహించనున్నారు.


పోలింగ్ కేంద్రం

కరీంనగర్ నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో దివ్యాంగుల పోలింగ్ కేంద్రం విద్యానగర్‌లోని కోర కాన్సెప్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేయగా చింతకుంటలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్(పీఎస్ నం.27)లో యువ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

మహిళా పోలింగ్ కేంద్రాలు	మోడల్ పోలింగ్ కేంద్రాలు
లయోలా హైస్కూల్ రేకుర్తి(పీఎస్ నం.38)	ప్రైమరీ స్కూల్,నాగులమల్యాల
జెడ్పీహెచ్ఎస్,తీగలగుట్టపల్లి(68)	ఎంపీపీఎస్,కొత్తపల్లి(50)
ఎంపీయూపీఎస్,గుంటూరుపల్లి(126)	జెడ్పీహెచ్ఎస్,ఆరెపల్లి(62)
ప్రైమరీ స్కూల్, కార్ఖానగడ్డ(252)	ఎంపీపీఎస్,ఫకీర్‌పేట(84)
విద్యార్థి హైస్కూల్, రాంపూర్(292)	మహిళా డిగ్రీ కళాశాల(284)

హుజూరాబాద్‌లో

హుజూరాబాద్ నియోజకవర్గంలో దివ్యాంగ పోలింగ్ కేంద్రం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్(పీఎస్ నం.35)లో, యువ పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్(పీఎస్ నం.31)లో ఏర్పాటు చేశారు.

మహిళా కేంద్రం	మోడల్ పోలింగ్ కేంద్రం
జెడ్పీహెచ్ఎస్(బాలికలు)(పీఎస్‌నం.43)	జెడ్పీహెచ్ఎస్,వెల్బూరు(4)
జీపీ ఆఫీస్,నర్సింగపూర్(112)	జెడ్పీహెచ్ఎస్, వీణవంక(104)
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,జమ్మికుంట(177)	ప్రభుత్వ హైస్కూల్(బాయ్స్), జమ్మికుంట(171)
ఎంపీయూపీఎస్,శ్రీరాములపల్లి(226)	ఎంపీపీఎస్, ఇల్లందకుంట(225)
జెడ్పీహెచ్ఎస్(బాయ్స్), కమలాపూర్(268)	జెడ్పీహెచ్ఎస్(బాయ్స్),కమలాపూర్(265)

మానకొండూరులో..

దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్(150) పోరండ్లలో ఏర్పాటు చేయగా యువ పోలింగ్ కేంద్రాన్ని ప్రైమరీ స్కూల్(18), ముంజంపల్లిలో ఏర్పాటు చేశారు.

మహిళా పోలింగ్ కేంద్రం	మోడల్ పోలింగ్ కేంద్రం
ప్రైమరీ స్కూల్, మానకొండూరు(10)	జెడ్పీహెచ్ఎస్‌బాయ్స్, మానకొండూరు(8)
ఎంపీయూపీఎస్,రామకృష్ణాకాలనీ(159)	ఎంపీహెచ్ఎస్(184),వడ్లపల్లి
జెడ్పీహెచ్ఎస్(192),గన్నేరువరం	జీపీ ఆఫీస్(205), జంగపల్లి
జెడ్పీహెచ్ఎస్(108),శంకరపట్నం	జెడ్పీహెచ్ఎస్(85),కొత్తగట్టు
జెడ్పీహెచ్ఎస్(215),వద్దూరు	ప్రైమరీ స్కూల్(222), బెజ్జంకి

చొప్పదండిలో..

దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని దేశాయ్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో, యువ పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ బూత్ నంబర్.67 జెడ్పీహెచ్ఎస్, గోపాల్‌రావుపేటలో ఏర్పాటు చేశారు.

మహిళా కేంద్రం	యువ పోలింగ్ కేంద్రం
ప్రభుత్వ జూనియర్ కళాశాల(29),గంగాధర	జెడ్పీహెచ్ఎస్(26),గంగాధర
జెడ్పీహెచ్ఎస్,రామడుగు(84)	ఎంపీపీఎస్(86), రామడుగు
జెడ్పీహెచ్ఎస్(175), రుక్మాపూర్	ఎంపీపీఎస్ ఎస్సీకాలనీ(156), గాంధీనగర్
ప్రైమరీ స్కూల్(188), బూరుగుపల్లి	జెడ్పీహెచ్ఎస్(204), వెంకట్రామ్‌పల్లి
ఎంపీపీఎస్(250), కొడిమ్యాల	జీపీ ఆఫీస్, కొడిమ్యాల(256)

క్లుప్తంగా

గవర్నర్ పురస్కారానికి ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. దీంతో డీసీపీ చేతన వారిని మంగళవారం అభినందించారు. ఈనెల 5నుంచి 10వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సరస్వతీ శిశు మందిర్‌లో జరిగిన పోటీల్లో గాయత్రీ విద్యానికేతన్‌కు చెందిన విష్ణుప్రియ, మహాలక్ష్మి, లయవర్ధిని, సాహిత్య, లాస్య, వైశాలి ప్రతిభ కనబర్చి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, గైడ్ కెప్టెన్ స్రవంతి పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని నటరాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ కరీంనగర్ అర్బన్ సీఐ తాతాజీ మంగళవారం తెలిపారు. సమయపాలన పాటించకపోవడంతో చర్యలు తీసుకున్నామన్నారు. రూ. 10 వేల జరిమానా విధించామని పేర్కొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

సైదాపూర్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లి, దుద్దెనపల్లి ఉన్నత పాఠశాలలను సిక్కిం రాష్ట్ర ఐజీ క్యాడర్ అధికారి సోనమ్ టెన్సింగ్ భూటియా మంగళవారం పరిశీలించారు. అనంతరం ఠాణాలో పోలీసులతో సమావేశమయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లను సందర్శించినట్లు తెలిపారు. వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ఎక్కువ దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, ఎస్ఐ ఆరోగ్యం ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్య


గోపాల్ (ఫైల్)

రామగిరి(మంథని):గ్రామ పంచాయతీ కార్మికుడు కన్నూరి గోపాల్(45)పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన కన్నూరి గోపాల్ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 3న ఇంట్లో గొడవ చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు గంగస్నానం కోసం వెళ్లగా గోపాల్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడ పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోరకు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి ప్రసాద్ తెలిపారు.

దత్తతపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దత్తత తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ దత్తత నెల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంతానం లేని దంపతులు పిల్లలను దత్తత తీసుకొని, వారికి మంచి జీవితాన్ని ఇవ్వాలని కోరారు. దత్తత మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారానే జరగాలని, ఈ విధానంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఇందుకోసం ఏటా నవంబర్‌ను ప్రభుత్వం దత్తత నెలగా ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ హోమ్స్‌లో ఉన్న పిల్లలందరినీ గుర్తించి, దత్తత ఇవ్వడం, తీసుకునేవారికి పిల్లల పోషణ, దత్తత విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బాలల సంక్షేమ సమితి చైర్పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు అర్చన, విజయ్, డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్, పీవోఎన్ఐసీ తిరుపతి, ఎల్‌సీపీవో రాజు, శిశు గృహ సోషల్ వర్కర్ రాజేశ్, సఖి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను పట్టించుకోని బీజేపీ, బీఆర్‌ఎస్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్


మాట్లాడుతున్న శంకర్

కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు సీపీఐ ఇండియా కూటమితో కలిసి పని చేస్తుందన్నారు. రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన ఆ పార్టీలు ప్రజలను పట్టించుకోకుండా, ఎన్నికల హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక, నియంత పాలన కొనసాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అసలైన నిరుపేదలకు అందలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాండ్ర సదానందం, కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): బుచ్చయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామంలో ఉంటున్న పల్లెవారి గణేశ్(48) అక్కడికక్కడే మరణించాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం తుమ్మవారి గూడేనికి చెందిన పల్లెవారి గణేశ్.. బుచ్చయ్యపల్లి గ్రామానికి వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం గణేశ్ బొట్లవనపర్తి నుంచి బుచ్చయ్యపల్లికి సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్ ట్రాలీవెనుక టైర్‌కింద పడి దుర్మరణం చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అరాచకాన్ని అడ్డుకోండి.. అభివృద్ధిని ఆదరించండి

- ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు గడ్డం శ్రీరాం


మాట్లాడుతున్న శ్రీరాం

మంథని: తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు పాలన అరాచకంగా సాగిందని, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారని, అలాంటి బెదిరింపు పాలన మళ్లీ రాకుండా మంథని ప్రజలు ముందుకు వెళ్లాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ గడ్డం శ్రీరాం కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసు విషయంలో ఆయన మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్న సమయంలో తనపై తప్పుడు కేసు నమోదు చేయించి పదేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఆనాడు అక్రమంగా నిర్బంధించడమే కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలని చూశారని పేర్కొన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలే కానీ భయభ్రాంతులు, అరాచకాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసులో యూనివర్సిటీ నుంచి రెండు వాహనాల్లో తీసుకొచ్చి గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారని గుర్తుచేశారు. ఏకస్వామ్య పాలన ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. భయంతో పాలన నడిపిద్దామనుకునే నాయకుల గురించి ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణతోపాటు మంథనిలో ఎంతోఅభివృద్ధి జరిగిందని, మరింత అభివృద్ధి కోసం పుట్ట మధు లాంటి నాయకత్వానికి అండగా నిలవాలని కోరారు.

దునియా గిట్ల మారవట్టె..!



పెగడపల్లి(ధర్మపురి): అరె తమ్మి.. గి ఊళ్లె మనకు మంచి పట్టున్నట్టుంది. ఓటడిగిన ప్రతొక్కలు భరోసా ఇస్తుండ్రు. జర మనసు నిమ్మలమైతంది అంటూ ఓ ఊరిలో ప్రచారం ముగిస్తూ ఊరు దాటిన ఓ పార్టీ నాయకుడు తన అనచరుడితో అన్నడు. ఏమోనన్న.. నాకై తే గీల్ల(ఓటర్ల) కిట్కు తెలుత్తలేదు. గిప్పుడు మనకే ఓటేస్తమని మాటిచ్చిన గాల్లంతా.. నిన్ననే ఎదుటి పార్టోల్లకు మాటిచ్చిండ్రనే మాట విన్న. పెరారం మద్దెల పారగాల్లు మాట్లాడుతుంటే జెర చెవి పెట్టిన. ప్చ్.. ఏం జేస్త మన్నా.. దునియా గిట్ల మారవట్టె అంటూ తమ నాయకుడికి గుండె నిబ్బరాన్ని పెంచాడు. అవ్ తమ్మి.. పక్కగా సెప్పినవ్. గప్పటి ఎలచ్చన్ల లెక్క గిప్పుడు ఓటర్లు లేరు. శానా మార్పులొచ్చినయ్. లీడర్ల మాటలిని గాల్లు కూడా మస్తుగా మాటలు నేర్సిండ్రు. ఏం జరుగుతదో సూద్దాం అంటూ కారెక్కి పక్క ఊర్లో ప్రచారానికి బయలుదేరిండు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ధర్మారం(ధర్మపురి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన బద్దం మౌనిక (24) అనే వివాహిత సోమవారం ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మౌనికకు వివాహమై నాలుగు సంవత్సరాలు గడిచినా సంతానం కలగలేదని మనోవేదనకు గురై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఆ తర్వాత వచ్చిన కుటుంబసభ్యులు గమనించి, వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి దొడ్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తలపై కేసు

కరీంనగర్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించినందుకు బీజేపీ కార్యకర్తలపై కేసు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. బీజేపీ నాయకుడు బాస సత్యనారాయణరావు నగరంలోని అశోక్‌నగర్‌లో ప్రచారం కోసం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతి తీసుకున్నారని అన్నారు. కానీ కార్యకర్తలు మంగళవారం ఉదయం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొన్నారు. వారిపై ఎన్నికల పర్యవేక్షణాధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు


కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ కరుణాకర్‌రావు, పోలీసులు

- ఏసీపీ కరుణాకర్‌రావు
- చిగురుమామిడి, నవాబుపేట్ గ్రామాల్లో కవాతు

చిగురుమామిడి: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్‌రావు తెలిపారు. మంగళవారం చిగురుమామిడి, నవాబుపేట్ గ్రామాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు కార్యక్రమాన్ని జెండా ఊపి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 80 మంది పోలీసులతో రెండు గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. ఇందులో కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసులు, స్థానిక పోలీస్ అధికారులు, జిల్లా హెడ్ క్వార్టర్స్ నుంచి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్స్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా అధికారులతో కలిసి పని చేస్తాయన్నారు. ప్రజల్లో ఎన్నికల నియమావళి, ఉల్లంఘనలు, డయల్ 100, 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ యాప్‌లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా భద్రతాభావాన్ని కల్పించడమే కాకుండా చట్టాన్ని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేవారిని పిలిపించి, ప్రజల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడమే కవాతు ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ విపిన్ సింగ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి–తిమ్మాపూర్, రాజ్‌కుమార్–మానకొండూర్, ప్రదీప్–కరీంనగర్, ఎస్సైలు రాజేశ్–చిగురుమామిడి, ప్రమోద్‌రెడ్డి–ఎల్ఎండీ, నర్సింహారావు–గన్నేరువరం తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట నుంచి సిరిసేడుకు వెళ్లే మార్గంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. మొట్లపల్లికి చెందిన తాళ్లపల్లి గోదారి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. వాటి విలువ రూ.6,930 ఉంటుందని, స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి రవాణా చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు విశ్వ, మహేశ్, పద్మావతి, శైలజ పాల్గొన్నారు.


బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

21 లీటర్ల నాటుసారా స్వాధీనం

సారంగాపూర్(జగిత్యాల): రేచపల్లి, దాని చుట్టుపక్క గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మ్యాడారంతండాకు చెందిన బానావత్ జగన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది మోహన్‌లాల్, గట్టయ్య, చంద్రశేఖర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

26న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో బాలబాలికల విభాగాల క్రీడాకారులకు ఉదయం 9:30 గంటల నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సత్తా చాటినవారిని డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 01-01-2006 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులన్నారు. బీఎంఐ, ఎత్తు, వయసు, బరువు కలిసి 250 పాయింట్లు మించరాదని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఎస్సెస్సీ మెమో లేదా ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సెయింట్ జాన్స్ పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

రేపు ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్..

అండర్–19 బాలబాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో, షటిల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జ్యోతినగర్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ఖోఖో, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారుల వివరాలను ఎస్జీఎఫ్ సెక్రటరీకి బుధవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఫొటోతో కూడిన ఎలిజిబిలిటీ సర్టిఫికెట్, పదోతరగతి మెమో, స్టడీ, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

నేడు స్విమ్మింగ్ పోటీలు

అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను బుధవారం కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఫొటోతో కూడిన ఎలిజిబులిటీ, స్టడీ, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నేత భిక్షపతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు ఎన్.భిక్షపతి అన్నారు. ఎన్టీపీసీలో ఈదునూరు భూమయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించే ఎన్టీపీసీ ఎన్సీసీ సమావేశంలో సమస్యలపై చర్చిస్తామన్నారు. డబ్ల్యూ–0, డబ్ల్యూ–1గ్రేడ్ ఉద్యోగులకు మెడికల్, పదవీ విరమణ తర్వాత మెడికల్ సౌకర్యం పొందేందుకు 15ఏళ్ల సర్వీస్ నిబంధన తొలగింపు, 13ఏళ్లుగా పదోన్నతులు పొందని డబ్ల్యూ–1 గ్రేడ్ ఉద్యోగులకు డబ్ల్యూ–2 గ్రేడ్ పదోన్నతికి ఉన్న ఎనిమిదో తరగతి విద్యార్హత నుంచి మినహాయింపు, కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) ప్రవేశపెట్టి కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే పథకం పునరుద్ధరణ తదితర అంశాలపై ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌కు వినతిపత్రం అందించామని అన్నారు.

నూతన కార్యవర్గం

సమావేశం అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎర్రవెల్లి ముత్యంరావు, అధ్యక్షుడిగా ఎన్.భిక్షపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, రాసపల్లి సంపత్, సారయ్య, కార్యదర్శులుగా ఎం.కుమార్, శంకర్, రామాచారి, కోశాధికారిగా భిక్షపతి, సభ్యులుగా గణేశ్, వీరయ్యను ఎన్నుకున్నారు.

‘గ్రంథాలయ స్థలం కబ్జా చేస్తే ఊరుకునేదిలేదు’


గోదావరిఖని(రామగుండం): ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు–3 కింద 1994లో భూములు కోల్పోయిన వారికి, ఐఎఫ్‌టీయూ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోబోమని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. 2000 సంవత్సరంలో స్థానిక ప్రశాంత్‌నగర్‌లో సింగరేణి యాజమాన్యం స్థలాలను కేటాయించిందని గుర్తు చేశారు. రాజీవ్ రహదారి సమీప స్థలం 23 ఏళ్లుగా యూనియన్ల అధీనంలోనే ఉందన్నారు. కార్మికుల కోసం చివరిదాకా పోరాడి అమరుడైన యు.రాములు స్మారక గ్రంథాలయానికి ఆ స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.కోట్లు విలువ చేసే ఈ స్థలంపై కొందరు కబ్జా చేసేందుకు కన్నేసినట్లు చిత్రీకరించి తప్పుడు పత్రాలు సృష్టించి జీవో నంబర్ 76 ఆధారం చేసుకుని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇదే స్థలంలో రోడ్డు వెడల్పు కింద దుకాణాలు కోల్పోయిన చిరువ్యాపారులు తమ జీవనోపాధి కొనసాగిస్తున్నారన్నారు. వారిని సైతం బెదిరింపులకు గురిచేస్తూ అక్రమంగా పట్టా పొందిన వారు దౌర్జన్యానికి దిగుతున్నారని పేర్కొన్నారు. దొంగ పట్టా చేసిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధరణి తీసేస్తే దళారులదే రాజ్యం





గంగులకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



మార్నింగ్‌వాక్‌లో వాకర్స్‌తో మంత్రి గంగుల కమలాకర్

- కాంగ్రెస్‌తో సంక్షోభం.. బీఆర్‌ఎస్‌తో సంక్షేమం
- ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: ధరణి తీసేస్తే మళ్లీ దళారులదే రాజ్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని 56, 59, 60వ డివిజన్‌లలో ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాకముందు కరీంనగర్‌లో రోడ్లు ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉన్నాయో గమనించాలని, అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్లలో కరీంనగర్‌రూపురేఖలు మార్చి గొప్పగా అభివృద్ధి చేశామన్నారు. వేల కోట్ల నిధులు తీసుకవచ్చి నగరంలోని అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈద్గాల కోసం స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. హిందువుల కోసం టీటీడీ టెంపుల్, క్రైస్తవుల కోసం ప్రార్థన మందిరాలు నిర్మిస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఎక్కడా గెలిచేది లేదన్నారు. అలాంటి పార్టీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. అసమర్థ ఎంపీ ఉండడం వల్ల కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. నగరంలో ప్రశాంత వాతావరణం ఇలాగే కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు, గందె మాధవి మహేశ్, వాల రమణారావు, నాయకులు జైపాల్‌రెడ్డి, సదానందచారి, రవీందర్, సూర్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మా ధ్యాస అంతా అభివృద్ధి పైనే..

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు కరీంనగర్ అభివృద్ధిపై ధ్యాస లేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన అంతా అభివృద్ధి సంక్షేమంపైనే ఉంటుందని బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబేడ్కర్ స్టేడియంలో ప్రణాళిక బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌తో కలిసి మార్నింగ్‌వాక్‌లో ప్రచారం నిర్వహించారు. పదేళ్ల తెలంగాణ పాలనలో కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని. ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. 2015లో కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చడంలో సీఎం కేసీఆర్‌తో పాటు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ కృషి చేశారని, కరీంనగర్ కార్పొరేటర్ల బృందం ఢిల్లీకి వెళ్లినప్పుడు బండి సంజయ్ కార్పొరేటర్‌గా ఉన్నాడని . ఢిల్లీకి రమ్మంటే ముఖం చాటేశాడని అన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు తన వల్లే వచ్చాయని పచ్చి అబద్ధాలు పలుకుతున్నాడని తెలిపారు. అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ప్రగతికి ఓటెయ్యండి అని విజ్ఞప్తి చేశారు. ప్రణాళిక బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, సీఎం కేసీఆర్ విజన్ చాలా గొప్పదని, పార్లమెంటులో స్వయంగా కేంద్ర మంత్రులే మెచ్చుకున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షాల మాటలను నమ్మకండి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోవద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలం బొమ్మకల్, గుంటూరుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బతుకమ్మ, బోనాలతో మహిళలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. బండి సంజయ్ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఏదో ఒక డ్రామాలాడుతాడన్నారు తాను వ్యాపారాలతో డబ్బులు సంపాదిస్తే సంజయ్ ఏ వ్యాపారం చేసి కోట్లు సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారుడైన కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే అయితే ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేసాడని విమర్శించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తిమ్మాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ఆటో కార్మికులకు ఫిట్‌నెస్ రద్దు చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాసులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

కొత్తపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను గెలిపించాలని కోరుతూ కొత్తపల్లిలో వాకర్స్‌ను మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రిని మరోసారి గెలిపించాలన్నారు.

పోరాడే గొంతుకను గెలిపియ్యండి



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

- మీవి భూకబ్జాల బాగోతం.. నాది పోరాటాల చరిత్ర
- ప్రజలారా... ఎటువైపు ఉంటారో ఆలోచించండి
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్: గంగుల కమలాకర్ మాటలను వింటే నవ్వొస్తుంది.. కమలాకర్ కేఏ పాల్ తమ్ముడు. జోకర్ లెక్క మాట్లాడుతున్నడు.. ఏం మాట్లాడుతున్నడో ఆయనకే అర్థం కావడం లేదని బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని 57, 58, 59, 60 డివిజన్లలో బండి సంజయ్ ప్రచారం నిర్వహించారు. భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు పూలు చల్లి, తిలకం దిద్ది సంజయ్‌కు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నేతలు సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఓల్డ్ డీఐజీ బిల్డింగ్ సమీపంలో ప్రజలను ఉద్దేశించి సంజయ్ మాట్లాడారు. నేను అవినీతిపరుడినట.. టిక్కెట్‌ను రూ.20 కోట్లకు అమ్ముకున్నానట.. ఆస్తులు సంపాదించానట.. డబ్బు సంచులున్నయట.. గంగులకు నేను సవాల్ చేసిన . నాపేరు మీద, బినామీ పేరుమీద ఉన్న ఆస్తిపాస్తుల డాక్యుమెంట్లన్నీ తీసుకువస్తా. అవన్నీ కరీంనగర్ ప్రజలకు రాసిస్తాం. నీ పేరు, నీ కుటుంబ సభ్యుల, బినామీల పేరిట ఉన్న డాక్యుమెంట్లన్నీ తీసుకొస్తాం ప్రజలకు రాసిచ్చేందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు. నేను కొట్లాడితే 74 కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరిదీ భూకబ్జాల భాగోతం.. నాది పోరాటాల చరిత్ర.. ఎటువైపు ఉంటారో ఆలోచించి ఓటేయాలని కోరారు

ఉపాధ్యాయులారా.. మీ మౌనం వీడండి

ప్రజల కోసం జీవితాలను పణంగా పెట్టి పోరాడుతున్న మాలాంటి వారికి ఓట్లేసి గెలిపించకపోతే.. సమాజానికి ఏ సందేశం వెళ్తుందో ఆలోచించండి. మీరు మేధావులు.. మీ మౌనాన్ని వీడండి.. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి ఓట్లేసి ప్రశ్నించే, పోరాడే గొంతుకకు అండగా నిలవండి' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని పద్మనాయక మండపంలో మంగళవారం జరిగిన కేజీ టూ పీజీ టీచర్స్, లెక్చరర్స్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం రూ.9 వేల కోట్లు తీసుకొచ్చినని తెలిపారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరినా.. గంగుల కమలాకర్ తోక ముడిచిండు.. నాపై దుష్ప్రచారం స్టార్ట్ చేసిండు.. దొంగ వీడియోలు, ఆడియోలతో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు సిద్ధమైండని అన్నారు. వాస్తవాలు గమనించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలు అమలు కావాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదని, ఎక్కడి నుంచి తీసుకొస్తారు? కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేస్తోందని తెలిపారు.

కేటీఆర్‌కు కండకావరం

కేటీఆర్‌కు కండకావరం తలకెక్కింది.. ఉద్యోగాలు అడిగితే.. తిడుతున్నరు.. ఇగ ఆయన సీఎం అయితే పరిస్థితి ఎట్లుంటదో అర్థం చేసుకోవాలని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్ సీఎం అయితే హరీశ్, కవిత, సంతోశ్‌రావు తలో పది మంది ఎమ్మెల్యేలను తీసుకుని పార్టీని వీడిపోవడం పక్కా.. ప్రభుత్వం కూలిపోవడం తథ్యం తెలిపారు.

అవినీతిపరులెవ్వరో తేల్చుకుందాం

గంగుల కమలాకర్ మంత్రిగా ఉండి ఒక్క రేషన్‌కార్డు, అర్హులకు బీసీ బంధు ఇవ్వలేదని, రైతుల నుంచి తాలు పేరిట క్వింటాల్‌కు ఐదారు కిలోల వడ్లు దోచుకున్నాడని ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు భూకబ్జాదారులని, కుంటికి కన్పించిన జాగాలు, గుట్టలను విడిచిపెట్టడం లేదన్నారు. అగ్రికల్చర్ కాలేజ్ పేరిట అక్రమంగా గుట్ట మట్టిని బీఆర్‌ఎస్ నాయకులు అమ్ముకుంటున్నారని. చెరువును పూడ్చి క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి ముదిరాజ్‌ల జీవనోపాధిని దెబ్బతీశారని తెలిపారు ఎంపీగా నేను చేసిన అభివృద్ధి పనులపై బుక్‌లెట్ తయారు చేశానని. దమ్ముంటే మంత్రి గంగుల బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు



సుష్మాస్వరాజ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంజయ్

బీజేపీని గెలిపిస్తే బీసీ సీఎం

ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపిస్తే తెలంగాణలో సునామీ సృష్టించాడని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. సంజయ్‌కు మద్దతుగా చెర్లభూత్కూర్ ప్రచారసభలో మాటాడారు. కేసీఆర్‌కు రెండుసార్లు అవకాశమిస్తే తెలంగాణను అప్పుల పాలు చేశాడని, తాగుబోతుల రాష్ట్రంగా చేసిండన్నారు. బీజేపీని గెలిపిస్తే బీసీ లీడర్ సీఎం కాబోతున్నాడని తెలిపారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ త్వరగా పూర్తిచేయాలి



ఓటరుకు స్లిప్ అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని అన్ని డివిజన్‌లలో ఓటరు స్లిప్‌ల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. భగత్‌నగర్, కాశ్మీర్‌గడ్డ, ముకరాంపుర, గణేశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్పుల పంపిణీని మంగళవారం పరిశీలించారు. డివిజన్ల వారీగా ఎంతమేర స్లిప్‌ల పంపిణీ జరిగింది, సంక్రమంగా ఇస్తున్నారా ఆరా తీశారు. తాను స్వయంగా ఓటరుకు స్లిప్ అందజేశారు. ఓటరు స్లిప్పుల పంపిణీ సాఫీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వరేశ్, రెవెన్యూ అధికారి అంజనేయులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రం పరిశీలన

హుజూరాబాద్‌రూరల్ :మండలంలోని సింగాపూర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఏసీపీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికల నియామవళిని ప్రజలందరూ పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

నిఘా వలయంలో 'నగునూరు'

- 64 సీసీ కెమెరాలు ఏర్పాటు
- నేరాల నియంత్రణకు దోహదం
- గ్రామపంచాయతీ నుంచి పర్యవేక్షణ

కరీంనగర్‌రూరల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పోలీసులు సైతం పెద్ద సంఖ్యలో వినియోగిస్తున్నారు. ప్రముఖులు తమ నివాసగృహాల రక్షణ, వ్యాపారులు తమ సంస్థల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించిన నగునూరు ప్రజాప్రతినిధులు గ్రామంలో దాతలసాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ మండలంలోనే తొలిసారిగా పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల నిఘాలో ఉన్న గ్రామంగా నగునూరు గుర్తింపు పొందింది.

దాతల సాయంతో సీసీ కెమెరాలు

కరీంనగర్ మండలం నగునూరులో దాదాపు 8 వేల జనాభా ఉంది. కరీంనగర్-చొప్పదండి స్టేట్ హైవే పక్కన ఉండటంతో పాటు ప్రతిమ ఆస్పత్రితో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. నివాసగృహాల సంఖ్య పెరుగుతుండటంతో గ్రామ పరిధి క్రమేపీ విస్తరించింది. అపరిచితుల రాకపోకలు, నేరాలు పెరుగుతుండటంతో అప్రమత్తమైన సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఉప సర్పంచ్ దామరపల్లి దామోదర్‌రెడ్డిలు వార్డుసభ్యులతో చర్చించి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పలువురు దాతల సాయంతో రెండేళ్ల క్రితం దాదాపు రూ.10లక్షల వ్యయంతో 64 సీసీ కెమెరాలు, టీవీ స్క్రీన్, కంప్యూటర్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలైన పావగారిపల్లె, పోచమ్మకుంట, శాలపల్లె, హైస్కూల్ చౌరస్తా, జీపీ సర్కిల్, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మకాలనీ, బోకూరిపల్లె, గ్రామ పంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు బిగించారు. సీసీ కెమెరాల కనెక్టివిటీ, మానిటరింగ్‌ను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. టీవీ స్క్రీన్ ద్వారా అన్ని సీసీ కెమెరాలను పరిశీలించే సౌకర్యం కల్పించారు. ప్రధాన దారుల్లోని సీసీ కెమెరాల ద్వారా గ్రామంలోకి వచ్చే వ్యక్తుల వివరాలను పరిశీలించే అవకాశమేర్పడింది ప్రతీరోజు పారిశుద్ధ్య సిబ్బంది ఆయా కాలనీల్లో పనిచేస్తున్న విధానాన్ని సీసీ కెమెరాల ద్వారా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తనిఖీ చేస్తున్నారు. ఎక్కడైనా గొడవలు, తగాదాలు, ఏదైనా ఇతర సమస్యలు తలెత్తితే పరిశీలించి సంబంధిత వ్యక్తుల ద్వారా వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతున్నారు. సీసీ కెమెరాల నిఘా ఉండటంతో పెద్దగా గొడవలు లేకపోవడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తడంలేదు. ఇటీవల జరిగిన రెండు దొంగతనాలు, యాక్సిడెంట్‌కు సంబంధించిన వ్యక్తులను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు.



నగునూరులోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

నిరంతర పర్యవేక్షణ

గ్రామంలోని సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటోంది. గ్రామంలోకి అపరిచితులు, అనుమానితుల రాకపోకలను గుర్తించే అవకాశమేర్పడింది. గ్రామంలో ఎక్కడ ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది. సీసీ కెమెరాల నిఘాతో పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు మెరుగుపడింది

– ఉప్పుల శ్రీధర్, సర్పంచ్

ఆధ్యాత్మికం

వైభవంగా వార్షికోత్సవ పూజలు



కరీంనగర్ కల్చరల్: నగరంలోని కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మంటపారాధనలు, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో నాగారపు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు. కాగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ భారతదేశానికి అత్యంత పొడవైన సముద్రతీర రేఖ, విశాలమైన సముద్రజలాలు ఉన్నాయన్నారు. దేశంలో అనేక జీవనదులు, చెరువులు, రిజర్వాయర్లు, కుంటలు ఉండి మత్స్య సంవర్ధనానికి అనుకూలంగా ఉండి అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర శాఖ అధిపతి లెఫ్టినెంట్ పి. రాజు, అధ్యాపకులు డాక్టర్ సురేందర్ రెడ్డి, డాక్టర్ టి.మహేశ్, బి.సురేశ్‌కుమార్, సమత, సుమలత, రవళి, కృష్ణ, ఫిషరీస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ బొల్లం రమేశ్

హుజూరాబాద్‌రూరల్ : ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ బొల్లం రమేశ్ అన్నారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నా రు. గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వ్యక్తులకు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టామని, వారిని బైండోవర్ సైతం చేసినట్లు తెలిపారు. స్వచ్ఛందంగా ఓటేయాలని సూచించారు.

విద్యుత్ శాఖలో మీటర్ల దందా

- అనుమతి ఒకచోట.. బిగింపు మరోచోట
- కొన్ని గ్రామాల్లో పంచాయతీ అనుమతిలేకున్నా మీటర్ల మంజూరు
- అధికారుల పర్యవేక్షణ లోపం.. లైన్‌మెన్ల మాయాజాలం

కొత్తపల్లి: విద్యుత్ శాఖలో మీటర్ల దందా ఆగడం లేదు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కొరవడంతో లైన్‌మెన్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విద్యుత్ మీటర్లకు అనుమతి ఒక చోట పొందితే.. మరో చోట బిగిస్తూ లైన్‌మెన్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఈ మీటర్లను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఈ వి ద్యుత్ మీటర్ల అక్రమ బిగింపుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం విచారకరం. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ మీటర్ల అక్రమ దందాపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

అనుమతి ఒక చోట.. బిగింపు మరో చోట

టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఆఫీసు పరిధిలోని కొత్తపల్లి సెక్షన్‌లో చోటుచేసుకున్న అక్రమ మీటర్ బిగింపుపై కరీంనగర్ టౌన్ డీఈకి వినియోగదారుడు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. సీతారాంపూర్ పరి ధిలోని 27/ఏ సర్వేనంబర్‌లో గల భూమిపై విచారణ న్యాయస్థానం పరిధిలో ఉండగా ఇక్కడ నిర్మించిన షెడ్డుకు మీటర్‌ను మంజూరు చేయడంతో పాటు బిగించారని. దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమంగా బిగించిన మీటర్‌ను తొలగించాలని కొత్తి వినయ్ ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా సీతారాంపూర్‌లోని 2-138 ఇంటినంబర్‌పై దరఖాస్తు చేసుకోగా రిజిస్ట్రేషన్ నంబర్ పీఎస్‌సీ 201217165 కింద మంజూరైన ఎస్ఎంపీ4102 నంబర్ గల మీటర్‌ను మున్సిపల్ అనుమతిలేని, కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో నిర్మించిన షెడ్డుకు బిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల చిగురుమామిడి సెక్షన్‌లో మీటర్‌ను మరోచోట బిగించినందుకు అక్కడి లైన్‌మెన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ విద్యుత్ సిబ్బంది పనితీరులో మార్పురావడం లేదని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ అనుమతుల్లేకుండానే మీటర్లు

కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ శివారులో తూంకుంటలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు గ్రామ పంచాయతీ అనుమతుల్లేకుండా విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారు. గ్రామ పంచాయతీ నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతుల్లేవంటూ ఓ వైపు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేస్తుండగా.. మరోవైపు ఏ ఆధారాలతో విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారో విద్యుత్ సిబ్బందికే తెలిసుండాలి. ఈ మీటర్ నంబర్లతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ అక్రమార్కులు స్టేటస్‌కో తెచ్చుకుంటున్నట్లు సమాచారం.

విచారణ జరుపుతాం

సీతారాంపూర్, కమాన్‌పూర్‌లలో బిగించిన విద్యుత్ మీటర్లపై సమగ్ర విచారణ జరుపుతాం. వినియోగదారులు తప్పుదోవ పట్టించి మీటర్‌ను బిగించుకుంటే వాటిని తొలగిస్తాం. ఒకవేళ ఉద్దేశ పూర్వకంగా విద్యుత్ సిబ్బంది తప్పుచేస్తే శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.

– కొలుపుల రాజు, ఏడీఈ కరీంనగర్ రూరల్

నగరంలో పోలీసుల కవాతు



ఫుట్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్‌లోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో మంగళవారం పోలీసులు స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో ఫుట్ మార్చ్, వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఓల్డ్ లేబర్ అడ్డా, న్యూ లేబర్ అడ్డా, విద్యానగర్, రాంనగర్, చైతన్యపురి, భాగ్యనగర్ వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీలు నరేందర్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టూ టౌన్ సీఐ రాంచందర్‌రావు, హెడ్‌క్వార్టర్ నుంచి స్పెషల్ యాక్షన్ టీంలు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ సివిల్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని రెనె ఆసుపత్రి, వావిలాలపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైకోర్టు తీర్పును రద్దు చేయండి

చంద్రబాబుకు బెయిల్ విషయంలో పరిధి దాటింది • రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు

- సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలను హైకోర్టు అతిక్రమించింది
- కేసు లోతుల్లోకి వెళ్లి క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం చేసింది
- ట్రయల్ కోర్టును ప్రభావితం చేసేలా ఆ తీర్పు ఉంది
- మినీ ట్రయల్ నిర్వహణ.. 39 పేజీల తీర్పే ఇందుకు నిదర్శనం
- దుర్వినియోగం చేసిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి వెళ్లాయి
- అందుకు పూర్తి ఆధారాలున్నా ఏమాత్రం పట్టించుకోలేదు
- చంద్రబాబుకు రాజకీయ పలుకుబడి ఉంది.. సాక్షులను బెదిరించడం ద్వారా దర్యాప్తును ప్రభావితం చేస్తారు
- హైకోర్టు తెల్పిన అంశాలు వాస్తవ విరుద్ధం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఇందులో నారా చంద్రబాబునాయుడిని ప్రతివాదిగా చేర్చింది. ఈ ఎస్ఎల్‌పీ తేలేంత వరకు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరింది. హైకోర్టు స్కిల్ కుంభకోణంలో సీఐడీ చేసిన ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లి చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఒకవైపు కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని చెబుతూ, మరో వైపు సీఐడీ ఆరోపణలు, అందుకు సమర్పించిన ఆధారాలు, ఇతర అంశాల పూర్వాపరాల్లోకి వెళ్లి హైకోర్టు తీర్పు వెలువరించిందని వివరించింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కేసు లోతుల్లోకి వెళ్లకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించిందని స్పష్టం చేసింది. హైకోర్టు చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను డిశ్చార్జ్ పిటిషన్‌ను విచారించినట్లు విచారించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపించింది. 'హైకోర్టు స్కిల్ కుంభకోణం కేసు లోతుల్లోకి వెళ్లి మరీ చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు తేల్చిన పలు అంశాలు వాస్తవ విరుద్ధం. ట్రయల్ సందర్భంగా కింది కోర్టును ప్రభావితం చేసేలా హైకోర్టు తీర్పు ఉంది. బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఏకంగా 39 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు మినీ ట్రయల్ నిర్వహించింది. రికార్డుల్లో ఉన్న అంశాలకు విరుద్ధంగా హైకోర్టు తన నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కేసులో హైకోర్టు తన పరిధిని అతిక్రమించింది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది.

సుప్రీంకోర్టు నిర్దేశించిన పరిధుల అతిక్రమణ

'ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హైకోర్టు తీర్పు చెల్లుబాటు కాదు. దానిని రద్దు చేయాలి. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఎలా వ్యవహరించాలన్న దానిపై ఇప్పటికే స్పష్టంగా తేల్చిన న్యాయపరమైన కొలమానాలన్నింటినీ హైకోర్టు తన తీర్పు ద్వారా అతిక్రమించింది. బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా సాక్ష్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించడం, కేసు లోతుల్లోకి వెళ్లడాన్ని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీవ్రంగా తప్పుపట్టింది. మినీ ట్రయల్ కూడా నిర్వహించకూడదని చెప్పింది. అయితే హైకోర్టు ఏకంగా ట్రయల్ నిర్వహించింది. బెయిల్ మంజూరు సందర్భంగా సీఐడీ ఆరోపణలను, వాటి తీవ్రతను, డాక్యుమెంట్ల విశ్వసనీయతను, సాక్ష్యాల విలువను హైకోర్టు తన తీర్పులో తేల్చేసింది. హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక కొలమానాలన్నింటికీ విరుద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ నమోదు చేసిన కేసు ప్రభావితం అయ్యేలా హైకోర్టు వ్యవహరించింది. దుర్వినియోగం చేసిన నిధులు తెలుగుదేశం పార్టీ ఖాతాలకు మళ్లించారని తేల్చేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాల జోలికి వెళ్లరాదు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న బెయిల్ పిటిషన్‌ను అడ్డంపెట్టుకుని తెలుగుదేశం పార్టీ వర్గాలు సీఐడీ దర్యాప్తునకు అడ్డుగోడలా నిలబడ్డాయి. సీఐడీ సమన్లకు ఏమాత్రం సహకరించలేదు. సీఐడీ సమన్లకు టీడీపీ వర్గాలు స్పందించలేదన్న వాస్తవాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. మనీలాండరింగ్ అంశంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. నిధులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై నిర్దిష్ట ఆధారాలున్నాయి. వాటిని హైకోర్టు ముందు ఉంచడం జరిగింది. అన్ని అంశాలపై ఏపీ సీఐడీ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నిధుల మళ్లింపు జరగలేదని తేల్చడం ద్వారా హైకోర్టు ఘోర తప్పిదానికి పాల్పడింది. స్కిల్ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా నిర్వహించిన విచారణను, దాని తాలూకు నివేదికను హైకోర్టు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. అసలు ఆ నివేదికలో ఏమీ లేదని తేల్చేసింది' అని వివరించింది

స్పష్టంగా నగదు జాడలు

'ప్రాజెక్టు విలువ రూ.3,300 కోట్లు అని చంద్రబాబు తదితరులు చెబుతున్నారు. అలా అయితే గత ప్రభుత్వం రూ.370 కోట్లు ఎందుకు విడుదల చేసినట్లు? మిగిలిన రూ.280 కోట్లు దారి మళ్లినట్లే. ఎంవోయూ, జీవో ప్రకారం అందచేయాల్సిన సాంకేతికతను సీమెన్స్, డిజైన్ టెక్‌లు అందించలేదన్నది వాస్తవం. అయితే సీఐడీ ఈ అంశాన్ని లేవనెత్తలేదని హైకోర్టు తన తీర్పులో చెప్పింది. వాస్తవానికి రిమాండ్‌లోనూ, హైకోర్టు వాదనల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తాం. ఫోరెన్సిక్ ఆడిట్‌ను ప్రతికూల కోణంలో చూడటం ద్వారా హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించినట్లయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొత్తం విజయవంతమైందని, దీని ద్వారా 2.13 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు తేల్చింది. ఇలా చెప్పడం ద్వారా హైకోర్టు తప్పు చేసింది. హైకోర్టు చెప్పింది ఎంతమాత్రం వాస్తవం కాదు. అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చే అధికారం చంద్రబాబుకు ఉందని హైకోర్టు తేల్చింది. ఒకవేళ అలాంటిది ఉందని అనుకున్నా, చంద్రబాబు తన, షెల్ కంపెనీల స్వీయ లబ్ధి కోసం దురుద్దేశపూర్వకంగా ఆ అధికారాన్ని ఉపయోగించారు. ఈ విషయాన్ని హైకోర్టు తన తీర్పులో పూర్తిగా విస్మరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్, డిజైన్‌టెక్ ఉద్యోగులు ఇచ్చిన వాంగ్మూలాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ప్రాజెక్టులో రాజకీయ జోక్యం ఉందని, ప్రాజెక్టు అమలుకు అడ్డువచ్చిన వారిని 24 గంటల్లో బదిలీ చేశారన్న వాంగ్మూలాలను పట్టించుకోలేద'ని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం!

'సీమెన్స్, డిజైన్‌టెక్ నుంచి రావాల్సిన 90 శాతం నిధులు రాలేదని, అందువల్ల ప్రభుత్వం చెల్లించాల్సిన 10 శాతం నిధులను చెల్లించడం సరికాదన్న అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి అభ్యంతరాలను చంద్రబాబు పట్టించుకోని విషయాన్ని హైకోర్టు పూర్తిగా విస్మరించింది. అవినీతి నిరోధక చట్టం మౌలిక సూత్రాల నుంచి, పబ్లిక్ సర్వెంట్ అధికారం దుర్వినియోగం వంటి వాటి నుంచి హైకోర్టు దూరంగా వెళ్లింది. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేసే విషయంపై హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతమాత్రం హేతుబద్ధమైనవి కావు. తన పీఏ పెండ్యాల శ్రీనివాస్ విదేశాలకు పారిపోవడం, కీలక నిందితులు సీఐడీ ముందుకు రాకపోవడం వంటి వాటి విషయంలో చంద్రబాబు పాత్ర ఉన్న విషయాన్ని హైకోర్టు పట్టించుకోలేదు. చంద్రబాబు రాజకీయంగా చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి. దర్యాప్తును ప్రభావితం చేయడం, సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తుకు విఘాతం కలిగేలా కొందరు నిందితులు మీడియా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాలు దర్యాప్తునకు సహకరించడం లేదు. చంద్రబాబుకు బెయిల్ కోసం కాకుండా క్లీన్‌చిట్ ఇచ్చే అంశంగా పరిగణించి ఆదేశాలు ఇచ్చినట్లు ఉంది. వీటన్నింటిరీత్యా చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వివరించింది.

క్వశ్చన్ ఆఫ్ లా..

హైకోర్టు తీర్పులో పలు అంశాలపై అనుమానాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. 'క్వశ్చన్ ఆఫ్ లా'కి సంబంధించి పలు ప్రశ్నలను సుప్రీంకోర్టు ఎదుట ఉంచింది. హైకోర్టు కసరత్తులో న్యాయపరమైన విధానం లోపించిందా? దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, నిందితుడి నేరానికి సంబంధించిన అంశాలపై హైకోర్టు వ్యాఖ్యలు న్యాయపరమైన అంశాలకు విరుద్ధంగా ఉన్నాయా? బెయిల్‌పై పిటిషనర్ల వాదనలు లేనప్పుడు హైకోర్టు విస్తృతమైన తీర్పు ఇవ్వగలదా? పీసీ చట్టం 1988 ప్రకారం అధికారిక నిర్ణయాల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని నిర్దోషిగా భావించొచ్చా? అధికారం, అధికార వినియోగం, అధికారిక పరిధి లేకపోవడం, అధికార సామర్థ్యాన్ని దుర్వినియోగం చేయడం, ఇతరులకు సొమ్ము రూపంలో లబ్ధి చేకూర్చడం తదితరాలపై హైకోర్టు నిర్ణయం సరైనదేనా?' అనే ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందుంచింది. నిరంజన్‌సింగ్ వర్సెస్ ప్రభాకర్ రాజారామ్, సుమిత్ శుభాచంద్ర గంగ్వాల్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో తీర్పులతోపాటు స్కిల్ స్కామ్ కేసులో సాక్ష్యాధారాలను వివరించే అంశాన్ని హైకోర్టు పదేపదే తిరస్కరించిందని పేర్కొంది. సంగీతబెన్ వర్సెస్ గుజరాత్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రస్తావిస్తూ ప్రస్తుత కేసులో హైకోర్టు ఆయా అంశాలను పరిశీలించకుండా బెయిల్ కేసును మినీ ట్రయల్‌గా మార్చిందని, ట్రయల్ కోర్టు పనితీరును విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ఒక్క కేసు పరిశీలనతోనే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టవచ్చని నివేదించింది.

చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ

- ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్
- ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు న్యాయస్థానం అనుమతి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న చంద్రబాబు సన్నిహితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీఐడీ దాఖలు చేసిన అటాచ్‌మెంట్ పిటిషన్‌ను ఆమోదిస్తూ న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు సహా పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును ఏ-25గా, ఏ-1గా వేమూరి హరికృష్ణకు చెందిన టెరా సాఫ్ట్ కంపెనీ, ఏ-18గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ ఉన్నారు. కుంభకోణంలో నిందితుల పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభించడంతో వారి ఆస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఏపీ, తెలంగాణలో టెరాసాఫ్ట్ కంపెనీ, తుమ్మల గోపీచంద్ తదితరుల పేరిట ఉన్న రూ.114 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను హోం శాఖ ఆమోదించింది. దాంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు న్యాయస్థానం అనుమతినివ్వడంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ సిద్ధమవుతోంది.

చంద్రబాబు పన్నాగమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎం చంద్రబాబు తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్‌నెట్ టెండర్లను కట్టబెట్టారు. మొత్తం రూ.3,300 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మొదటిదశ కింద రూ.330 కోట్ల ప్రాజెక్టును టెండర్లలో ఎల్-1గా వచ్చిన బిడ్డర్‌ను కాదని మరీ టెరాసాఫ్ట్‌కు కట్టబెట్టారు. అందుకోసం బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీని ఆ జాబితా నుంచి తొలగించి, టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించారు. ఏపీ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణను ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఆయనకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొని, పనులు దక్కించుకుంది. ఇది పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధం. టెరాసాఫ్ట్ కంపెనీ పనులు కూడా నాసిరకంగా చేసి, రూ.144.53 కోట్లను దారి మళ్లించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

అటాచ్ చేయాలని నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఇంటి స్థలం
- కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెపటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్లు, ఆయన పేరిటే యూసుఫ్‌గూడలో ఉన్న మరో ఫ్లాట్
- తుమ్మల గోపీచంద్ భార్య పావన దేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి

ఇళ్లపైకి 'పచ్చ'దొంగలు.. జాగ్రత్త!

ఒకేసారి ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుట్ర. 'లేని మేనిఫెస్టో పేరుతో ఇళ్లల్లోకి జొరబడుతున్న పచ్చ దొంగలు'

- బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బురిడీ
- వచ్చే ఐదేళ్లలో లక్షల్లో లబ్ధి అంటూ ప్రజలకు ప్రలోభాలు
- ఇది సైబర్ క్రైం కిందకు వస్తుంది.. ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కూడా..
- ఓటరు కార్డు తీసుకుని ఈసీ నిబంధనల ఉల్లంఘన, ప్రజల ప్రాథమిక హక్కులకూ భంగం
- మాయల పకీరు చేతిలో ప్రజల డేటా.. అందరూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల విజ్ఞప్తి



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైభవంగా మహాపాదయాత్ర

- అట్టహాసంగా సాగిన టోంకిని హనుమాన్ పాదయాత్ర
- 'జైహనుమాన్.. జైశ్రీరాం..' నినాదాలతో హోరెత్తించిన భక్తులు
- సందడిగా మారిన రహదారులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

సిర్పూర్(టి)/చింతలమానెపల్లి: జైహనుమాన్.. జైశ్రీరాం నినాదాలతో టోంకిని ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తుల రద్దీతో రహదారి సందడిగా మారింది. కార్తీక మాసం రెండో మంగళవారం సందర్భంగా కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకిని గ్రామంలోని శ్రీసిద్ధి హనుమాన్ ఆలయానికి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో 22వ మహాపాదయాత్ర నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొనడంతో కాగజ్‌నగర్ నుంచి టోంకిని వరకు రహదారి జనసంద్రంగా మారింది. కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి మండలాల నుంచి భక్తులు ఆలయానికి కాలినడకన తరలివచ్చి హనుమాన్ దర్శనం చేసుకున్నారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భజరంగ్‌దళ్, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, అన్నదానం చేపట్టారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హనుమాన్‌ను దర్శించుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు దీకొండ రమేశ్, మధుకర్, వెంకటేశ్, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు.



ఆలయంలో హనుమాన్ విగ్రహం



దర్శనం చేసుకుంటున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



భజన బృందం ఆధ్వర్యంలో గీతాలాపన

సేంద్రియ ఎరువు తయారీ పరిశీలన



ఎరువు తయారీ కేంద్రంలో అధికారులు

చెన్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామంలో రైతు గోనె సతీశ్‌కు చెందిన సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి జీ.కల్పన పరిశీలించారు. సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించారు. లాభాలపై రైతు అధికారులకు వివరించాడు. ఆమె వెంట ఏవో కవిత, ఏఈవోలు రాజశేఖర్, సాగర్ ఉన్నారు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- అదిలాబాద్ డీఈవో ప్రణీత
- ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ప్రారంభం



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలను జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. భరద్వాజ మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, చెస్ పోటీలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులు రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతారని వెల్లడించారు. అధ్యాపకులు రాజ్‌కుమార్, వీరస్వామి, సుజై, రాజన్న, సురేశ్, రాజేశ్, కుమారస్వామి, ప్రవీణ్, గజానంద్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర మంత్రి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహారాష్ట్ర అటవీ, సాంస్కృతిక, మత్స్య, పరిశ్రమల శాఖ మంత్రి సుధీర్ మునగంటివార్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య బాధ్యులు ఆయనను సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉండి సంఘం పటిష్టతకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



దర్శించుకుంటున్న సుధీర్ మునగంటివార్

ఇటు ఓటరు.. అటు పోలింగ్ కేంద్రం.. మధ్య.. మానేరువాగు

- ఓటుహక్కు వినియోగించాలంటే వాగు దాటాల్సిందే..
- అందుకోసం 75 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే..
- తెలంగాణ ఏర్పడి, ప్రభుత్వం, పాలకులు మారినా దారి లేదు
- ముత్తారం మండలం శాత్రజ్‌పల్లి గిరిజనుల గోస ఇది..


గ్రామం	శాత్రజ్‌పల్లి
జనాభా	142
నివాసాలు	38
ఓటర్ల సంఖ్య	93



శాత్రజ్‌పల్లి గిరిజన గ్రామం ఇదే..



మానేరు నీళ్లలో నడుచుకుంటు వెళ్తున్న గిరిజనులు



ఈ ఇసుకలోంచి నడిస్తేనే పారుపల్లికి చేరుకునేది

ముత్తారం(మంథని): అదో మా రుమూల గిరిజన గ్రామం. మానేరు అవల ఉంది. వర్షాకాలంలో వాగు ఉధృతి పెరిగితే రాకపోకలు స్తంభిస్తాయి. బాహ్య ప్రపంచంతో గిరిజనులకు సంబంధాలు తెగిపోతాయి. అడవిబిడ్డలు గ్రామ పంచాయతీ, మండల కార్యాలయాలకు అవసరాల కోసం రావాలంటే మానేరు దాటాల్సిందే.. వైద్యం, రేషన్ సరుకులు, నిత్యావసరాలకూ తమ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని మానేరు దాటాల్సిందే. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి, ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజనుల తిప్పలు తప్పలేదు. వాగుపై కల్వర్టు లేదా హైలెవల్ వంతెన నిర్మిస్తే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకున్న నాథుడే లేడంటున్నారు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాత్రజ్‌పల్లివాసులు.


మంథని నియోజకవర్గం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా..

- మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని శాత్రజ్‌పల్లి జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంచపల్లికి 5కిలో మీటర్ల దూరంలో ఉంది.
- ఆ ఊరు గిరిజనులు మూడు కిలోమీటర్ల కాలినడకన మానేరు దాటి పారుపల్లి గ్రామ పంచాయతీ, మండల కార్యాలయానికి చేరుకోవాలి.
- ఇందుకోసం 10 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాలి
- ప్రతినెలా రేషన్ సరుకులు, నిత్యావసరాలకూ ఇదే పరిస్థితి
- విద్య, అత్యవసర వైద్య సేవలకూ ఇలా తిప్పలు పడాల్సిందే.
- ఇక వర్షాకాలంలో అయితే మానేరు ఉప్పొంగి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి.
- బాధలు తొలగిపోయేందుకు భూపాలపల్లి జిల్లాలో విలీనం చేస్తామనే ప్రభుత్వ ఆదేశాలను గిరిజనులు తిరస్కరించి పెద్దపల్లి జిల్లాలోనే ఉంటామని తేల్చిచెప్పారు.

ఓటు వేసేందుకు 75 కి.మీ. ప్రయాణించాల్సిందే

శాత్రజ్‌పల్లి గిరిజనులు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేయాలంటే సుమారు 75 కిలో మీటర్లకుపైగా దూరంలోని పారుపల్లికి రావాల్సిందే. ఇందుకోసం జయశంకర్ జిల్లా టేకుమట్ల మండలం నుంచి కరీంనగర్ జిల్లా వావిలాల మీదుగా పెద్దపల్లి జిల్లా ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలం పారుపల్లికి రావాలి. ఓడేడ్ మానేరు వద్ద వంతెన నిర్మాణం పూర్తిచేసినా ప్రయాణం 20 కి.మీ. ఉండేది. ఆ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. గ్రామ సందర్శనకు ఇటీవల ట్రాక్టర్‌పై వెళ్లిన ఎన్నికల అధికారులు.. మానేరులో నీటిఉధృతికి భయపడి కొద్దిదూరం వెళ్లాక వెనుదిరుగారు.


రవాణా సౌకర్యం లేదు



మానేరుతో పదేళ్లనుంచి అరిగోస పడ్తున్నం. తెలంగాణ వచ్చాక సర్కారు ఏర్పడింది. పాలకులు మారిండ్రు. మానేరుపై వంతెన కట్టిస్తరని సంబురపడ్డం. ఎన్నికల సమయంలో తప్ప పాలకులు, అధికారులు మా ఊరు వైపు చూడరు. మానేరుపై వంతెన కట్టిస్తే రాకపోకలు సులభమవుతయి.

–భీముడి గట్టయ్య, గ్రామస్తుడు

వాళ్లకు ఓట్లే కావాలి



నాయకులకు ఓట్లు తప్ప మా సమస్యలు పట్టవు. ఓటు వేయాలంటే మానేరు వాగు దాటాలి. మా ఊరు సందర్శనకు వచ్చిన అధికారులే సగం దూరం నుంచి పారిపోయిండ్రు. మా ప్రాణాలు అరచేతి పెట్టుకుని వాగు దాటిపోతున్నం. అధికారులు ఇప్పటికైనా ప్రత్యామ్నాయం చూపాలె.

– ముంజం సరోజన, గ్రామస్తురాలు

రేషన్ కోసం ఇబ్బంది



రేషన్ సరుకుల కోసం ప్రతినెలా మా ప్రాణాలను లెక్కచేయకుండా మానేరు దాటి వస్తున్నం ఒక్కోసారి సర్పంచి మానేరు వరకు ట్రాక్టరులో తీసుకువచ్చి సరుకులు ఇస్తరు. వాగు ఉధృతి ఉంటే సరుకులు బందైతయి. బ్యాంకు, పంచాయతీ, మండల కార్యాలయాలు, వైద్యం కోసం ఏటా తిప్పలు పడుడే.

– పల్లే రాజమ్మ, గ్రామస్తురాలు



లీలారాణి

లైఫ్ స్టయిల్ మారుద్దాం..!

ఈ రోజుల్లో...
ఏం తింటున్నాం, ఎలా ఉంటున్నాం!?
పిల్లలు ఎలా ఎదుగుతున్నారు?
ఉరుకుల పరుగుల జీవనంలో ఇవన్నీ సహజమే అని వదిలేస్తే ..
'భవిష్యత్తు తరాలు ఎదుర్కొనే సమస్యలు అన్నీ ఇన్నీ కావు' అంటున్నారు లీ హెల్త్ డొమైన్ డైరెక్టర్ లీలారాణి. ఆరోగ్య విభాగంలో న్యూట్రాస్యుటికల్, ఫుడ్ సప్లిమెంట్ ఉత్పత్తుల పరిశోధన, అభివృద్ధిపై దృష్టిపెట్టే ఈ సంస్థ ద్వారా మన జీవనవిధానం వల్ల ఎదుర్కొనే సమస్యలకు మూలకారణాలేంటి అనే విషయంపై డేటా సేకరించడంతో పాటు, అవగాహనకు కృషి చేస్తున్నారు. హెల్త్ అండ్ వెల్‌నెస్, సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ చాంబర్స్, విశాఖపట్నం జోన్ చెయిర్ పర్సన్‌గానూ ఉన్న లీలారాణి మహిళలు, పిల్లల ఆరోగ్య సమస్యలపై డేటా వర్క్, బేసిక్ టెస్ట్‌లు చేస్తూ తెలుసుకుంటున్న కీలక విషయాలను ఇలా మన ముందుంచారు..



"ప్రస్తుత జీవన విధానం, తీసుకునే ఆహారం వల్ల పిల్లలకు ఎలాంటి దీర్ఘకాలిక జబ్బులు వస్తున్నాయి అనే అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు స్కూళ్లవైపుగా డేటా సేకరించాలనుకున్నాం. ముందు 8-10 ఏళ్ల పిల్లలకు స్కూళ్లలో ఇటీవల ప్రారంభించాం. ఊర్జా ప్రాజెక్టులో భాగంగా బేసిక్ న్యూట్రిషన్ ఫోకస్డ్ ఫిజికల్ ఎగ్జామినేషన్స్ చేస్తున్నాం. ఈ టెస్ట్ ద్వారా పిల్లల్లో .. ఆహారానికి సంబంధించిన సమస్యలు ఏమున్నాయి, తల్లిదండ్రులు- కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఎంత సమయం గడుపుతున్నారు, శారీర చురుకుదనం, డిజిటల్ ఎక్స్‌పోజర్ ఎలా ఉంది, నిద్ర సమస్యలు ఏంటి.. ఇలా కొన్నింటితో ఒక ప్రశ్నాపత్రం రూపొందించాం. పిల్లల దగ్గర సమాధానాలు తీసుకొని, వాటిలో ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టాం. ఆంధ్రా, తెలంగాణలోని స్కూళ్లలో పెద్ద స్థాయిలో డేటా తీసుకోవాలని ప్రారంభించాం. ఇప్పుడైతే 200 మంది పిల్లలతో విశాఖపట్నంలో ఈ డేటా మొదలుపెట్టాం.

8-15 ఏళ్ల వయసులో ..

పిల్లలతో కలిసి రోజువారి జీవనవిధానం గురించి చర్చించినప్పుడు 'మా పేరెంట్స్ బిజీగా ఉంటారు. వాళ్లు డిజిటల్ మీడియాను చూస్తారు, మేమూ చూస్తాం.' అని చెబుతున్నారు. ఈ వయసు పిల్లలు సోషల్ మీడియాలో అకౌంట్స్ ఉండటమే కాకుండా, చురుకుగా ఉంటున్నారు. కారణం అడిగితే – 'అమ్మానాన్నలను ఏదైనా విషయం గురించి అడిగితే చెప్పరు. అందుకని డిజిటల్‌లో షేర్ చేసుకొని తెలుసుకుంటాం' అంటున్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు ఈ విధంగా పెంచుకుంటూ సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఫిజికల్ యాక్టివిటీకి సంబంధించి స్కూళ్లలో ఎలాంటి గేమ్స్ ఉన్నాయి, ఇంటి బయట ఎలా ఉంటున్నారు,... అనేది కూడా ఒక డేటా తీసుకుంటున్నాం. 8-15 ఏళ్ల లోపు పిల్లల్లో ఫిజికల్ యాక్టివిటీ ఎక్కువ లేకపోవడం వల్ల వారు యంగేజ్‌కు వచ్చేసరికి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాం.

ఊబకాయమూ సమస్యే

ఎగువ మధ్యతరగతి పిల్లల్లో ఊబకాయం అనేది ప్రధాన సమస్యగా ఉంది. డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన టెస్ట్‌లు చేసినప్పుడు ఈ విషయాలు గుర్తించాం. వాటిలో శారీరక చురుకుదనం లోపించడమే ప్రధానంగా కారణంగా తెలుసుకున్నాం. బయట జంక్ ఫుడ్ నెలలో ఎన్ని సార్లు తీసుకుంటున్నారు అనేదానిపైన రిపోర్ట్ తయారుచేశాం. పిల్లల నుంచి సేకరించిన రిపోర్ట్‌ను ఆ స్కూళ్లకు ప్రజెంట్ చేస్తున్నాం. ఆ రిపోర్ట్‌లో 'మీ స్కూల్ కరిక్యులమ్‌లో చేర్చదగిన అంశాలు అని ఓ లిస్ట్ ఇస్తున్నాం. వాటిలో, చురుకుదనం పెంచే గేమ్స్‌తో పాటు న్యూట్రిషన్ కిచెన్, గార్డెనింగ్.. వంటివి ఒక ప్రాక్టీస్‌గా చేయించాలని సూచిస్తున్నాం.

ముందుగా 40 ఏళ్ల పైబడినవారితో..

రెండేళ్ల క్రితం ఒక కార్పోరేట్ సెక్టార్‌లో దాదాపు పది వేల మందికి (40 ఏళ్ల పైబడిన వారికి) ఎన్జీవోలతో కలిసి బీఎమ్‌డి టెస్ట్ చేశాం. వీరిలో బోన్‌డెన్సిటీ తక్కువగా ఉండటమే కాకుండా, మానసిక ప్రవర్తనలు, నెగిటివ్ ఆలోచనలు, స్ట్రెస్ ఇండెక్స్, బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్.. వంటివి దేని వల్ల వస్తున్నాయి అనేది తెలుసుకున్నాం. నిజానికి 60 ఏళ్ల పైబడిన వారి బోన్ డెన్సిటీ బాగుంది. కారణం, ఆ రోజుల్లో వారు చేసే శారీరక శ్రమయే కారణం. ఇప్పుడది తగ్గిపోయింది.

పరిష్కారాలూ సూచిస్తున్నాం..

ఎక్కడైతే టెస్ట్‌లు చేశామో, వారి జీవనవిధానికి తగిన సూచనలూ చేస్తున్నాం. ఆరోగ్య సమస్యలు ఏవి అధికంగా వస్తున్నాయో తెలుసుకుని, వాటిని పరిష్కరించుకునే విధానాలను సూచిస్తున్నాం. చాలావరకు ఈ వయసు వారిలోనూ ఫిజికల్ యాక్టివిటీ లేకపోవడం వల్లే సమస్యలు. ముఖ్యంగా కార్పొరేట్ సెక్టార్ నుంచి ఈ సమస్య అధికంగా ఉంది. పని ప్రదేశంలో శరీర కదలికలు లేకపోడం, అక్కడి వాతావరణం, స్క్రీన్ నుంచి వచ్చే సమస్యలు, డిజిటల్ ఎక్స్‌పోజర్.. వీటన్నింటినీ ఒక్కొక్కరి నుంచి తీసుకొని వారికి తగిన సూచనలు ఇస్తూ వచ్చాం. సమస్యలు ఎక్కువ ఉన్నవారి బాల్య దశ గురించి అడిగితే మరికొన్ని ఆసక్తికర విషయాలు తెలిశాయి.

బాల్య దశ కీలకం

పెద్దవాళ్లలో సమస్యలు గమనించినప్పుడు వారి బాల్య దశ కీలకమైందని గుర్తించాం. దీంతో పిల్లల్లోనే ముందుగా సమస్యను పరిష్కరిస్తే మంచిదని. పిల్లల్లో పరీక్షలు చేసినప్పుడు వారిలో బోన్ డెన్సిటీ సమస్య కనిపించింది. దీని గురించి డాక్టర్లతో చర్చించినప్పుడు మూల కారణం ఏంటో తెలిసింది. ఒకప్పుడు గ్రామాల్లో పిల్లలు పరిగెత్తడం, గెంతడం, దుమకడం.. వంటివి చాలా సహజసిద్ధంగా జరిగిపోయేవి. వారి ఆటపాటల్లో శారీరక వ్యాయామం చాలా బాగుండేది. అది ఈ రోజుల్లో లేదు. క్రీడలు కూడా వృత్తిపరంగా ఉన్నవే తప్ప ఆనందించడానికి లేవు. ఒక స్ట్రెస్ నుంచి రిలీవ్ అయ్యే ఫిజికల్ యాక్టివిటీ రోజులో ఇన్ని గంటలు అవసరం అనేది గుర్తించి, చెప్పాలనుకున్నాం. భవిష్యత్తులో రాబోయే ఆరోగ్యసమస్యలను భరించడం కన్నా ముందే జాగ్రత్తపడటం మంచిది.

మధ్య తరగతే కీలకం

మధ్యతరగతి, దానికి ఎగువన ఉన్న పిల్లల్లో శారీరక చురుకుదనం లోపం ఎక్కువ కనిపించింది. వారి ఎముక సామర్థ్యం బలంగా లేకపోతే భవిష్యత్తులో ఎన్నో ఆరోగ్యసమస్యలను ఎదుర్కోక తప్పదు. పిల్లలు ఎదిగే దశలో వారి ఆహారం, అలవాట్లు బాగుండేలా చూసుకోవాలి. ఈ విషయంలో కార్పొరేట్ కన్నా ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలు బాగానే ఉన్నారు. ఈ అన్ని విషయాలపై ఇంకా చాలా డేటా సేకరించాల్సి ఉంది. ముందు మానసిక సమస్యలు అనుకోలేదు. కానీ, సైకలాజికల్ సమస్యలు చాలా ఎక్కువ ఉన్నాయి. కుటుంబంలో ఉన్నవారితో సరైన ఇంటరాక్షన్స్ తగ్గిపోయినట్టుగా తెలుస్తోంది. ఎక్కువ డిజిటల్ మీడియాలో ఉండటం వల్ల కంటి సమస్యలు, కుటుంబంలో గ్యాప్ ఏర్పడం వంటివి జరుగుతున్నాయి. ఈ విషయాలను అవగాహన చేసుకొని, మన జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది' అని తెలియజేశారు లీలారాణి.

– నిర్మలారెడ్డి



న్యూస్‌మేకర్

కంగ్రాట్యులేషన్స్ ఏక్తా కపూర్

భారతీయ టెలివిజన్ రంగాన్ని మహారాణిలా ఏలుతున్న ఏక్తా కపూర్ చరిత్ర సృష్టించింది.
అమెరికా వెలుపల వివిధ దేశాల్లోని టెలివిజన్ కంటెంట్ నుంచి ఎంచి ఇచ్చే ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్సులో ఆమెను 'డైరెక్టరేట్ అవార్డ్' వరించింది.
ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయురాలు ఏక్తా.
మంగళవారం తెల్లవారుజామున (అమెరికాలో సోమవారం రాత్రి) న్యూయార్క్‌లో ఈ అవార్డు బహూకరించారు.

ఏక్తా కపూర్ (48)కు ముందు అభినందనలు చెప్పాలి. టెలివిజన్ రంగంలో సుదీర్ఘకాలం నిలిచినందుకు, ఢక్కామొక్కీలు తిని విజయం సాధించినందుకు, వేల మందికి ఉపాధి కల్పించినందుకు, టెలివిజన్ చానల్స్ ప్రైమ్‌టైమ్‌ను ఏదో ఒక కాలక్షేపంతో నింపినందుకు, ఇంకా కొనసాగుతున్నందుకు. ఇప్పటివరకూ ఆమె 17,000 గంటల టెలివిజన్ కంటెంట్‌ను ప్రొడ్యూస్ చేసిందంటే దాని వెనుక శ్రమను, ప్యాషన్‌ను, వ్యాపార శ్రద్ధను అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు... 45 సినిమాలను కూడా ఆమె ప్రొడ్యూస్ చేసింది. వ్యాపార ఎత్తుగడల్లో భాగంగా నాసిరకం/సరసమైన కంటెంట్‌ను తయారు చేసి విమర్శలు ఎదుర్కొన్నా అన్ని రకాల జానర్స్‌లో కంటెంట్ తయారు చేస్తాను... దేనికి తగ్గ ప్రేక్షకులు దానికి ఉంటారు అనే ధోరణిలో ముందుకు దూసుకుపోతోందామె. అందుకే ఆమె కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

అంతర్జాతీయ గుర్తింపు

అమెరికాలోని 'ఇంటర్నేషనల్ అకాడెమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ప్రతి సంవత్సరం అమెరికా బయటి దేశాలలో టెలివిజన్ రంగంలో విశేష కృషి చేసిన వారికి 'ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డు'లను బహూకరిస్తుంది. ఇవి టెలివిజన్ ఆస్కార్స్‌లాంటివి. ఈ అవార్డులు భారతీయులకు వరించడం తక్కువ. వివిధ కేటగిరీల్లో ఇచ్చే ఈ అవార్డుల్లో విశిష్టమైన 'డైరెక్టరేట్ అవార్డు'ను ఈ సంవత్సరానికి ఏక్తా కపూర్‌కు ప్రకటించారు. ఈ అవార్డు పొందిన తొలి భారతీయ మహిళ ఏక్తా. అకాడెమీ సీఈవో బ్రూస్ ప్రైస్నర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారతీయ మాస్ ప్రేక్షకులను, సౌత్ ఏసియా ప్రేక్షకులను ఏక్తా కపూర్ తన సీరియళ్ల ద్వారా చేరగలిగింది. టెలివిజన్ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉంది' అని కొనియాడారు. న్యూయార్క్‌లో అవార్డు అందుకున్న ఏక్తా 'ఈ అవార్డు నా మాతృదేశం కోసం' అంటూ భావోద్వేగానికి గురైంది.

భిన్న వ్యక్తిత్వం

ఏక్తా కపూర్ టెలివిజన్ రంగంలో (1995) అడుగు పెట్టే సమయానికి అదంతా పురుష ప్రపంచం. తండ్రి జితేంద్ర (నటుడు) దగ్గర 50 లక్షలు తీసుకొని 'బాలాజీ టెలి ఫిల్మ్స్' కింద కొన్ని పైలట్ ప్రాజెక్ట్స్ తీస్తే అన్నీ రిజెక్ట్ అయ్యాయి. దాంతో 50 లక్షలూ వృథా అయ్యాయి. ఆ తర్వాత ఆమె 'మానో యా మానో', 'హమ్ పాంచ్' సీరియల్స్‌తో హిట్స్ మొదలుపెట్టింది. 2000 సంవత్సరంలో 'క' అక్షరం సెంటిమెంట్‌తో మొదలెట్టిన 'క్యోంకి సాస్‌భీ కభీ బహూ థీ' టెలివిజన్ చరిత్రను తిరగరాసింది. ఇది పొందినంత టీఆర్పీ మరే సీరియల్ పొందలేదు. 'కహానీ ఘర్ ఘర్ కీ', 'పవిత్ర రిష్తా', 'కుంకుమ్ భాగ్య' లాంటి 134 సీరియల్స్ ఇప్పటి వరకూ తీసింది. పెద్ద పెద్ద సెట్లు, మహిళా పాత్రధారులకు ఖరీదైన చీరలు, ఆభరణాలు, కుటుంబ రాజకీయాలు ఇవన్నీ ఏక్తా మొదలుపెట్టి మొత్తం దేశంలో అదే ట్రెండ్ ఫాలో అయ్యేలా చేసింది.

సరోగసి ద్వారా

ఏక్తా వివాహం చేసుకోలేదు. కాని 2019లో సరోగసి ద్వారా కుమారుడికి జన్మనిచ్చింది. కొడుక్కి తండ్రి పేరు 'రవి కపూర్' అని పెట్టుకుంది. అవార్డు వేదిక మీద ఏక్తా మాట్లాడుతూ 'మా నాన్నకు, నేనిక్కడ ఉంటే నా కొడుకు కోసం బేబీ సిట్టింగ్ చేస్తున్న మా అన్నయ్య తుషార్‌కపూర్‌కు కృతజ్ఞతలు' అంది.

ప్రస్తుతం సొంత ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆల్ట్ బాలాజీ కోసం ఏక్తా ఎక్కువగా కంటెంట్‌ను తయారు చేస్తోంది.

యూత్ పల్స్

నవ యువ నవ్వోదయం

బాధ పడితే బాధ మాత్రమే మిగులుతుంది.

అలా కాకుండా రూల్స్ బ్రేక్ చేసి నవ్వితే ఏమవుతుంది?

'అలా ఎలా కుదురుతుంది? బాధ బాధే, నవ్వు నవ్వే' అని గట్టిగా అనుకున్న బాధాసర్పదష్టులు కూడా వీరి హాస్యం ముందు మౌనంగా ఉండలేకపోయారు. హాయిగా నవ్వేసి ఆ కొద్ది సమయమైనా బాధ నుంచి విముక్తి పొందారు.

యువతరం ఎక్కడ ఉంటుందో నవ్వు అక్కడ ఉంటుంది.

ఆ నవ్వునే పెట్టుబడిగా పెట్టి యువతరంలో ఎంతోమంది కామెడీ కంటెంట్ క్రియేటర్‌లుగా కీర్తి, డబ్బు సంపాదిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా కొత్త వాళ్లు నవ్వుల రంగస్థలంపై మెరుస్తున్నారు. తమదైన హాస్యాన్ని పరిచయం చేస్తున్నారు...

సోషల్ మీడియాలోని రకరకాల విభాగాల్లో కామెడీ అగ్రస్థానంలో ఉంది. మిథిక ద్వివేది, రాజ్ గ్రోవర్, సలోని గౌర్, విష్ణు కుషాల్‌లాంటి యంగ్ కామెడీ కంటెంట్ క్రియేటర్‌లు దూసుకుపోతున్నారు. వీరిలో ఎక్కువ మంది లాక్‌డౌన్ టైమ్‌లో ఫేమస్ అయిన వారు. అప్పటి రోజుల్లో నుంచే కడుపుబ్బా నవ్వించే షార్ట్-ఫామ్ వీడియో స్నాప్‌లను రూపొందించారు.

బ్రాండ్ ప్రమోషన్‌లలో కామెడీ ఇన్‌ఫ్లూయెన్సర్‌లను ఏరి కోరి ఎంపిక చేసుకుంటున్నారు.

'కామెడీ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు సత్తా ఉన్న రచయితలు. ఆడియెన్స్‌ను ఎలా ఆకట్టుకోవాలో వారికి బాగా తెలుసు. ప్రమోషన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్‌ను సృజనాత్మకంగా జోడిస్తున్నారు' అంటున్నాడు సోషల్ సమోస సీయివో హితేష్ రజ్వానీ.

ఒకప్పటి టీవీ సీరియల్ 'కస్తూరి జిందగీ' లోని పాపులర్ పాత్రను చిన్నప్పుడు అనుకరిస్తూ అందరినీ నవ్వించేది కరిష్మా గంగ్వాల్.

తాను ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ కామెడీని కెరీర్‌గా తీసుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత రేడియో వేదికగా తన టాలెంట్‌ను శ్రోతలకు పరిచయం చేసింది.

అప్పటి వరకు తన గొంతునే పరిచయం చేసిన కరిష్మ ప్రేక్షకులకు ముఖ పరిచయం చేయాలనుకుంది. కోవిడ్ టైమ్‌లో కంటెంట్ క్రియేషన్‌కు శ్రీకారం చుట్టింది.

అత్తా–కోడళ్ల సంభాషణతో తొలిసారిగా ఒక ఫన్నీ వీడియో చేసింది. 'ప్రేక్షకులు ఏమనుకుంటారో ఏమో' అని సందేహించింది. అయితే తన సోదరి సలహాతో సోషల్‌మీడియాలో పెట్టింది. ఆ ఫన్నీ వీడియో 1.3 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకొని కరిష్మలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

కరిష్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో 6.4 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు.

జమ్మూలో పుట్టి పెరిగింది కరిష్మ. డాక్టర్లు, ఇంజనీర్‌ల కుటుంబం వారిది. తాను కూడా డాక్టరో, ఇంజనీరో కావాల్సిందే అన్నట్లుగా ఉండేది పరిస్థితి. అయితే తల్లిదండ్రులను ఒప్పించి కామెడీనే తన కెరీర్ చేసుకుంది.

తన మిమిక్రీ స్కిల్స్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తోంది చాందిని బాబ్బ. 'ఆలియాభట్‌ను అనుకరించాలంటే చాందిని మాత్రమే' అన్నంతగా పేరు తెచ్చుకుంది. చిన్నప్పుడు తన ఉపాధ్యాయులు, చుట్టాలు పక్కాలను కెమెరా ముందు అనుకరిస్తూ అందరినీ తెగ నవ్వించేది చాందిని.

ఇరవైనాలుగు సంవత్సరాల చాందిని 2016లో కామెడీ కంటెంట్ క్రియేషన్ ప్రారంభించింది. న్యాయశాస్త్రం చదివిన చాందిని అమెజాన్ మినీ టీవీ కామెడీ షో 'కానిస్టేబుల్ గిర్పాడే'లో నటించింది.

తీరిక సమయంలో సలోని గౌర్ ఫన్నీ వీడియోలు బాగా చూసేది. 'నీలో నవ్వించే టాలెంట్ ఉంది' అని ఫ్రెండ్స్ తరచుగా అనడంతో 'ఒకసారి ట్రై చేసి చూద్దాం' అంటూ రంగంలోకి దిగింది.

తక్కువ టైమ్‌లోనే కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా సక్సెస్ సాధించింది. సలోనికి 1.3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు.

మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సలోని అబ్జర్వేషనల్ కామెడీని తన బలంగా చేసుకుంది. ఇరవై సంవత్సరాల వయసులో సోనీ లివ్‌లో 'అన్‌కామన్ సెన్స్ విత్ సలోని' పేరుతో సొంత షో స్టార్ట్ చేసింది.

'ఒక్కరోజు నవ్వకపోయినా ఆ రోజు వృథా అయినట్లే' అంటాడు చార్లీ చాప్లిన్.

అయితే నవ్వడం ఎంత ఈజియో, నవ్వించడం అంత కష్టం. ఆ కష్టాన్ని ఇష్టంగా భుజాల కెత్తుకుంటున్నారు కామెడీ కంటెంట్ క్రియేటర్‌లు. ఒకవైపు సీనియర్‌ల వీడియోలు చూస్తూ ఎంజాయ్ చేస్తూనే మరోవైపు సృజనాత్మక ఆలోచనలతో తమదైన కామెడీ కంటెంట్‌ను క్రియేట్ చేస్తున్నారు.

'ప్రేక్షకుల అర క్షణం నవ్వు చాలు వెయ్యి ఏనుగుల బలం తెచ్చుకోవడానికి' అంటుంది లక్నోకు చెందిన 19 సంవత్సరాల మిథిక ద్వివేది. ఈ కామెడీ కంటెంట్ క్రియేటర్‌కు వేలాదిమంది ఫాలోవర్‌లు ఉన్నారు.

కొత్తదనం కావాలి

కామెడీ పుస్తకాలు చదివి, సీరియల్స్ చూసి కామెడీని సృష్టించలేం. జనాల్లోకి వెళ్లి పరిసరాలను గమనించాల్సిందే. ఆసక్తికరమైన సంభాషణలు, పదాలు విన్నప్పుడు పెన్ను పేపర్ తీసుకొని స్క్రిప్ట్ రాస్తుంటాను. ఆ తరువాత మార్ఫ్స్, ఎడిట్స్, అప్‌లోడ్స్‌కు వెళతాను. ఎప్పటికీ ఒకే విధంగా కాకుండా కొత్తదనం ఉండేలా జాగ్రత్త పడతాను.

– కరిష్మ గంగ్వాల్, కామెడీ కంటెంట్ క్రియేటర్

నవ్వడం అదృష్టం... నవ్వించడం అంతకంటే అదృష్టం

లా లో మాస్టర్స్ డిగ్రీ చేసినప్పటికీ నా ఆలోచనలన్నీ కంటెంట్ క్రియేషన్ చుట్టే తిరుగుతుంటాయి. ఎవరో చెప్పింది వినడం కంటే మనసు చెప్పింది వినడమే మంచిదని నా నమ్మకం. ఐడియాల కోసం కొన్నిసార్లు 'ఇలా అయితే ఎలా ఉంటుంది' అంటూ కసరత్తులు చేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మాత్రం స్పాంటేనియస్‌గా వస్తుంటాయి. నా బెస్ట్ కంటెంట్‌లో ఎక్కువ శాతం స్పాంటేనియస్‌గా వచ్చిందే. నవ్వడం అదృష్టం. నవ్వించగలగడం అంతకంటే అదృష్టం.

– చాందిని, కామెడీ కంటెంట్ క్రియేటర్




కంటెంట్ కోసం...

కామెడీ అయినా సరే కంటెంట్ అనేది నేల విడిచి సాము చేయకూడదు. సహజంగా ఉండాలి. ప్రేక్షకులు దానితో రిలేట్ కావాలి. కంటెంట్ కోసం ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. మన ఇంట్లో కావచ్చు, పక్కింట్లో కావచ్చు, వెళ్లిన ఫంక్షన్ కావచ్చు....మనకు కావాల్సిన కంటెంట్ దొరుకుతుంది. దాన్ని మన స్టైల్లో ఎలా ప్రజెంట్ చేస్తున్నామనేదే ముఖ్యం.

– సలోని గౌర్, కామెడీ కంటెంట్ క్రియేటర్

బ్యూటిప్స్ - హెయిర్ కేర్



- మూడు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్,ఒక టీ స్పూను తేనె తీసుకుని రెండింటినీ కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తుంటే పొడిబారిపోయిన జుట్టు కూడా చాలా అందంగా తయారవుతుంది.
- మూడు టీ స్పూన్ల ఆముదాన్ని గోరువెచ్చ చేసుకుని, తలకు పట్టించి మసాజ్ చేసుకోవాలి. తర్వాత జుట్టంతా చిక్కు లేకుండా దువ్వెనతో నెమ్మదిగా దువ్వుకుని, వేడి నీటిలో తడిపిన టవల్‌ను తలకు చుట్టి పావుగంట పాటు ఆవిరి పట్టించాలి. తర్వాత నీటితో జుట్టును కడిగేసి, మర్నాడు షాంపూతో తలస్నానం చేయాలి.
- రెండు టీ స్పూన్ల కొబ్బరి నూనెలో టీస్పూను నిమ్మరసం వేసి తలకు మసాజ్ చేసుకోవాలి.
- కొబ్బరి నూనెలో కొద్దిగా మెంతులు లేదా కరివేపాకు పేస్ట్ లేదా వేపాకుల పేస్ట్ కలిపి గోరువెచ్చగా అయ్యేంతవరకూ వేడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కేశాలకు పట్టించి మసాజ్ చేసి మర్నాడు షాంపూతో తలస్నానం చేయాలి.
- కప్పు నీటిలో టీ స్పూను నిమ్మరసం, రెండు టీ స్పూన్ల ఆపిల్ సీడర్ వెనిగర్ (మార్కెట్‌లో లభిస్తుంది) వేసి కలుపుకోవాలి. షాంపూతో తలస్నానం చేసిన పది నిమిషాల తర్వాత ఈ మిశ్రమంతో తలను తడపాలి. ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా, మెరుస్తూ కనబడుతుంది.



జాతీయ హాకీ శిక్షణ శిబిరానికి రజని

వచ్చే నెలలో స్పెయిన్‌లో జరిగే ఐదు దేశాల హాకీ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఈనెల 22 నుంచి డిసెంబర్ 10 వరకు బెంగళూరులో జాతీయ శిక్షణ శిబిరం నిర్వహించనుంది. 34 మందితో కూడిన బృందంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోల్‌కీపర్ ఇతిమరపు రజని కూడా చోటు దక్కించుకుంది. ఐదు దేశాల హాకీ టోర్నీలో భారత్‌తోపాటు ఐర్లాండ్, జర్మనీ, బెల్జియం, స్పెయిన్ జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీ తర్వాత భారత్ జనవరిలో స్వదేశంలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో పోటీపడుతుంది.

రష్మిక శుభారంభం

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడి పాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-1, 7-5తో హైదరాబాద్‌కే చెందిన పేక్ హామేరా బహార్మస్‌పై గెలిచింది. ఈ మ్యాచ్‌లో రష్మిక రెండు ఏస్‌లు సంధించింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-0, 6-3తో ప్రతిభ-సహిత (భారత్) జోడీపై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది.



భారత ‘ఎ’ జట్టులో త్రిష



సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్ ‘ఎ’ మహిళల క్రికెట్ జట్టుతో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత ‘ఎ’ జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిషకు చోటు దక్కిందని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో కీలక సభ్యురాలిగా ఉంది. భారత్ ‘ఎ’-ఇంగ్లండ్ ‘ఎ’ జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు ముంబైలోని వాంఖెడే స్టేడియంలో నవంబర్ 29న, డిసెంబర్ 1న, డిసెంబర్ 3న జరుగుతాయి.

బీడబ్ల్యూఎఫ్ వార్షిక అవార్డు రేసులో సాత్విక్-చిరాగ్ జోడీ



న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వార్షిక అవార్డు రేసులో నిలిచారు. 2023 సంవత్సరానికిగాను సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిని ‘పెయిర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారం కోసం బీడబ్ల్యూఎఫ్ నామినేట్ చేసింది. భారత ద్వయంతోపాటు చెన్ కింగ్ చెన్-జియా ఇ ఫాన్ (చైనా), జెంగ్ సి వె-హువాంగ్ యా కియాంగ్ (చైనా), సియో సెంగ్ జే-చె యు జంగ్ (దక్షిణ కొరియా) జోడీలు కూడా ఈ అవార్డు కోసం బరిలో ఉన్నాయి. డిసెంబర్ 11న అవార్డు విజేతను ప్రకటిస్తారు. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ ద్వయం అంచనాలకు మించి రాణించి అద్భుత విజయాలు సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన సాత్విక్-చిరాగ్ ద్వయం ఇండోనేసియా సూపర్-1000 టోర్నీలో, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీలో, స్విస్ ఓపెన్ సూపర్-300 టోర్నీలో డబుల్స్ టైటిల్స్ గెలిచింది.

భారత్‌పై ఖతర్‌దే పైచేయి

3-0 గోల్స్‌తో నెగ్గిన ఆసియా చాంపియన్ • ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 ఆసియా క్వాలిఫయర్స్



భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి



ముస్తఫా

భువనేశ్వర్: ఎలాంటి అద్భుతం జరగలేదు. ఊహించిన ఫలితమే వచ్చింది. తమకంటే ఎంతో మెరుగైన ర్యాంక్ ఉన్న ఖతర్ జట్టును నిలువరించడంలో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు విఫలమైంది. ప్రపంచకప్-2026 ఆసియా క్వాలిఫయర్స్ రెండో రౌండ్‌లో భాగంగా ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ మ్యాచ్‌లో భారత్ 0-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఖతర్ జట్టు తరఫున ముస్తఫా మషాల్ (4వ ని.లో), అల్మోజ్ అలీ (47వ ని.లో), యూసుఫ్ అదురిసాగ్ (86వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. భారత జట్టుకు కూడా గోల్ చేసే అవకాశాలు లభించినా ఫినిషింగ్ లోపంతో మూల్యం చెల్లించుకుంది. ఓవరాల్‌గా ఖతర్ జట్టుతో నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్ మూడింటిలో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంది.

ఈనెల 16న కువైట్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-0తో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో మాత్రం తడబడింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 102వ స్థానంలో ఉన్న భారత్ అనూహ్యంగా ఈ మ్యాచ్‌లో రెగ్యులర్ గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూకు విశ్రాంతి కల్పించి మరో గోల్‌కీపర్ అమరిందర్ సింగ్‌ను ఆడించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 61వ స్థానంలో ఉన్న ఖతర్ భారత రక్షణపంక్తిలోని లోపాలను సద్వినియోగం చేసుకొని ఆట నాలుగో నిమిషంలోనే తొలి గోల్ సాధించింది. ఆ తర్వాత భారత జట్టు తేరుకొని ఖతర్‌కు కాస్త పోటీనిచ్చింది. విరామ సమయానికి ఖతర్ 1-0తో ఆధిక్యంలో ఉంది. రెండో అర్ధభాగం మొదలైన రెండో నిమిషంలోనే ఖతర్ ఖాతాలో రెండో గోల్ చేరింది. ఆ తర్వాత కూడా ఖతర్ తమ జోరు కొనసాగించి మ్యాచ్ ముగియడానికి మరో నాలుగు నిమిషాల ముందు మూడో గోల్‌ను సాధించింది. భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి 83 నిమిషాలు ఆడాక అతని స్థానంలో ఇషాన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. నాలుగు జట్లున్న గ్రూప్ ‘ఎ’లో ఖతర్ ప్రస్తుతం ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... మూడు పాయింట్లతో భారత్ రెండో స్థానంలో ఉంది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను వచ్చే ఏడాది మార్చి 24న అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది.

మ్యాచ్ గణాంకాలు

భారత్		ఖతర్
0	గోల్‌పోస్ట్‌పై షాట్‌లు	6
46%	బంతి ఆధీనం	54%
363	పాస్‌లు	416
14	ఫౌల్స్	7
1	ఎల్లో కార్డు	0
2	ఆఫ్ సైడ్	4
3	కార్నర్‌లు	11

ప్రిక్వార్టర్స్‌లో ప్రణయ్



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 21-18, 22-20తో ప్రపంచ 12వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. ఈ ఏడాది వీరిద్దరు నాలుగుసార్లు ముఖాముఖిగా తలపడగా... రెండుసార్లు ప్రణయ్, రెండుసార్లు చౌ తియెన్ గెలిచారు. మరోవైపు మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆకర్షి కశ్యప్ (భారత్) 12-21, 14-21తో జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-13, 21-10తో బెన్ లేన్-సీన్ వెండీ (ఇంగ్లండ్) జంటపై గెలిచింది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో శ్రీకాంత్; షి యు కి (చైనా)తో లక్ష్య సేన్; కెంటా నిషిమోటో (జపాన్)తో ప్రియాన్షు రజావత్ తలపడతారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు అర్హత లేదు

మహిళల క్రికెట్‌లో పోటీ పడేందుకు అనర్హులు • ఐసీసీ నిర్ణయం



డానిల్ మెక్‌గహే

అహ్మదాబాద్: అంతర్జాతీయ మహిళల క్రికెట్ సమగ్రతను కాపాడేందుకు, గౌరవం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట లింగ మార్పిడి చేసుకున్న అబ్బాయిలు పూర్తిగా అమ్మాయిల హోదా పొందినప్పటికీ అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అర్హత లభించదని మంగళవారం ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తొమ్మిది నెలల సంప్రదింపులు, సుదీర్ఘ కసరత్తు తర్వాత ఈ విధాన నిర్ణయం తీసుకున్నామని ఐసీసీ సీఈఓ జెఫ్ అలర్డైస్ తెలిపారు. అయితే దేశవాళీ క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్స్‌ను ఆడించే విషయమై ఆయా సభ్యదేశాలకే నిర్ణయాధికారం కల్పించామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ‘ట్రాన్స్‌జెండర్’గా కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే గుర్తింపు పొందింది. 2024 టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించేందుకు నిర్వహించిన అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో ఆమె కెనడా జట్టు తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడి 118 పరుగులు సాధించింది. డానిల్ మెక్‌గహే కెనడా జాతీయ జట్టు తరఫున ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లు ఆడినా వాటికి అంతర్జాతీయ హోదా లేదు. డానిల్ ఆస్ట్రేలియాలో పుట్టి మూడేళ్ల క్రితం కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్స్‌కు అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం కల్పించడంపై తీవ్ర విమర్శలు రావడంతో ఐసీసీ నిబంధనలు మార్చింది. మరోవైపు మ్యాచ్ అధికారులు, అంపైర్లకు ఇకపై లింగబేధం లేకుండా పురుష అంపైర్లతో సమానంగా మహిళా అంపైర్లకు వేతన భత్యాలు ఇస్తారు.

లంకలో కాదు దక్షిణాఫ్రికాలో

శ్రీలంక క్రికెట్ బోర్డుపై తాత్కాలిక నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే జనవరిలో శ్రీలంకలో జరగాల్సిన అండర్-19 పురుషుల ప్రపంచకప్ టోర్నీని ఐసీసీ దక్షిణాఫ్రికాకు తరలించింది.

స్టాప్ క్లాక్‌తో పెనాల్టీ

ఇకపై ఓవర్‌కు ఓవర్‌కు మధ్య సమయం మించిపోతే 5 పరుగుల పెనాల్టీ తప్పదు. బౌలింగ్ జట్టు 60 సెకన్లలోపే మరుసటి ఓవర్ వేసేందుకు బౌలర్‌ను దించాలి. అంపైర్ల చేతికి ‘స్టాప్ క్లాక్’తో ఈ సమయాన్ని నిర్ధారిస్తారు. రెండుసార్లు నిర్ణీత వ్యవధి (60 సెకన్లు) దాటితే మన్నిస్తారు. కానీ మూడోసారి కూడా ఆలస్యమైతే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారు. ఈ డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని ఐసీసీ తెలిపింది.

రికార్డు స్థాయిలో ప్రేక్షకుల బ్రహ్మరథం

భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌ను రికార్డు స్థాయిలో ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. పది జట్లు పోటీపడిన ఈ మెగా ఈవెంట్ 48 మ్యాచ్‌లను 12,50,307 మంది ప్రేక్షకులు చూశారని ఐసీసీ ధ్రువీకరించింది. అంటే సగటున ఒక్కో మ్యాచ్‌కు 26000 మంది హాజరైనట్లు తెలిపింది. ఆసీస్, న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహించిన 2015 వన్డే ప్రపంచకప్‌ను 10,16,420 మంది వీక్షించి రికార్డు సృష్టించగా... దీన్ని తాజా ప్రపంచకప్ బద్దలుకొట్టింది.

డేవిడ్ వార్నర్‌కు విశ్రాంతి



మెల్‌బోర్న్: భారత్‌తో రేపటి నుంచి మొదలయ్యే టి20 ద్వైపాక్షిక సిరీస్‌లో డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు విశ్రాంతినిచ్చారు. మాథ్యూ వేడ్ సారథ్యంలోని ఆసీస్ జట్టును ఎంపిక చేయగా, ఇందులో తాజా వరల్డ్‌కప్ ఆడిన ఏడుగురు ఆటగాళ్లున్నారు. హెడ్, స్మిత్, మ్యాక్స్‌వెల్, ఇంగ్లిస్, స్టొయినిస్, అబాట్, ఆడమ్ జంపాలు భారత్‌తో తలపడేందుకు అందుబాటులో ఉండగా... కెప్టెన్ కమిన్స్ సహా పలువురు ఆటగాళ్లు ఆస్ట్రేలియాకు పయనమయ్యారు. విశాఖపట్నంలో గురువారం జరిగే తొలి టి20తో భారత్, ఆసీస్ మధ్య సిరీస్ ప్రారంభమవుతుంది.

ఆస్ట్రేలియా టి20 జట్టు: వేడ్ (కెప్టెన్), హెడ్, స్మిత్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, ఆరన్ హార్డీ, బెహ్రెన్‌డార్ఫ్, అబాట్, ఎలిస్, తన్వీర్ సంఘా, షార్ట్, కేన్ రిచర్డ్‌సన్, జంపా.

సినిమా

రీల్స్



● మణికందన్, వెంకట్ బోయనపల్లి, వెంకటేశ్, సంతోష్ నారాయణన్, శైలేష్ కొలను

నాలాంటి స్టూడెంట్స్‌కి సహాయం చేయాలి! - వెంకటేశ్

‘‘ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ‘సైంధవ్’ నా 75వ చిత్రం. యాక్షన్, భావోద్వేగాలు చాలా అద్భుతంగా వచ్చాయి. నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. సంక్రాంతి పండక్కి ఫ్యామిలీతో కలిసి అందరూ ఈ సినిమాని ఎంజాయ్ చేస్తారు’’ అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం ‘సైంధవ్’. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. చిత్ర సంగీతదర్శకుడు సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ చిత్రంలోని ‘రాంగ్ యూసేజ్..’ అంటూ సాగే తొలి పాటని సీఎంఆర్ గ్రూప్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో విడుదల చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను నకాష్ అజీజ్ పాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ– ‘‘కళాశాల దశలో నేను బ్యాక్ బెంచర్‌ని. ఇప్పుడున్న నాలాంటి విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ విద్యార్థులు, అధ్యాపకులు సహకారం అందించాలి. 35 ఏళ్లుగా నా సినీ జర్నీ కొనసాగుతోంది. నా మొదటి చిత్రం విడుదల అప్పటినుంచి ఇప్పుడున్న యువత తల్లిదండ్రులు నన్ను ఆదరిస్తున్నారు. ఇప్పుడు యువత ఆదరిస్తున్నారు. ఈ తరం వారిని కూడా నా సినిమాలు రీచ్ అవ్వడం హ్యాపీగా ఉంది’’ అన్నారు.

హీరోని కాదు... యాక్టర్‌ని - వైష్ణవ్ తేజ్



"కథ నచ్చితే సినిమా చేస్తాను. ఆ సినిమా, అందులోని నా పాత్ర కోసం వంద శాతం కష్టపడతాను. అయితే ఫలితం గురించి ఆలోచించను. ఎందుకంటే అది ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. అందుకే నా గురించి ఎవరైనా అడిగితే నేను హీరోని కాదు.. యాక్టర్‌ని అనే చెబుతాను. నటుడిగా నిరూపించుకుంటే వైవిధ్యమైన పాత్రలు చేయొచ్చు" అని వైష్ణవ్ తేజ్ అన్నారు. వైష్ణవ్ తేజ్, శ్రీ లీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో రూపొందిన సినిమా ‘ఆదికేశవ’. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో వైష్ణవ్ తేజ్ చెప్పిన విశేషాలు.

● ‘రంగ రంగ వైభవంగా’ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉన్నప్పుడు నిర్మాత నాగవంశీగారు ‘ఆదికేశవ’ సినిమా కథ వినమన్నారు. ఓ ప్రేక్షకుడిగా ఈ సినిమా కథ విన్నప్పుడు ఇందులోని సరికొత్త పాయింట్‌ను ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయలేదనిపించింది. కమర్షియల్ హంగుల మేళవింపుతో కామెడీ, సాంగ్స్, విజువల్స్, ఫైట్స్ అన్నీ బాగుంటాయి. క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. ఓ మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు. ● ‘ఆదికేశవ’ ఆధ్యాత్మిక నేపథ్యం కాదు కానీ సినిమాలో ఓ పది శాతం శివుడి గురించి అంతర్లీనంగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ చెప్పిన కథను చెప్పినట్లుగా తెరకెక్కించారు. ఈ తరంలో నాలాంటి కుర్రాడు యాక్షన్ చేస్తే ఎలా ఉంటుందో, ఎలాంటి యాక్షన్ వారికి నచ్చుతుందో అదే ఈ సినిమాలో ఉంటుంది. ఓవర్ ది బోర్డ్ ఉండదు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ కూడా ఆ జాగ్రత్తలు తీసుకున్నారు. సాధారణంగా నేను డ్యాన్సర్‌ని కాదు. కానీ డ్యాన్స్ మాస్టర్స్ ఓకే అనేంతవరకూ నేను కష్టపడుతూనే ఉంటాను. ● స్క్రీన్‌పై నాకు, శ్రీ లీలకు మధ్య ఉన్న సీన్స్ ప్రేక్షకులను అలరిస్తాయి. శ్రీ లీల పాత్రలోని అమాయకత్వంతో దర్శకుడు శ్రీకాంత్ హాస్యం రాబట్టారు. అలాగే మలయాళ నటుడు జోజు జార్జ్‌గారు పెద్ద నిర్మాత కూడా. అయినా ఆయన సెట్స్‌లో చాలా జోవియల్‌గా ఉండేవారు. అలాగే సీనియర్ నటి రాధికగారు ఉంటే సెట్స్‌లో ఎనర్జీ ఉండేది. ఇలా సీనియర్ నటులతో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. ● ఏదైనా కథ వినేటప్పుడు అందులో కొత్తదనం ఉండటంతో పాటు కాస్త కమర్షియాలిటీ కూడా ఉండాలనుకుంటాను. నా తర్వాతి సినిమా కోసం రెండు కథలు ఉన్నాయి.

కల నెరవేరింది - బొమ్మదేవర రామచంద్రరావు



తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా బొమ్మదేవర రామచంద్రరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘మాధవే మధుసూదన’. ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ కానున్న సందర్భంగా బొమ్మదేవర రామచంద్రరావు మాట్లాడుతూ - ‘‘మేకప్‌మేన్‌గా నాది 40 ఏళ్ల కెరీర్. అప్పట్లో ‘దానవీరశూరకర్ణ’ సినిమా షూట్‌కి వెళ్లి, ఎన్టీఆర్‌గారిని చూసి ఎప్పటికైనా దర్శకుడిని కావాలనుకున్నాను. నా కలను నెరవేర్చుకోవాలని ‘మాధవే మధుసూదన’ తీశాను. పాతికేళ్ల ఎదురు చూపు తర్వాత ఓ అమ్మాయి కోరుకున్న వ్యక్తి ఆమెకు తారసపడితే ఏం జరుగుతుందన్నదే ఈ చిత్రకథ. దాదాపు 150 థియేటర్స్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు.


ఈ సినిమాలో హీరోలు లేరు - అల్లు అరవింద్



‘దిల్’ రాజు, వాసు, తేజా మార్ని, బోయపాటి శ్రీను, అల్లు అరవింద్

‘‘పోలీసులనే పోలీసులు వెంటాడే విచిత్రమైన కథ ‘కోట బొమ్మాళి పీఎస్’. ఈ సినిమాలో హీరోలు లేరు.. కథే హీరోగా వెళుతుంటుంది. ఈ చిత్రం ఏ రాజకీయ నాయకుడిని, పోలీస్ ఆఫీసర్‌ని ఉద్దేశించి తీయలేదు. ఈ వైవిధ్యమైన చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను’’ అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘కోట బొమ్మాళి పీఎస్’. తేజా మార్ని దర్శకత్వంలో ‘బన్నీ’ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత ‘దిల్’ రాజు మాట్లాడుతూ– ‘‘లింగిడి లింగిడి..’ పాట తర్వాత ఈ సినిమాపై అంచనాలు బాగా పెరిగాయి. ఈ చిత్రం మంచి హిట్టవ్వాలి’’ అన్నారు. ‘‘ఈ సినిమా ట్రైలర్ చూశాను. ఇప్పుడున్న పరిస్థితులకి చెప్పాలనుకున్న విషయాన్ని క్లియర్‌గా చెప్పారు’’ అని దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. ‘‘ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమిది’’ అని ‘బన్నీ’ వాసు అన్నారు.

సస్పెన్స్ సహస్ర



● సుధీర్, డాలీషా

‘సుడిగాలి’ సుధీర్, డాలీషా జంటగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ‘కాలింగ్ సహస్ర’. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథి నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ– ‘‘థ్రిల్లింగ్ అంశాలతో రానున్న ఈ సినిమా ఆకట్టుకుంటుంది’’ అన్నారు. ‘‘‘గాలోడు’ హిట్‌తో నాకు మాస్ ఇమేజ్ వచ్చింది. ‘కాలింగ్ సహస్ర’తో సస్పెన్స్ జానర్‌లోకి అడుగు పెడుతున్నా’’ అన్నారు ‘సుడిగాలి’ సుధీర్. ‘‘ఇప్పటివరకు ఇలాంటి కథతో ఇండియన్ స్క్రీన్ మీద సినిమా రాలేదు’’ అన్నారు అరుణ్ విక్కిరాలా. ‘‘సినిమా బాగా వచ్చింది’’ అన్నారు విజేష్ తయాల్.

చూసుండరు!

సూపర్ రాజా, రమ్య ప్రియ, వంశీ గోనె ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం ‘ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు’. రాజాకృష్ణ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రం టైటిల్ లాంచ్ వేడుకలో హీరో, రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్ సూపర్ రాజా మాట్లాడుతూ– ‘‘ఒకే షాట్‌లో తెరకెక్కిన రెండు గంటల చిత్రమిది. ప్రతి అంశం ఎప్పుడూ చూడని విధంగా ఉంటుందని చెప్పగలను. 2024 ఫిబ్రవరిలో సినిమాను రిలీజ్ చేస్తాం’’ అన్నారు. ‘‘సింగిల్ షాట్ సినిమా కాన్సెప్ట్ సవాల్‌గా అనిపించింది’’ అన్నారు వంశీ గోనె.



● రమ్య ప్రియ, సూపర్ రాజా

ప్రతి పంచ్‌కి నవ్వాను - అనిల్ రావిపూడి



● వీజే సన్నీ, అనిల్ రావిపూడి

‘‘‘సౌండ్ పార్టీ’ ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి పంచ్‌కి నవ్వాను. ఈ సినిమా విజయం సాధించి నిర్మాతలు మరింత సౌండ్ పార్టీగా ఎదగాలి’’ అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. వీజే సన్నీ, హృతికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం ‘సౌండ్ పార్టీ’. జయ శంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా మంచి విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘మా చిత్రానికి రియల్ సౌండ్ పార్టీలు నిర్మాతలే. రెండు గంటలపాటు మా సినిమా ప్రేక్షకులను నవ్విస్తుంది’’ అన్నారు సంజయ్ శేరి.

లుట్ పుట్ గయా...



● షారుక్ ఖాన్, తాప్సీ

హీరో షారుక్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ‘డంకీ’. బొమన్ ఇరానీ, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్ కీలక పాత్రల్లో నటించారు. రాజ్‌కుమార్ హిరాణీ, గౌరీ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 21న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని మెలోడి సాంగ్ ‘లుట్ పుట్ గయా..’ ‘డంకీ డ్రాప్ 2’గా నేడు విడుదలవుతోంది. స్వానంద్ కిర్‌కిరే, ఐపీ సింగ్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటను అర్జిత్ సింగ్ పాడారు.


పదిసార్లు ఉలిక్కిపడ్డా! - విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, ప్రియదర్శి, పాయల్, అజయ్ భూపతి

‘‘అజయ్ భూపతి కథ చెబితే సుదర్శన్ థియేటర్లో సినిమా చూస్తున్నట్లు ఉంటుంది. ‘మహాసముద్రం’ కథ వింటూ పదిసార్లు ఉలిక్కిపడ్డా. అయితే డేట్స్ కుదరక నేనా సినిమా చేయలేకపోయా. ఒక్క మాటలో మాట్లాడుకునే పాయింట్‌తో ‘మంగళవారం’ని రెండున్నర గంటల సినిమాగా నిజాయతీగా చెప్పారు అజయ్ భూపతి’’ అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతీ రెడ్డి గునుపాటి, ఎం. సురేష్ వర్మ, అజయ్ భూపతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో అజయ్ భూపతి మాట్లాడుతూ–‘‘పాయల్ పాత్రని అర్థం చేసుకుంటారా? రిసీవ్ చేసుకుంటారా అని కాస్త భయపడ్డా. అయితే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు’’ అన్నారు. ‘‘మా సంస్థలో తీసిన తొలి సినిమా ‘మంగళవారం’ని సక్సెస్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనం’’ అన్నారు సురేష్ వర్మ.

కష్టమంతా మరచిపోయాం! - హన్సిక



‘‘‘మై నేమ్ ఈజ్ శృతి’ జెన్యూన్ ఫీమేల్ సెంట్రిక్ ఫిల్మ్. ఈ సినిమా కోసం దర్శక-నిర్మాతలు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. ఈ చిత్ర విజయం మా కష్టమంతా మరచిపోయేలా చేసింది’’ అన్నారు హన్సిక. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో హన్సిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘మై నేమ్ ఈజ్ శృతి’. బురుగు రమ్య ప్రభాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ అయింది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో రమ్య ప్రభాకర్ మాట్లాడుతూ– ‘‘స్కిన్ మాఫియా నేపథ్యంలో వచ్చిన మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్’’ అన్నారు. ‘‘మీ బెస్ట్ 10 మూవీస్‌లో ‘మై నేమ్ ఈజ్ శృతి’ ఉంటుందని హన్సికకి మాట ఇచ్చా. సినిమాకి వస్తున్న స్పందన చూస్తే ఆ మాటని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను’’ అన్నారు శ్రీనివాస్ ఓంకార్.

సాక్షి బిజినెస్
బుధవారం
22-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
276	89
65,931	19,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,191	▽	93
డోజోన్స్	35,093	▽	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,482	▽	14
డాక్స్	15,901	▽	1
షాంఘై	3,068		0
నికాయ్	33,354	▽	34

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
61,250	▲	362
బంగారం (99.5 స్వచ్ఛత)		
61,005	▲	361
వెండి (కేజీ)		
72,720	▲	168

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.52	84.19
£	బ్రిటన్ పౌండ్		102.38	105.73
€	యూరో		89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)		55.11	56.80
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.77	55.74
S$	సింగపూర్ డాలర్		53.21	55.55
SAR	సౌదీ రియాల్		21.27	22.09
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.59
¥	చైనా యువాన్		10.56	12.63

ఈసారి రూ. 4.7 లక్షల కోట్ల వ్యాపారం..

- పెళ్లిళ్ల సీజన్‌పై సీఏఐటీ ఆశాభావం
- నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు సీజన్
- 38 లక్షల పైచిలుకు వివాహాల అంచనా

న్యూఢిల్లీ: ఈసారి పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం భారీగా జరుగుతుందని అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేస్తోంది. పెళ్లిళ్లకు సంబంధించిన కొనుగోళ్లు, ఇతరత్రా సర్వీసులపై వినియోగదారులు రూ. 4.74 లక్షల కోట్ల మేర వెచ్చించే అవకాశం ఉందని భావిస్తోంది. గత సీజన్‌లో నమోదైన రూ. 3.75 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రూ. 1 లక్ష కోట్లు అధికం. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ఉన్న వివాహాల సీజన్‌లో దాదాపు 38 లక్షల పెళ్లిళ్లు జరగొచ్చని భావిస్తున్నట్లు సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ విలేకరుల సమావేశం సందర్భంగా తెలిపారు. 'గతేడాది సుమారు రూ. 3.75 లక్షల కోట్ల వ్యయంతో దాదాపు 32 లక్షల వివాహాలు జరిగాయి. ఈసారి ఇది దాదాపు రూ. 1 లక్ష కోట్లు మేర పెరగొచ్చని అంచనాలు ఉన్నాయి. దేశ ఎకానమీకి, రిటైల్ వ్యాపారానికి కూడా ఇది మంచిదే' అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో 23, 24, 27, 28, 29 తేదీల్లో, అలాగే డిసెంబర్‌లో 3, 4, 7, 8, 9, 15 తేదీల్లో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఒక్క ఢిల్లీలోనే 4 లక్షల పైగా పెళ్లిళ్లు ఉంటాయని, వీటితో రూ. 1.25 లక్షల కోట్ల మేర వ్యాపారం జరగొచ్చని అంచనా వేస్తున్నట్లు ఖండేల్వాల్ తెలిపారు.



ఒకేరోజు @ 4,59,526

విమాన ప్రయాణికుల రికార్డు



న్యూఢిల్లీ: దేశీయంగా ఒకే రోజు 4,59,526 మంది విమాన ప్రయాణం. భారత దేశ చరిత్రలో ఈ స్థాయిలో ఒకేరోజు విమానాల్లో రాకపోకలు సాగించడం ఇదే తొలిసారి. నవంబర్ 20న ఈ రికార్డు నమోదైందని పౌర విమానయాన శాఖ మంగళవారం ప్రకటించింది. దేశీయ విమానయాన రంగం ప్రతిరోజు కొత్త శిఖరాలను తాకుతోందని వ్యాఖ్యానించింది. 2022 నవంబర్ 20న దేశీయంగా విమాన ప్రయాణాలు చేసిన వారి సంఖ్య 3.94 లక్షలు ఉంది. విమాన సర్వీసుల సంఖ్య గతేడాది 5,468 కాగా, ఈ ఏడాది నవంబర్ 20న 5,959 ఉంది. దేశీయంగా నవంబర్ 18న 4,56,748, నవంబర్ 19న 4,56,910 మంది తమ తమ గమ్యస్థానాలకు చేరారు.

నేటి నుంచి పౌల్ట్రీ ఇండియా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పౌల్ట్రీ ఇండియా–2023 ప్రదర్శన నవంబర్ 22 (నేటి) నుంచి ప్రారంభం అవుతోంది. మూడు రోజులపాటు సాగే ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక అయింది. భారత్ నుంచి 380, వివిధ దేశాలకు చెందిన 45 కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి.

మైక్రోసాఫ్ట్ గ్లోబల్ డెలివరీ సెంటర్ లీడరుగా అపర్ణ



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ గ్లోబల్ డెలివరీ సెంటర్ (జీడీసీ) లీడరుగా అపర్ణ గుప్తాను నియమించింది. కస్టమర్ ఇన్నోవేషన్, డెలివరీ ఎక్సలెన్స్, క్లౌడ్ విభాగం వృద్ధిని వేగవంతం చేయడం తదితర బాధ్యతలను ఆమె నిర్వర్తించాల్సి ఉంటుంది. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీల్లో అపర్ణకు అపార అనుభవం ఉండటంతో కస్టమర్లు తమకు అవసరమయ్యే సొల్యూషన్స్‌ను ఎంచుకోవడంలో తగిన సహాయం అందించగలరని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. భారత్‌లో కమర్షియల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ (ప్రస్తుతం ఐఎస్‌ఈ) లీడ్‌గా ఆమె ఆరేళ్ల క్రితం సంస్థలో చేరారు.

ప్రాంతీయ భాషల్లో అవుట్‌లుక్ లైట్ ..

మరోవైపు, మైక్రోసాఫ్ట్ భారత యూజర్ల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన తమ అవుట్‌లుక్ లైట్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు జోడించింది. ప్రాంతీయ భాషలను కూడా సపోర్ట్ చేసే విధంగా ఈ ఎస్‌ఎంఎస్, ఈమెయిల్ యాప్‌ను తీర్చిదిద్దడం జరిగింది.

ఐదేళ్లలో 3,000 ఉద్యోగాలు

టైటన్ కంపెనీ ప్రణాళికలు



ముంబై: టాటా గ్రూప్ దిగ్గజం టైటన్ కంపెనీ రానున్న ఐదేళ్ల కాలంలో 3,000కుపైగా ఉద్యోగాలను కల్పించనుంది. వీటిలో ఇంజినీరింగ్, డిజైన్, లగ్జరీ, డిజిటల్, డేటా అనలిటిక్స్, మార్కెటింగ్ తదితర విభాగాలలో సిబ్బందిని నియమించుకోనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ తదితర ఆధునిక విభాగాలలో ప్రత్యేకతలున్న నిపుణులను ఎంపిక చేసుకోనున్నట్లు వివరించింది. ఐదేళ్ల కాలంలో రూ. 1,00,000 కోట్ల బిజినెస్‌ను అందుకునే బాటలో ప్రయాణిస్తున్నట్లు టైటన్ తెలియజేసింది. ఇందుకు అనుగుణంగా విభిన్న విభాగాలలో ప్రత్యేకత కలిగిన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకునే వ్యూహాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. కంపెనీ సొంత సిబ్బందినహా.. వివిధ విభాగాలలో యువ వృత్తి నిపుణులను జత కలుపుకోనున్నట్లు తెలియజేసింది. వెరసి వృద్ధి, ఆవిష్కరణలతోపాటు పరిశ్రమలో కంపెనీ స్థానాన్ని పటిష్టపరచుకోనున్నట్లు టైటన్ హెచ్ఆర్(కార్పొరేట్, రిటైల్) హెడ్ ప్రియా ఎం.పిళ్లై పేర్కొన్నారు.

60:40

ప్రస్తుతం కంపెనీ సిబ్బందిలో 60 శాతం మెట్రో నగరాలలో సేవలందిస్తుండగా.. మరో 40 శాతం మంది ద్వితీయస్థాయి నగరాల(టైర్-2, 3)లో పనిచేస్తున్నట్లు టైటన్ వెల్లడించింది. వర్ధమాన మార్కెట్లలో కార్యకలాపాల పటిష్టతను కొనసాగిస్తూనే స్థానిక నిపుణులను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. టాటా గ్రూప్, తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ(టిడ్కో) మధ్య భాగస్వామ్య కంపెనీగా టైటన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-11-2023	
విశాఖ	585-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
21-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

రెండు రోజుల నష్టాలకు చెక్

- వడ్డీ రేట్ల పెంపు ఆందోళన తగ్గుముఖం నేపథ్యం
- సెన్సెక్స్ 276 పాయింట్లు ప్లస్
- 19,800 చేరువలో నిఫ్టీ

ముంబై: ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే అంచనాలతో స్టాక్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.25% రాణించింది. సెన్సెక్స్ 276 పాయింట్లు పెరిగి 65,931 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 19,783 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు మిడ్ సెషన్‌లో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభంతో ట్రేడర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టారు. ఒక దశలో సెన్సెక్స్ 472 పాయింట్లు బలపడి 66,082 వద్ద, నిఫ్టీ 135 పాయింట్లు పెరిగి 19,829 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, మెటల్, ఫార్మా షేర్లకు కొనుగోళ్లకు లభించింది. ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఐటీ, ఇంధన రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.20%, 0.14% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.456 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.721 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ సమావేశ నిర్ణయాల వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.



విదేశాలకు బయోఫ్యాక్టర్ 'బెలోమ్'



బయోఫ్యాక్టర్ ఫౌండర్ ఎల్ఎస్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవన ఎరువులు, ప్రాణాధార పోషకాల తయారీలో ఉన్న బయోఫ్యాక్టర్.. ఆధునీకరించిన 'బెలోమ్' ఉత్పత్తులను విదేశాల్లో మార్కెట్ చేసేందుకు సిద్ధమైంది. అనావృష్టి, అతివృష్టిలోనూ మెరుగైన పంట దిగుబడి కోసం అత్యంత సమర్థవంతంగా పనిచేసే బెలోమ్ ఫోలియర్ న్యూట్రిషన్ సాంకేతికతకు మరింత సామర్థ్యాన్ని జోడించామని బయోఫ్యాక్టర్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న బయోఫ్యాక్ ఇన్‌పుట్స్ ఫౌండర్, సీఈవో ఎల్ఎస్ రెడ్డి వెల్లడించారు. 'ఆకుల ద్వారా మొక్కలకు పోషకాలు చేరడం బెలోమ్ ప్రత్యేకత. అన్ని రకాల పంటలను తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చు. దిగుబడి 20-30 శాతం పెరిగిందని నిరూపితమైంది. తెగుళ్లు, వ్యాధుల నుంచి మొక్కలు తట్టుకుంటాయి. కంపెనీ పరిశోధనలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్ నుంచి అనుమతి ఉంది' అని తెలిపారు.

లక్ష మందికి పైగా..

ప్రపంచంలో తొలిసారిగా మెటబోలైట్ అసిస్టెడ్ మైక్రాన్ సైజ్డ్ (ఎంఏఎంఎస్) న్యూట్రిషన్ టెక్నాలజీతో తయారైన బెలోమ్‌ను లక్షకు పైచిలుకు రైతులు భారత్‌లో వినియోగిస్తున్నారు. మొక్కకు కావలసిన 13 రకాలైన ప్రాణాధార పోషకాలు ఎంఏఎంఎస్ విధానంలో ప్రత్యేకించి తయారు చేశామని ఎల్ఎస్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ వ్యవసాయ భూముల్లో వరి, మొక్కజొన్న, టమాటా, వంకాయ, బంతి, మిర్చి, పత్తి వంటి పంటలపై పరిశోధనలు జరిపామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా 2014లో బయోఫ్యాక్టర్ ఏర్పాటైంది. 650 మంది ఉద్యోగులున్నారు. దేశవ్యాప్తంగా 3,500 పైచిలుకు డీలర్ నెట్‌వర్క్ ఉంది. ప్రోబయాటిక్స్ విభాగంలో 35 ప్రొప్రైటరీ స్ట్రెయిన్స్, నానో టెక్నాలజీలో ఎనిమిది పేటెంట్లు కంపెనీ సొంతం.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డీజీహెచ్ఎస్ వైద్య సంస్థల్లో 487 గ్రూప్ బి, సి పోస్టులు

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్).. వివిధ నగరాల్లోని వైద్య సంస్థల్లో గ్రూప్ బి, సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» పోస్టులు: రీసెర్చ్ అసిస్టెంట్, టెక్నీషియన్, ల్యాబొరేటరీ అటెండెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ వర్కర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ క్లర్క్, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, యానిమల్ అటెండెంట్, లైబ్రరీ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్), పారా మెడికల్ వర్కర్, వర్క్‌షాప్ అటెండెంట్.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: గరిష్ఠ వయసు ఉద్యోగాన్ని బట్టి మారుతుంది. కొన్ని పోస్టులకు 25 ఏళ్లు, కొన్నింటికి 27 ఏళ్లు, మరికొన్నింటికి 30 ఏళ్లుగా నిర్ణయించారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.11.2023.
» ఆన్‌లైన్ ఫీజు చెల్లింపునకు చివరితేది:01.12.2023
» అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడింగ్: డిసెంబర్ మొదటి వారం, 2023.
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష: డిసెంబర్ రెండో వారం, 2023.
» వెబ్‌సైట్: https://hlldghs.cbtexam.in

పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 10 పోస్టులు

పల్నాడు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిక కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, బ్లాక్ కోఆర్డినేటర్-09.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.18,000, బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ 20,000.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బరంపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.11.2023.
» వెబ్‌సైట్: htpp://dwcweopalnadu.ap.gov.in

టీచర్ కెరీర్‌కు మార్గం.. సీటెట్



సీటెట్ జనవరి-2024

- సీటెట్ జనవరి-2024 నోటిఫికేషన్ విడుదల
- టీచర్ కొలువుకు తప్పనిసరి అర్హతగా సీటెట్
- డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
- సీటెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్..సంక్షిప్తంగా సీటెట్! ఈ పరీక్షలో విజయం సాధిస్తేనే.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో.. ఉపాధ్యాయ పోస్ట్‌లకు పోటీ పడే అర్హత లభిస్తుంది. బీఈడీ, డీఈడీ తదితర ఉపాధ్యాయ విద్య కోర్సుల ఉత్తీర్ణులు సీటెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇటీవల సీటెట్ జనవరి-2024 నోటిఫికేషన్ వెలువడింది. పరీక్షను జనవరి 21న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. సీటెట్-2024 వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..

బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు రాష్ట్ర స్థాయిలో టెట్‌తోపాటు జాతీయ స్థాయిలో సీటెట్‌కు కూడా పోటీ పడుతున్నారు. దీనికి కారణం.. సీటెట్ స్కోర్‌తో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుండటమే. సీటెట్‌ను సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు.

రెండు పేపర్లుగా సీటెట్

సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు పేపర్-1కు హాజరు కావలసి ఉంటుంది. అదేవిధంగా ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్‌కు పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి. ఈ పేపర్లు రాసేందుకు నిర్దేశిత విద్యార్హతలు కలిగుండాలి.

అర్హతలు

- పేపర్-1: ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) పాసవ్వాలి. లేదా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత తోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం-బీఈడీ అభ్యర్థులు సైతం ఎస్‌జీటీ పోస్ట్‌లకు అర్హులే. దీంతో సీటెట్-పేపర్-1కు బీఈడీ ఉత్తీర్ణులకు కూడా అర్హత లభించింది.

పేపర్-2 అర్హత

- బీఏ/బీఎస్సీ/బీకాంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత ఉండాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి (లేదా)
- బీఈ/బీటెక్‌లో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ/బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పాసవ్వాలి (లేదా) 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ ఉత్తీర్ణులవ్వాలి.

150 మార్కులకు పేపర్-1

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించే వారికి నిర్వహించే పేపర్-1 పరీక్ష అయిదు విభాగాల్లో 150 మార్కులకు ఉంటుంది. ఇందులో..చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ -2, 30 ప్రశ్నలు-30 మార్కులకు; మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు-30 మార్కులకు; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది.

లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2 తప్పనిసరి పేపర్లు. లాంగ్వేజ్1 విభాగంలో అభ్యర్థులు ఎంచుకున్న బోధన మాధ్యమానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్-2 విభాగంలో 20 లాంగ్వేజ్‌లలో ఏదో ఒక లాంగ్వేజ్‌ను ఎంచుకోవచ్చు.అయితే ఈ విభాగంలో ఎంచుకునే భాషను లాంగ్వేజ్-1 విభాగంలో ఎంచుకోకూడదు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు లాంగ్వేజ్-2లో తెలుగు, ఉర్దూ భాషల్లో హాజరయ్యే అవకాశం ఉంది.

పేపర్-2 ఇలా

ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే వారికి నిర్వహించే పేపర్-2 పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఇందులో.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ 1, 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ 2, 30 ప్రశ్నలు-30 మార్కులకు; మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు; సోషల్ స్టడీస్ / సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. అభ్యర్థులు తాము ఏ మాధ్యమంలో బోధించాలనుకుంటున్నారో ఆ మీడియంలో లాంగ్వేజ్-1 పరీక్ష రాయాల్సి ఉంటుంది. లాంగ్వేజ్-2 విభాగంలో లాంగ్వేజ్-1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌ను ఎంచుకోవాలి. మొత్తం 20 భాషలు అందుబాటులో ఉన్నాయి. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు పేపర్-2లో నాలుగో విభాగాన్ని, సోషల్ టీచర్లు అయిదో విభాగాన్ని ఎంచుకుని పరీక్షకు హాజరు కావాలి.

కనీస అర్హత మార్కులు

సీటెట్‌లో ప్రతి పేపర్‌లోనూ.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో (90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో (70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో (60 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి.

జీవిత కాల గుర్తింపు

సీటెట్‌లో ఒకసారి నిర్దేశిత అర్హత మార్కులతో స్కోర్ సొంతం చేసుకుంటే.. ఆ స్కోర్‌కు జీవిత కాలం గుర్తింపు ఉంటుంది. అంటే.. ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 23, 2023
- సీటెట్ పరీక్ష తేదీ: 2024, జనవరి 21
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- వివరాలకు వెబ్‌సైట్: https://ctet.nic.in

పరీక్షలో రాణించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

పరీక్షలో ఎంతో కీలకమైన విభాగం ఇది. ఇందులో ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. పెడగాజీ అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

లాంగ్వేజ్ పేపర్లు

లాంగ్వేజ్-1 విభాగంతోపాటు లాంగ్వేజ్-2లో రాణించేందుకు సంబంధిత భాషా విభాగాలపై స్కూల్ స్థాయి పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్-2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సన్నద్ధం కావాలి. పెడగాజీకి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

పేపర్-1లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పుస్తకాలను చదవాలి. తద్వారా ఈ సబ్జెక్టులో ప్రాథమిక అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. పేపర్-2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్ట్‌లపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత స్థాయి ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

బోటనీ బేసిక్స్‌తోపాటు, పర్యావరణ అంశాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కుల పొందాలంటే.. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్‌ను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

హైస్కూల్ స్థాయిలో పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకోవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన పరిణామాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో 'ముక్కోటి' టికెట్లు

డిసెంబర్ 23న భద్రాద్రిలో ఉత్తర ద్వార దర్శనం

భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 23న నిర్వహించే ఉత్తర ద్వార దర్శనం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని ఆలయ ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 వేలు, రూ.1000, రూ.500, రూ.250 విలువైన టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. https/bhadradritemple.telangana.govt.in వెబ్‌సైట్ ద్వారా బుధవారం నుంచి బుక్ చేసుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. భక్తులు బుక్ చేసుకున్న టికెట్లను డిసెంబర్ 13 – 22 తేదీల మధ్య ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భద్రాచల దేవస్థానం కార్యాలయంలో పొందవచ్చన్నారు.

యాదాద్రిలో 23 నుంచి శత చండీయాగం

యాదగిరిగుట్ట: యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 23 నుంచి 27 వరకు శత చండీయాగం నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కార్తీకమాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు రోజుకో కార్యక్రమం ఉంటుందన్నారు. 23న కార్తీకమాస విశిష్టత ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 24న కొండపైన విష్ణు పుష్కరిణిలో దీపోత్సవం, 25న బ్రహ్మోత్సవ మండపం వద్ద కార్తీక విశిష్టత దీపోత్సవం, 26న హరినామ సంకీర్తన, 27న అన్నకూటోత్సవం, ఆకాశదీపోత్సవం, తులసీ కల్యాణం కార్యక్రమాలు ఉంటాయని ఈవో వివరించారు.

శబరిమలకు మరో 24 ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా పలు ప్రాంతాల నుంచి శబరిమలకు మరో 24 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్‌–కొల్లాం, నర్సాపూర్‌–కొట్టాయం మధ్య డిసెంబర్ 24 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నట్లు చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈ రైళ్లను నడపనున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్‌–భగత్‌కీ కోఠి, గుంటూరు–జైపూర్, నాందేడ్‌–బీదర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రాకేశ్ వెల్లడించారు.

ఆడిట్ వారోత్సవాల్లో 'డిజిటల్ ఐ గవర్నెన్స్ సిటిజన్ సెంట్రిసిటీ'పై చర్చ

సాక్షి, హైదరాబాద్: ఆడిట్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 'డిజిటల్ ఐ గవర్నెన్స్ అండ్ సిటిజన్ సెంట్రిసిటీ'అనే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ రాజేంద్ర నిమ్జే, ఇన్వెస్టిగేషన్ విభాగం డీజీపీటీ సంజయ్ బహదూర్, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, పారదర్శక పాలన ప్రచారకర్త, ఫ్యాకల్టీ ఫౌండర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించింది.

హాజరుకూ మార్కులు!

- వచ్చే ఏడాది నుంచి డిగ్రీ స్థాయిలో అమలు
- ఉన్నత విద్యామండలి కసరత్తు
- నిరంతర మూల్యాంకన విధానంలో అటెండెన్స్‌కూ ప్రాధాన్యత
- ఐఎస్‌బీ సిఫారసులకు యూనివర్సిటీల ఆమోదం
- విద్యార్థుల్లోనూ సానుకూలత



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ విద్యార్థులను కళాశాలకు రప్పించే విధానానికి ఉన్నత విద్యా మండలి శ్రీకారం చుట్టబోతోంది. సమగ్ర నిరంతర మూల్యాంకన విధానంలో భాగంగా వారి హాజరుకూ మార్కులివ్వనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఈ ఏడాది దీన్ని ప్రయోగాత్మకంగా చేపట్టగా, మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిసింది. ఈ నేపథ్యంలోనే డిగ్రీ స్థాయిలోనూ దీన్ని అమలులోకి తేవాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించారు. అకడమిక్ మార్కులే కాకుండా, వాస్తవ ప్రతిభను వెలికి తీయడం దీని ముఖ్యోద్దేశమని మండలి అధికారులు చెబుతున్నారు. మూల్యాంకన విధానంపై అధ్యయనానంతరం ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ)చేసిన సిఫారసులకు విశ్వవిద్యాలయాల వీసీలూ ఆమోదం తెలిపారు.

ఐఎస్‌బీ అభిప్రాయ సేకరణ

అధ్యయనంలో భాగంగా ఐఎస్‌బీ రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేసింది. 258 కాలేజీల అధ్యాపకుల మనోగతాన్ని పరిశీలించింది. 892 మంది విద్యార్థులతో మూల్యాంకన విధానంపై చర్చించింది. విద్యార్థి ప్రతిభను అంచనా వేయాలని 41 శాతం మంది అభిప్రాయపడ్డారు. థియరీ ద్వారా మార్కులు నిర్ణయించే ప్రస్తుత విధానం కన్నా సమర్థవంతమైంది కావాలని 82 శాతం తెలిపారు. ఉపాధి కోర్సుల అవసరం ఉందని 24 శాతం మంది పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం డిగ్రీ స్థాయిలో నైపుణ్యం పెంచాలని 38 శాతం తెలిపారు. డిగ్రీ క్లాసులకు హాజరయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలని 76 శాతం అధ్యాపకులు పేర్కొన్నారు. కొత్త అంశాల అన్వేషణకు క్లాస్ రూం వేదిక కావాలని 84 శాతం మంది ఆకాంక్షించారు. ఈ అభిప్రాయాల ఆధారంగానే ఐఎస్‌బీ కొన్ని సిఫార్సులు చేసింది. ముఖ్యంగా హాజరు తప్పనిసరి చేయడమే కాకుండా, క్లాసు రూంలో వివిధ బోధన పద్ధతులను సూచించింది. ప్రతి 20 రోజులకు విద్యార్థి ప్రతిభను వెలికి తీసేలా పరీక్షలుండాలని స్పష్టం చేసింది.

ప్రతి అంశానికీ మార్కులు

సంవత్సరం మొత్తంలో 75 శాతానికి పైగా హాజరు ఉన్న వారికి 10 మార్కులు ఇవ్వాల్సిన అవసరాన్ని ఐఎస్‌బీ ప్రస్తావించింది. యాక్టివ్‌గా ఉండే విద్యార్థులను వెలికితీయడం, వారు ఏ అంశాల్లో ఆసక్తిగా ఉన్నారనేది అధ్యాపకుడు గుర్తించాలి. దీనికీ కొన్ని మార్కులు నిర్దేశించారు. మంచి సంస్థలను గుర్తించి, అక్కడే ప్రాజెక్టు వర్క్ చేయాలి. ప్రాజెక్టు వర్క్‌లో నైపుణ్యానికి మార్కులుంటాయి. నెలకు కనీసం నాలుగు క్విజ్‌లు, వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, మార్కులివ్వాలి. ఈ విధానం ఎలా ఉండాలనేది ఆయా యూనివర్సిటీలు నిర్ణయిస్తాయి. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అనుసంధానం పెంచడం, ఇంటర్న్‌షిప్, ప్రాంగణ నియామకాల కల్పనకు ఒక వెబ్ పోర్టల్ ఏర్పాటును వర్సిటీలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రతి వారం విద్యార్థి ప్రతిభకు మార్కులు నిర్ణయించి, వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ప్రతి యూనివర్సిటీలోనూ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ ఎవాల్యుయేషన్ అండ్ అసెస్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. డిగ్రీ స్థాయిలోనూ పరిశోధన సంస్కృతికి ఊతం ఇవ్వడం కొత్త విధాన లక్ష్యం. కృత్రిమ మేధ కోర్సులు, డేటాసైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ కోర్సులను పెద్ద ఎత్తున డిగ్రీలో చేపట్టాలని ఐఎస్‌బీ సిఫారసు చేసింది.

గుణాత్మక మార్పుకు దోహదం



దేశంలోనే తొలిసారి నిరంతర మూల్యాంకన విధానం ఈ ఏడాది ప్రవేశపెట్టాం. పీజీ (నాన్‌–ఇంజనీరింగ్) కోర్సుల్లో దీన్ని అమలు చేస్తున్నారు. దీనికోసం సాఫ్ట్‌వేర్ కూడా రూపొందించాం. ప్రశ్నపత్రాల రూపకల్పనపై అన్ని వర్గాల ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. ఇబ్బందులుంటే చర్యలు చేపడుతున్నాం. గుణాత్మక మార్పునకు ఇది దోహదపడుతుందని ఆశిస్తున్నాం. దీన్ని డిగ్రీ స్థాయికీ విస్తరించాలనే కృతనిశ్చయంతో ఉన్నాం.

– ప్రొఫెసర్ డి.రవీందర్ (వీసీ, ఉస్మానియా యూనివర్సిటీ)

4 నెలల్లో రైతుల కుటుంబాలకు పరిహారం

రైతుల ఆత్మహత్యలపై హైకోర్టు విచారణ.. పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సాగు సాగక నష్టం వచ్చి.. అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు 4 నెలల్లోగా పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల్లో పిటిషనర్ పేర్కొన్న రైతుల వివరాలపై విచారణ జరిపి.. అర్హులకు గుర్తించి, సాయం అందజేయాలని స్పష్టం చేసింది. రైతు ఆత్మహత్యలపై కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.6 లక్షల పరిహారం అందజేయడం లేదంటూ బన్నూరు కొండల్‌రెడ్డి, నల్ల సూర్యప్రకాశ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం ప్రత్యేక జీవో తెచ్చినా అర్హులైన రైతు కుటుంబాలకు పరిహారం అందడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ చెప్పారు. పరిహారం పంపిణీకి సిఫార్సు చేయాల్సిన కమిటీల నియామకంపై అలసత్వం వహిస్తోందన్నారు. అయితే ప్రతి జిల్లాలోనూ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది శ్రీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆర్డీవో, వ్యవసాయ శాఖ డైరెక్టర్, డీఎస్పీ స్థాయి అధికారి ఈ కమిటీలో ఉంటారని వివరించారు. గడువిస్తే.. కమిటీలు పేర్కొన్న వారికి పరిహారం అందజేస్తామని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. కమిటీలు పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హుల పేర్లు సిఫార్సు చేయాలని, ఆ మేరకు ప్రభుత్వం 4 నెలల్లో పరిహారం పంపిణీ చేయాలని ఆదేశించింది. పిటిషన్లపై వాదనలను ముగించింది.

3 నెలల్లో నియామకాలు పూర్తి చేయాలి

సీడీపీవో, శిశు సంక్షేమశాఖ సూపర్ వైజర్ల ఎంపికపై టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహిళా శిశు సంక్షేమ శాఖలోని సూపర్‌వైజర్ల (గ్రేడ్‌–2) పోస్టులతోపాటు సీడీఎస్ పరిధిలోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి(సీడీపీవో) పోస్టుల నియామక ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో సీడీపీవో పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందని.. పరీక్ష పూర్తయినా నియామకాలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ కె.నిఖితతోపాటు మరో 12 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే గ్రేడ్‌–1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ సంహితతోపాటు మరో 38 మంది మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పి.మాధవీదేవి విచారణ చేపట్టారు. నోటిఫికేషన్ మేరకు నియామక ప్రక్రియ ప్రారంభించిన కమిషన్.. మెరిట్ జాబితా ప్రకటించకపోవడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది చిల్లా రమేశ్ వాదనలు వినిపించారు. గ్రూప్‌–1, ఏఈఈ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీకి, వీటికి సంబంధం లేదన్నారు. పలు పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీపై 'సిట్' విచారణ చేస్తోందని, దీంతో నియామకాలను తాత్కాలికంగా నిలిపినట్లు టీఎస్‌పీఎస్సీ తరఫు న్యాయవాది రాంగోపాల్‌రావు వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సీడీపీవో, సూపర్‌వైజర్ పోస్టులపై ఆరోపణలు లేనందున వాటి నియామకాలు చేపట్టాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించారు.

మూడు రోజులు పలుచోట్ల తేలికపాటి వానలు

- పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి
- దీని ప్రభావంతో రాష్ట్రంలో మరింత తగ్గనున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడురోజులు పలుచోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు, ఆంధ్రప్రదేశ్ తీరం నుంచి పశ్చిమ, మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తువరకు వ్యాపించి ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వానలు కురుస్తాయని సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి తూర్పు దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు మరింత పతనమయ్యాయి. ప్రస్తుతం సాధారణస్థితిలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, రానున్న మూడు రోజులు సాధారణం కంటే తక్కువగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే, గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 32 డిగ్రీ సెల్సియస్ నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 15 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

మంగళవారం ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
మెదక్	15.0
ఆదిలాబాద్	16.2
హకీంపేట్	18.5
నల్లగొండ	19.0
నిజామాబాద్	19.3
దుండిగల్	19.7
రామగుండం	20.0
హనుమకొండ	20.5
హైదరాబాద్	21.1
మహబూబ్‌నగర్	21.5
ఖమ్మం	22.6
భద్రాచలం	23.5

శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు బద్రీనాథ్ కన్నుమూత

- వయోభారంతో చెన్నైలో తుదిశ్వాస
- పేదలకు ఉచితంగా వైద్య సేవలు
- సేవలకు గుర్తింపుగా 1996లో పద్మభూషణ్ పురస్కారం



సాక్షి, చెన్నై: కంటి చికిత్సలతో ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.ఎస్.బద్రీనాథ్(83) వయోభారంతో చెన్నైలో మంగళవారం కన్నుమూశారు. 1978లో శంకర నేత్రాలయ పేరిట స్వచ్ఛంద సంస్థను ఆయన ఏర్పాటు చేశారు. చెన్నై నుంగంబాక్కం కేంద్రంగా శంకర నేత్రాలయ ద్వారా అనేక బ్రాంచీలతో ఉచితంగా పేదలకు సేవలు అందించారు. రోజుకు కనీసం తన బృందం ద్వారా 1,200 మందికి చికిత్సలు, వంద మందికి ఆపరేషన్లు చేసేవారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1996లో పద్మభూషణ్‌తో కేంద్రం సత్కరించింది. అలాగే బీసీ రాయ్ అవార్డుతో పాటు అనేక పురస్కారాలు ఆయనను వరించాయి. చెన్నై ట్రిప్లికేన్‌లో 1940 ఫిబ్రవరి 24న బద్రీనాథ్ జన్మించారు. 1962లో మద్రాస్ వైద్యకళాశాలలో వైద్య కోర్సును పూర్తి చేశారు. అనంతరం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1970లో చెన్నై అడయార్‌లో వాలంటరీ హెల్త్ సర్వీస్ పేరిట సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయన మృతి నేత్ర వైద్య వర్గాల్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. తమిళనాడు సీఎం స్టాలిన్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

'కాళేశ్వరం' విచారణకు తెలంగాణ హైకోర్టే సబబు

వ్యాఖ్యానించిన ఢిల్లీ హైకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక అంశాలు విచారించడానికి స్థానిక హైకోర్టులే సబబని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కమిటీ లోపాలు వెల్లడించినా కేంద్రం చర్యలు తీసుకోలేదని, సీబీఐ విచారణ జరిపించాలంటూ పీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సుబ్రమణియం విచారించారు. హైదరాబాద్‌కు సంబంధించిన అంశం ఇక్కడికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుతం అక్కడ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడికి వచ్చామని, ప్రతివాది – 2 నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఢిల్లీలోనే ఉంటుందని నిరంజన్ తరఫు న్యాయవాది తెలిపారు. స్థానిక పరిస్థితులు, అంశాలను పరిశీలించి స్థానిక హైకోర్టు న్యాయమూర్తులే మెరుగ్గా విచారించగలరని జస్టిస్ సుబ్రమణియం అభిప్రాయపడ్డారు. పిటిషన్ ఉపసంహరించుకొని తెలంగాణ హైకోర్టుకు వెళ్లాలని సూచించారు. పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ విజ్ఞప్తిపై విచారణ చేపడతాం

జల విద్యుత్కేంద్రాలను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తేవాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదిపై ఉన్న జల విద్యుత్కేంద్రాలను కూడా కేఆర్‌ఎంబీ పరిధిలోకి తేవాలంటూ మధ్యంతర ఉపశమనం కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విజ్ఞప్తిపై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కృష్ణానదిపై జల విద్యుత్కేంద్రాలను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో ఇదివరకే ఉన్న పిటిషన్‌కు దీనిని జతచేయాలని కోరారు. వేరే ధర్మాసనం వద్ద ఉన్న కేసు, ఈ పిటిషన్‌లో ఉన్న అంశం వేర్వేరని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండింటినీ జత చేయాలని, లేకపోతే ఒకేసారి వినాలని వైద్యనాథన్ అభ్యర్థించారు. ఇతర కోర్టులో కేసు వివరాలు తమకు తెలియని కారణంగా ఆయా వివరాలు ఏపీ, తెలంగాణ, కేంద్రం ధర్మాసనానికి అందజేయాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ఆదేశించారు. అయితే ఏపీ ప్రభుత్వం కోరిన మధ్యంతర ఉపశమనానికి సంబంధించి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ డిసెంబర్ 12వ తేదీకి వాయిదా వేశారు.

ఎన్‌ఐటీహెచ్‌ఎం డైరెక్టర్ నియామకంపై వివరణ ఇవ్వండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (ఎన్‌ఐటీహెచ్‌ఎం) డైరెక్టర్‌గా ఎస్.చిన్నంరెడ్డి నియామకంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 18న చేపట్టే తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని ఆదేశించింది. ఎన్‌ఐటీహెచ్‌ఎం డైరెక్టర్ పోస్టుకు అర్హత లేకున్నా చిన్నంరెడ్డిని నియమించారని, దీన్ని 'కాగ్' కూడా తప్పుబట్టిందంటూ కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ హైకోర్టులో కోవారెంటో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. గతంలో అర్హత లేదంటూ ప్యానల్ తిరస్కరించినా సీఎంతో ఉన్న సాన్నిహిత్యంతో చిన్నంరెడ్డి నియమితులయ్యారని పిటిషనర్ న్యాయవాది వాదించారు. 2018 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్న చిన్నంరెడ్డికి భారీగా జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. వాదనల అనంతరం కేంద్రం, రాష్ట్ర సీఎస్, యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి, ఎన్‌ఐటీహెచ్‌ఎంలతోపాటు వ్యక్తిగత హోదాలో చిన్నంరెడ్డికి న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు.

కృష్ణా ట్రిబ్యునల్ టీవోఆర్‌పై కౌంటరు దాఖలు చేయండి

తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా ట్రిబ్యునల్‌–2కు కేంద్రం నోటిఫై టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్)పై స్టే ఇవ్వాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన దరఖాస్తుకు కౌంటరు దాఖలు చేయాలని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఏపీ ప్రభుత్వం వేసిన దరఖాస్తును జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఇదే అంశానికి చెందిన ఇతరత్రా కేసుల వివరాలను ఆరా తీసింది. స్టే కోరు తూ అప్లికేషన్ దాఖలు చేశామని ఏపీ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం తదుపరి విచారణను డిసెంబర్ 12కు వాయిదా వేసింది.

సీఈఐఆర్ పోర్టల్ పనితీరుపై వర్క్‌షాప్

- హాజరైన తెలంగాణ, కేరళ, తమిళనాడు, ఏపీ అధికారులు
- ఏడు నెలల్లోనే 12,500 మొబైల్ ఫోన్లను గుర్తించిన తెలంగాణ పోలీసులు
- వర్క్‌షాప్‌లో వివరాలు వెల్లడించిన అదనపు డీజీ మహేశ్ భగవత్



సాక్షి, హైదరాబాద్: పోగొట్టుకున్న, అపహరణకు గురైన మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు వినియోగిస్తున్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) సౌత్‌జోన్ వార్షిక వర్క్‌షాప్‌ను మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు తెలంగాణ, కేరళ, తమిళనాడు, ఏపీకి చెందిన టెలికం డిపార్ట్‌మెంట్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పోర్టల్ వినియోగంతో సాధించిన ఫలితాలు, విజయవంతంగా అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ...సీఈఐఆర్ పోర్టల్ అమల్లోకి తెచ్చిన ఏడు నెలల్లోనే 12,500 మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. జాతీయస్థాయిలో 35% రికవరీ రేట్‌తో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామానికి చెందిన వద్దం ఫ్లెమ్మింగ్ క్రిష్.. తుర్కయాంజాల్ సమీపంలోని న్యూ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారుజామున హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. క్రిష్ మృతదేహాన్ని తల్లిదండ్రులు రాకముందే హాస్టల్ సిబ్బంది ఉస్మానియా ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. తెల్లారేసరికే హాస్టల్ విద్యార్థులను ఇళ్లకు పంపించారు. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం వేధింపులే కారణమని స్థానిక విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న ఫ్లెమ్మింగ్ వద్ద సూసైడ్ నోట్ లభించింది. 'సారీ డాడీ, సారీ అక్క, సారీ ఫ్రెండ్స్'అని లేఖలో రాసినట్లు తెలిసింది. విద్యార్థి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.